TIGHT BINDING BOOK

UNIVERSAL LIBRARY
OU_204364
UNIVERSAL LIBRARY

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T82 B88K    Accession No. T4051

Author    బూర్గుల రంగనాథ

Title    కుశర్గ్న సరుకు    1950.

This book should be returned on or before the date last marked below.

“కళా కేళి ధర్మసంగ్రామ కేళి”

# కుళ్ళుసరుకు

ముద్రణ : శ్రీ పరాశక్తి, తెనాలి

ముఖచిత్రం : శ్రీ వడ్డాది పాపయ్య, చికాకోలు.

తొలిసారి: జూన్ 1950 వెల : రూపాయిపావలా.

## కళాకేళీ ప్రచురణలు

- కామేశ్వరికథ : రాంషా (ప్రతులులేవు)
- విగ్రహం : చిన్నా
- వజ్రాయుధం : సోమసుందర్ (జప్తు చేయబడింది)
- శిధిలాలయం & బూట్సు : చిన్నా
- స్వాసేవా ఒహామ్ : ఆరుద్ర
- ఝానిసలదేశం : సోమసుందర్
- అనామకులు : ఆస్కార్ వైల్డు [జోగిరాజు]
- కళ్లసరుకు : బ్రూ [చిన్నా]

### త్వరలో :

- మాల్వా : గోర్కీ [రాంషా]
- మందీ - మనిషీ : ఎర్నెస్ట్ టోలర్ [సోమసుందర్]
- మనస్తత్వాలు : రాంషా
- బాల్యం : గోర్కీ [సోమసుందర్]

# కుళ్ళు సరుకు

బ్రా.

**LES AVARIS** అనే ఫ్రెంచి నాటకానికి

చిన్నా అనువాదం

[8]

సంపాదకుడు : దర్భా రాంషా

★ శామల్కోట ★


కళాకేళీ ప్రచురణలు.

ఏప్రిల్ 10, 1950 వ తేదీన, కాకినాడ, ఆంధ్రనాట్యకళాపరిషత్
సభల్లో కళాకేళీ థియేటర్, పెద్దాపురం వారిచే
తొలిసారి ప్రదర్శింపబడింది.

| | | |
|---|---|---|
| డాక్టర్ | .... | శ్రీ రాంషా |
| రాఘవేంద్రం | .... | శ్రీ సోమసుందర్ |
| గా. వెంకట్రామయ్య | .... | శ్రీ జయంతి |
| కనకవల్లి | .... | శ్రీమతి కామేశ్వరి |
| సుందరమ్మ | .... | శ్రీమతి నూకాచలం |
| గొల్ల | .... | శ్రీమతి సరోజ |
| స్త్రీ | .... | శ్రీమతి గవర్రాజు |
| యువతి | .... | శ్రీమతి భాస్కరం |
| పురుషుడు | .... | శ్రీ సత్తిరాజు |
| మెడికల్ స్టూడెంటు | .... | శ్రీ చిన్నా |

నిర్మాతలు : చిన్నా & సోమసుందర్

# పరిచయం



'కుళ్లసరుకు' అనే ఈనాటకానికి 'బ్రూ' వ్రాసిన LES AVARIS మూలం. బ్రూ ఫ్రెంచి రచయిత. 1905 సంవత్సరంలో జాన్‌పోలక్ అనే ఆయన ఈనాటకాన్ని తొలిసారి ఆంగ్లంలోకి అనువదించాడు. పురాతన సాంప్రదాయాలకు అలవాటుపడ్డ ఫ్రెంచి ఛాందసులెవళ్లూ ఈనాటకాన్ని పరిగ్రహించలేక పోయారు.

మొత్తం పదిహేను నాటకాల్నిబ్రూ వ్రాశాడు. వాటిలో ఇది, మెటర్నిటో. త్రీ డాటర్స్ ఆఫ్ మన్‌షూర్ దు పోం అనేవి ప్రసిద్ధికెక్కాయి. ఈనాటకాల ద్వారా మన్‌షూర్ బ్రూ రొమాన్సు రచనకే కొత్తదారులు త్రొక్కించాడు. అతని హేతుదృష్టియే అతని ప్రత్యేకత. తరువాతి రెండు నాటకాలను వరుసగా బెర్నార్డుషా సతి, జాన్ హాంకిజ అనే వారు అనువదించారు.

అనువాదం అయిన నాటినుంచి ఈమూడింటినీ కలిపి పుస్తకరూపంలోకి తేవాలని బెర్నార్డుషా సతి ఎంతో ప్రయత్నం చేసింది. కాని "పేరు ప్రఖ్యాతులకు లోపం వస్తుందని" ఒకరూ, "కొనేవాళ్లుగాని, చూచేవాళ్లుగాని ఉండర"ని ఒకరూ, "కుళ్లసరుకు ఘోరంగా ఉంద"ని ఒకరూ—మొత్తం మీద ఎవరూ వీటిని ప్రకటించటానికి పూనుకోలేదు.

అయితే నాలుగు సంవత్సరాలల్లో, ఫ్రెంచి ఎకాడమీకి బ్రూ మెంబర్ కావటంవల్ల, పరిస్థితులు మారి, 1911 మేలో తొలిసారి పుస్తకరూపాన్ని పొందాయి. దానికి మిస్టర్ బెర్నార్డుషా నలభై పేజీల ఉపోద్ఘాతం వ్రాశాడు.

అచిరకాలంలోనే ఇంగ్లండులో నాలుగు ఎడిషన్లు అమ్ముడు పొయ్యాయి. అమెరికాలో ఇంగ్లండులో కంటె ఎక్కువగా అమ్ముడయ్యాయి. అందుకు, యేల్ యూనివర్శిటీ ప్రొఫెసరు, కొనిక్టికట్ సొసైటీ ఆఫ్ సోషల్ హైజీనుకు కార్య

దర్శి అయిన డాక్టర్ థామస్ య౽. హెప్‌బర్న్ మహాశయుడే కారణం. యేల్ హార్వార్డ్, జాన్స్ హాప్‌కిన్స్, చికాగో, బోస్టన్, బాల్టిమోర్ యూనివర్శిటీల అధ్యక్షులు, ప్రొఫెసర్లుకూడా నడుం బిగించారు. మిస్టర్ ఫెన్నెట్ పల్లెపల్లెనా పెద్ద పెద్ద గుడారాలు వేసి లక్షలాది ప్రజలకు ఈనాటకాన్ని ప్రదర్శనం చేశాడు.

కాని ఇంగ్లండులో మాత్రం పరిస్థితులు అతి నెమ్మదిగా సాగేయి. ఎందరో ఉత్సహించినా, ప్రదర్శనం విషయంలో ప్రభుత్వం అంగీకరించక పోవటం వల్ల, వారివి అడియాస లయ్యాయి.

ఆఖరికి, యునైటెడ్‌స్టేట్స్ నుంచి జార్జి బేక్టస్నర్, అయన భార్య మిస్ దరోతీఉస్‌నర్‌లు ఎలాగో ఈనాటకాన్ని ప్రదర్శించాలని వచ్చారు. ఆదంపతులకు అఖండ సన్మానం చేసిన థియేటర్ యజమానులుకూడా అందుకు ఎలాంటి సహాయమూ చేయలేక పోయారు.

చివరికి 16 ఫిబ్రవరి 1914 న ఆథర్స్ ప్రొడ్యూసింగ్ సొసైటీవారు లిటిల్ థియేటర్‌లో తొలిసారి ప్రదర్శించారు. తరువాత కోర్టు థియేటర్‌లో మరికొన్ని ప్రదర్శనాలు జరిగాయి.

ఈ ప్రదర్శనానికి ఏవో కొద్ది పత్రికలు మాత్రమే తమ ప్రతినిధుల్ని పంపాయి. వాటిలో పాల్‌మాల్ గెజిట్ ఇలా వ్రాశింది. "ఆయువకుణ్ణి (కుళ్ల సరుకులో రాఘవేంద్రం) చూస్తే కడుపు చెరువవుతుంది, కంపల్‌సరీగా ఈవిషయాలను చెప్పని విద్య కపటమూ, వినాశహేతువూ కాలుగుతుంది." మైమ్సు వ్యాఖ్యాత ఇలా అన్నాడు: "నిర్లక్ష్యతలోంచీ, అవమానంలోంచీ, తెలివితక్కువ తనం నుంచీ, అహంభావం నుంచీ పుట్టిన అజ్ఞానం—యువకుల్ని వారి కుతూహలం మీదనే విడిచిపుచ్చే అజ్ఞానం—రోగాలతోనిండి. నివారణోపాయాన్ని తెలియని ప్రపంచపు అజ్ఞానం—ఆ అజ్ఞానం డాక్టరుకు సహించరానిది, మన్‌షూర్‌బ్రూ ఎదుర్కొన్న అవినీతికి ఇంతకన్న వేరే మందులేదు."

తెనుగు అనువాదాన్ని తమ "అభిసారిక" లో వరుసగా ప్రకటించారు శ్రీ ధనికొండ. ఎందరో పాఠకులకు కనువిప్పు కలిగించినట్టుగా ప్రశంసించే ఉత్తరాల్ని చదివి వినిపించారు. ముద్రణలో ఎంతో సహకారం చేశారు. వారికి మా ధన్యవాదాలు.

తొలిప్రదర్శన సందర్భంలో సముచితసానుభూతిని ప్రకటించిన శ్రీయుతులు బెజవాడ గోపాలరెడ్డి, నార్ల వెంకటేశ్వరరావు, కొప్పరపు సుబ్బారావు, వేమూరి ఆంజనేయశర్మ, స్థానం నరసింహారావు ప్రభృతులకుకూడా మా అభివందనాలు.

ఈ సందర్భంలో థొరో (THOREAU) చెప్పిన మాటలు కొన్ని జ్ఞాపకం వస్తున్నాయి: "పుస్తకాలు సంతోషానికి మేలిముసుగువేసి అందించేవికావు; నిజమైన పుస్తకంలో ప్రతి యోచనా దూసిన కత్తిలా ఉండాలి. బద్ధకస్తుడు చదువుకోటానికీ, కొంటెవాడు ఆనందించటానికీ వీలులేకుండా వర్తమానవ్యవస్థకు వజ్రాయుధమైనట్టయితే, వాటినే నేను ఉత్తమగ్రంథాలంటాను."


—ప్రకాశకులు.

తాజా: ఈ నాటకంలో కళకన్నా "ప్రచారధోరణి" ఎక్కువ ఉన్నదనే [చూ. అభిసారిక మే సంపాదకీయం] విమర్శలేకపోలేదు. దానికి సమాధానంగా ఆక్స్ఫర్డు యూనివర్సిటీహాలులో 28 ఫిబ్రవరి 1914 న జార్జి బెర్నార్డుషా ఇచ్చిన ఉపన్యాసభాగాన్ని ఉదహరిస్తాము:

"సోఫొకిల్స్ శిల్పాన్నిగురించి ఇంతకుముందే చెప్పాను నేటికీ ఆశిల్పం సజీవమే. ఎజినీ బ్రూ రూపంలో యూరప్కింకా ఒక సోఫొకిల్స్ ఉన్నాడు. అయితే రెండు సంవత్సరాలక్రితం ప్రదర్శింపబడ్డ ఈడిపస్ని తెగపొగడిన విమర్శకులే ఈనాటకంలోని [కుళ్లుసరుకు] అమోఘశిల్పాన్ని అర్థం చేసుకోలేకపోగా ఇది నాటకమేకాదనీ, ఒక కరపత్రమనీ సెలవిస్తున్నారు. సూత్రాల్ని వల్లెవేసే ప్రజ్ఞమాత్రమేకాకుండా బుద్ధిసూక్ష్మత ఉన్నవారికి ఈడిపస్, లెస్ ఏవరిస్లు రెండూ శిల్పంలో సమాంతరమని అర్థమయ్యేది. సమకాలీన విషయాలలోకల్లా భయంకరమైనదాన్ని ఎంతో సాహసంగా ధైర్యంగా సోఫొకిల్స్ బైటపెట్టాడు. బ్రూ అందులో ఇంకా ఎక్కువ సాహసాన్నీ, ధైర్యాన్నీ ప్రకటించాడు. ఇది మొదటి విషయం. సాంప్రదాయకంగా వస్తూన్న నీతిని అందరూ శిరసావహిస్తున్నప్పుడు దానిని శ్లేషించటమో, ఎగతాళిచేయటమో కాకుండా సూటిగా తూర్పారబట్టటం రెండవది. తద్వారా పాఠకుల్లో ప్రేక్షకుల్లో పెదదారులు తొక్కించలేము. సోఫోక్లియన్శిల్పం మూడవది: పరిస్థితులకు అలవాటుపడి హాయిగా బ్రతుకుతున్న పెద్దమనిషిని తీసుకువెళ్ళి, అతనెంత అసహ్యాదుర్గంధభూయిష్టమైన జీవితాన్ని

గడుపుతున్నాడో ఆరోహణక్రమంలో విశదపరచటం. ఇందులో సోఫొకిల్స్‌నే బ్రూ జయించాడు. సోఫొకిల్స్ సృజించిన ఈడిపస్ సామాన్యుడు. కాని బ్రూ సృజించిన లోఖెస్ [గొ. వెంకట్రామయ్య] ఒక అధికారి. ఆయన కోపంగా రంకెలువేస్తూంటే బ్రూ ఆయన్ని మాటలతో కిందికిదింపుతాడు. అప్పుడు ఆయన నీతి నగ్నత్వం, దివాలాతత్వం వెల్లడౌతాయి. అదిమనం సహించలేం. ఎందుకంటే అతని మేడిపండుతత్వంతోబాటు మన మేడిపండుతత్వంకూడా విచ్చిపోవచ్చు. సోఫొకిల్స్ తనరచనతో ఈగుణాన్ని సాధించలేదు. ఎందుకంటే మనమెవళ్ళమూ ఈడిపస్సులంకాము. మనం మన తండ్రుల్నిచంపి, మనతల్లుల్ని పెళ్ళాడకపోయినా, కనీసం పొరబాటునన్నా అలా ప్రవర్తించిఉండం. కనుక ఆనాటకాన్ని చూస్తూన్నంతసేపూ మనబ్రతుకు బండారం బైటపడుతోందనుకోలేం. అయితే వచ్చిన ఖర్మఏమిటంటే మనలో ప్రతిఒక్కడూ ఒక్క లోఖెస్ [గొ. వెంకట్రామయ్య.] అలాగే జార్జిలం [రాఘవేంద్రం] కూడా. ఈశిల్పం ఈరెండు పాత్రలతోటీ రెండుసార్లు ఈనాటకంలో రాణించింది. కనుకనే మనం బ్రూని ఉత్తమ రచయితగా చెప్పుకోవాలి."

—ప్ర.



## ఒకటో రంగం

దృశ్యం : మద్రాసు. డాక్టర్‌గారి సలహా గది.

[కుడివైపు కిటికీ. దానికి సమాంతరంగా పెద్ద టేబిల్, కాగితాలు, ఫైలు, మందుల కేటలాగులు వగైరా. టేబిల్‌కీ, కిటికీకీ మధ్య డాక్టర్‌గారి రివాల్వింగ్ ఛైర్. రెండోవైపు ఫుట్‌లైట్స్‌కి ఎదురుగా ఆరమ్‌ఛైర్; స్టూల్. ఎడమవైపు ద్వారం. మూలగా పుస్తకాల బీరువా. ఒకపక్క స్టేండ్ మీద వాష్ బేసిన్, టవల్, సోప్. వెనకవైపు ద్వారం.

రాఘవేంద్రం వెనక ద్వారంగుండా సూట్ మడతలు సర్దుకొంటూ ప్రవేశిస్తాడు. చాలావిచారంగా ఉంటాడు. గుండ్రని పెద్ద కళ్లు, అందమైన ముఖం, వయసు ఇరవైఆరు. ఆరమ్‌ఛైర్‌లో కూలబడి దీర్ఘంగా నిట్టూరుస్తాడు. డాక్టర్ వెనకనేవచ్చి బేసిన్‌లో చేతులు కడుక్కొని రివాల్వింగ్ ఛైర్‌లో కూర్చుంటాడు. వయసు నలభై. బలమైన శరీరం, తెలివైన కళ్లు.]

రాఘ : ఏమంటారు, డాక్టర్?

డాక్టర్ : అవ్వే, ఈవిషయంలో ఇంక సందేహం లేదు.

రాఘ : (నుదురు తుడుచుకొంటూ) సందేహం లేదు — సందేహం లేదని ఎలా అంటారో చెప్పండి!

డాక్టరు : ఉండవలసిన లక్షణాలన్నీ ఖచ్చితంగా ఉన్నాయ్. అందుకే సందేహం లేదంటాను. [వ్రాసుకొంటాడు. రాఘవేంద్రం తెల్లబోతాడు; ఏదో భయం ఆవహించినట్టు ఒక్క క్షణం నిశ్చేష్టుడైపోతాడు; మళ్ళీ నిట్టూరుస్తాడు] చెప్పు. నీకున్న ఇబ్బంది ఏమిటో ఇప్పటికైనా అర్థమైఉంటుంది.

రాఘ ; అబ్బే .... అహఁ....

డాక్టరు ; ఆఁ, తెలియదంటే ఎలా ?

రాఘ ;(కుంగిపోతూ) భగవాన్!

డాక్టరు : (వ్రాయటం మాని రాఘవేంద్రాన్ని పరికిస్తూ)అనవసరంగా కంగారు పడబోకయ్యా. ఇందులో పెద్ద విశేషమేమీ లేదు. లక్షలాది జనాన్ని నీవు చూస్తూనే ఉంటావ్. — వీధుల్లో, క్లబ్బుల్లో, కాలేజీల్లో, సినీమాల్లో — ఎందర్నో కలుస్తూనే ఉంటావ్. అవునా ? వాళ్ళలో ప్రతి నలుగురిలోనూ ఒకడు ఇదే దురవస్థలో ఉన్నాడంటే నమ్ము.

రాఘ : (నిశ్చలంగా మెల్లిగా) సరేలెండి! ఏంచెయ్యాలో ఇదివరకే నిశ్చయం చేసుకొన్నాను.

డాక్టరు : అలా అన్నావ్ బాగుంది. ఇదిగో నీకు ట్రీట్‌మెంట్. దీన్ని మీ ఫేమిలి డాక్టర్‌కి చూపించు. ఆయన మందిస్తాడు. మళ్ళీ వారంరోజులు తరువాత ఒకసారి రా.

రాఘ : (ప్రిస్క్రిప్షన్ తీసుకుంటూ) అలా చేయడానికి వీల్లేదండీ బాబూ!

డాక్టరు : అదేమిటోయ్! ప్రతిరోగీ ఏం చేస్తాడో నువ్వూ అంతే చేయాలి.

రాఘ : ఎవ్వడూ నాఅంత దురవస్థలో లేడండీ బాబూ....! సరేలెండి! ఇక ఈ జీవితానికి ఇదే ఆఖరు. (చేతిని కణతలువరకూ ఎత్తుతాడు.)

డాక్టరు : నాదగ్గర సలహాకొచ్చి అదేకుర్చీలో కూర్చున్న ప్రతి ఆర్గురు రోగుల్లోనూ ఐదుగురు పొడుచుకు చచ్చిపోతామనే చెప్తారు. నిజంగానే చెప్తారనుకో. ప్రతిఒక్కడూ తనకొక్కడికే ఏనాటి శనో నెత్తిమీద తంతోందని అనుకొంటాడు. వాళ్ళని సముదాయించి దారిలోకి తెచ్చేసరికి — అపుడు కళ్ళువిప్పి చూడ్డం ప్రారంభిస్తారు. ఈ రోగం తమకొక పీడలాంటి నేస్తం అనీ దానితోకలిసి మెలసి బ్రతకటం సులభ సాధ్యమేననీ తరువాత తరువాత గుర్తిస్తారు. ఒకటి మాత్రం నిజం — ఏ కుటుంబాల్లోనైనా సరే మనశ్శాంతి లభ్యపడాలంటే పరస్పరం కొంత ఉదారంగా సంచరించాల్సి ఉంటుంది.

రాఘ : కాని డాక్టర్‌గారూ....నేను....

డాక్టరు ; (వినకుండానే అడ్డు వస్తూ) నీ విషయంలోకూడా పెద్ద విశేషంలేదని, ఇది సాధారణమైన సంగతేనని మళ్ళీ చెపుతున్నాను. సిఫ్లిస్ రావటం ఒక ప్రమాదమే అనుకో. అది ఎవరికైనా రావొచ్చు. ఈ వ్యాధివొక్క చోటేలేదు— ప్రపంచమంతా ఉంది.

రాఘు : (ట్రీట్‌మెంట్ కాగితం జేబులో పెట్టుకొంటూ) ఏమైనా ఈ జబ్బు నాకు రావలసింది కాదు, డాక్టర్.

డాక్టర్ ; ఎందుచేత? డబ్బున్నవాడివనా? అధికారం ఉన్నవాడివనా? పెద్ద కుటుంబీకుడివనా?

రాఘు : డాక్టర్‌గారూ! అందరిలానే నేనెపుడూ అడ్డమైనవాటికీ కక్కుర్తి పడలేదండీ బాబూ! ఎంతో జాగ్రత్తగా ఉండేవాణ్ణి. నా జీవితంలోకల్లా ఇద్దరాడాళ్ళనే ఎరుగుదునండీ!

డాక్టర్ : నిన్నిక్కడికి తీసుకురావడానికి ఒక్కతే చాలు నాయనా.

రాఘు : ఆ ఇద్దరిలోనూ ఒకత్తెకూడా అలాంటిది కాదండీ డాక్టర్! నిజం! దీనికి నేనెంత భయపడేవాడినో మీకేం తెలుసు? ఇది రాకుండా ఉండాలని ముందుగా ఎంతో జాగ్రత్తపడ్డాను. తొలిసారిగా నేననుభవించిన ఆమె నాకెంతో ఆత్మీయుడైన స్నేహితుని భార్య. అతన్ని గౌరవమర్యాదల్ని చూసే ఆమెని ఎన్నుకొన్నాను. అతనికి నీతి నియమాలమీద గట్టిపట్టుదల ఉండేది; భార్యని గడప కదలనిచ్చేవాడు కాదు; ఎపుడూ ఘోషాలోనే ఉంచేవాడు. ఈ జబ్బును గురించి ఎంతో భయంకరంగా వర్ణించి చెప్పి ఆమెనెంతో గజగజలాడించేవాణ్ణి. ప్రతి ఒక్కడికీ ఈ రోగం ఉందని చెప్పేవాణ్ణి — దానిలో ఇంకెవ్వడితోటీ కలలోనైనా సంబంధాలు పెట్టుకో దానికి హడలిపోతుందని; నాకెప్పుడూ ఎలాటి ద్రోహాన్నీ తలపెట్టడానికి భయపడుతుందనీను. చివరికి నా స్నేహితుడు నాచేతుల్లోనే చచ్చిపోయాడు, ఆఖరికి అదొక్కటే ఆమెనుంచి నన్ను విడదీయగలిగింది. రెండో ఆమె వొక దాసీమనిషి.

డాక్టర్ : కొంచెం నమ్మదగ్గ నీతి నియమాలున్న వాళ్ళనెవళ్ళనీ ఎరగవనుకొంటాను. అవునా?

రాఘు ; ఎలా తెలుస్తుంది చెప్పండీ! ఈ రోజుల్లో నీతులంటే మీకు తెలియంది గనకనా?

డాక్టర్ : బాగా తెలుసు.

రాఘు : ఈమె చాలా 'నీట్'గా ఉంటుంది డాక్టర్! దాసీపనికూడా మాన్పించేశాను. కాని వెనక పెద్ద సంసారం. చాలా బీదవాళ్ళు పాపం! వాళ్లమ్మ దీర్ఘరోగి; తండ్రి అదొకలాంటి జబ్బుమనిషి; ఇంకా ముగ్గురు చిన్న తమ్ముళ్ళున్నారు. నే నిచ్చే దాంతో వాళ్ళంతా బతకాలి పాపం! వాళ్లంతా నన్ను 'బావగారూ'అనే పిలిచేవారు. నా అసలు పేరు వాళ్ళకు చెప్పలేదు నేను.

డాక్టర్ : (మెల్లిగా) అవున్లే. అదే మంచిపని.

రాఘు : ఇంకొకడితో వెళ్ళిందంటే వెంటనే వొదిలేస్తానని బెదిరించాను. అలా అని ఆ ఇంట్లో వాళ్ళందరికీ తెలుసు. అందుకే ఆమె నెపుడూ ఒకకంట కనిపెడుతూ ఉండేవారు. ఆమె నొకతెనీ బైటకు వెళ్ళనిచ్చేవారు కాదు. తరువాత మూడునెలల క్రితం — నా పెళ్ళి విషయం రాగానే ఆమెను వొదిలేశాను. ఏంచేస్తాను చెప్పండీ పాపం, వాళ్ళెంతో తల్లకిందులై పోయారు. నిజం డాక్టర్! నేనేమీ కల్పించి చెప్పటంలేదు. నమ్మండి నామాట! వాళ్ళంతా గోలెత్తారు. ఏం చెయ్యను చెప్పండి! ఎంత చెడ్డా పెళ్లి మానుకోగలనా?

డాక్టర్ : ఆమెతో ఎంతో సుఖంగా ఉండేవాడినన్నావే మళ్ళీ నీకీ బుద్ధి ఎందుకు పుట్టింది ?

రాఘు : (ఆ ప్రశ్నకు ఆశ్చర్యపోతూ) జీవితంలో ఇక స్థిరపడాలను కొన్నాను. మా నాన్న గారు పెద్ద పేరున్న లాయరని మీకు తెలుసను కొంటాను — మేనరికం చేసుకో మని ఆయన ఆఖరి కోర్కె. చాలా మంచి సంబంధమండీ, ప్రాక్టీసు పెట్టుకోడానికి ఆవిడ సొమ్ము ఎంతో సహాయపడుతుంది — అదీగాక ఆమె నెంతో గౌరవిస్తాను కూడా. నేనంటే ఆమెకూ ఎంతో ప్రేమ. జీవితాన్ని సుఖప్రదం చేసుకోడానికి తగిన జీవిత సామగ్రి పుష్కలంగా ఉందిమాకు. నన్ను చూచి స్నేహితు లెంతో ఈర్ష్యపడతారు. పెళ్ళివైభవంగానే జరుగుతుంది; నన్నెరిగినస్నేహితులంతా నావివాహ సందర్భాన్ని పురస్కరించుకొని చిన్న టీ పార్టీ ఇస్తూ ఏదో విధంగా నన్ను ఎగతాళి చేస్తారు. చూడండి. ఎలాంటి దుస్థితి వచ్చిందో! ఇంతకీ నా కిదృష్టంలేదు. కుక్కల కంటే కనిష్టంగా బతికిన వాళ్లనికూడా ఎందర్నో ఎరుగుదును. అదేమదృష్టమో కాని వాళ్ల కేరోగమూ రాదు. పశువులు! నా కంటారా! — నాలాంటి కుష్టురోగికి ఇంక మిగిలిందేమిటో చెప్పండి ? నా భవిష్యత్తంతా పూర్తిగా శిథిలమై పోయింది; నా యావజ్జీవితమంతా విషమయమైంది. అలాటప్పుడు, ఆ పంకిలం నుంచి బైట పడటం మంచిది కాదంటారా? ఏమైనా సరే, ఇలా నేను బాధపడేందుకు వీల్లేదు. మీకు మాత్రం తెలీదుగనకనా ? — నే నున్నంత దురవస్థలో మరెవరూలేరు. (ఏడుస్తూ) నిజమండీ డాక్టర్‌గారూ! (అరచేతుల్లో ముఖం కప్పుకొంటూ)ఓ, ఓ, ఓ.

డాక్టర్ : (లేచి, నవ్వుతూ అతని దగ్గరికివెళ్ళి) మగవాడవు! చిన్న పిల్లవాడిలా ఏడుస్తావా?

రాఘు : (కన్నీళ్లతో) పోకిరీగా తిరిగి నా జీవితమంతా వ్యభిచారిణుల ఇళ్ళలోనే గడిపితే అనుకోవచ్చు. 'నాకు తగ్గశాస్తే అయింది!, అని కొంత ఊరట కలిగేది.

డాక్టర్ : కాదు — కాదు.

రాఘు : ఏమిటి కాదండీ ?

డాక్టర్ : కాదు — నీ వలా అనకూడదు. అదివేరే విషయం అనుకో! చెప్పు....

రాఘు : నాకు తగినశాస్తి అయిందను కోందును డాక్టర్! కాని నిష్కారణంగా — ఏ పాపమూ ఎరగందే, భౌతికంగా అన్ని ఆనందాలకూ దూరమయ్యాను. స్నేహితు లతో కులాసాగా తిరగడంకూడా మాను కొన్నాను. ఊళ్లో ఉన్న తల్లులంతా వాళ్ళ కొడుకులకు నన్ను ఆదర్శంగా చూపించేవారు. ఆ పేరు ప్రతిష్టల్ని నిలుపుకోవాలని ఎంతో తాపత్రయపడ్డాను. ఆఖరికి నా'లా' పరీక్షలకి ఇద్దరు స్నేహితులు సాయం పట్టాల్సివచ్చింది. ఎల్లాగో చచ్చి చెడి బైటపడ్డాను. సివిల్ క్రిమినల్ సెక్షన్లని గాలించే బదులు, తెల్లవారుఝామున నాలుగ్గంటలకి ఏ భోగందాని ఇంట్లో అంటించు కొన్న సిగరెట్టో పీల్చుకొంటూ ఇంటికి రావాలని కలలుకనే వాణ్ణి. తాంబూలం నవలిన ఎర్రని వాళ్ళ పెదవుల్నీ, చళతకా మెరిసిపోయే వాళ్ళ నల్లని కనుపాపల్నీ, వాళ్ళ పాలిపోయిన ముఖాల్నీ తలపోసుకొని గుటకలు మింగే వాణ్ణి. వాళ్ళ కిలకిల నవ్వుల్లో, వాళ్ల జావళీల్ని వింటూ వాళ్ల శరీరాల్లోని నిమ్నోన్నతాల్ని చూస్తూ సర్వాన్నీ మరచి, నన్ను నేను మరచిపోవాలనీ అనుకొనే వాణ్ణి — యీ వూహ

ల్లోనే నా ఆరోగ్యం వారికోసం త్యాగంచేసి వేశాను. అయినా నా ఖర్మం చూడండి! ముందుగానే నాకీ ఘోరఫలితాలు తెలిసివుంటే యీ గోతిలో పడే వాణ్నే కాదు.....

డాక్టర్ : ఏమిటా నాన్సెన్సంతా ?

రాఘు : ఔను — నాకు తెలుసులెండి —జుట్టూడిపోవటం, వొంటినిండా మచ్చలూ, చెవుడు, కళ్ళు కన్పించకపోవటం పక్షవాతం—ఇంకెందుకూ పనికిరాకుండాపోయి తోపుడు కుర్చీ వొకటి కొనుక్కొని వెనక వొకడుతోస్తుంటే — అయ్యో .... (ఏడుస్తాడు) అంతే — నాగతీ అంతేనండీ డాక్టర్. ఈ'బావగారి'కి ఇక మిగిలేది కూడా అంతే నండీ!

డాక్టర్ : మైడియర్ సార్! ఆఏడుపు కొంచెం ఆపి దయచేసి చెప్పేది వినండి!

రాఘు: (ఏడుపుమాని)అలాగే డాక్టర్! కాని నాగురించి మీ టైమంతా వ్యర్థంచేసుకొంటున్నారు.

డాక్టర్ : నాకేమీ ఫరవాలేదు. నేను పూచీ ఇస్తాను నాయనా!

రాఘు : మీరేం చెప్పాలనుకొంటున్నారో నాకు తెలుసులెండి బాబూ!

డాక్టర్ ; అయితే ఇంక నాతో పనేముంది? నీఇష్టం వచ్చినట్టు చెయ్యి.

రాఘు : క్షమించండి డాక్టర్! సరే, చెప్పండి — ఇంతదయ భరించలేనండీ!

డాక్టర్ : నీకు మనస్ఫూర్తిగా ఆసంకల్పమేఉంటే తగుమాత్రం శ్రిద్ధ వహిస్తే చాలు, నీవు భయపడుతున్న దారుణఫలితాలన్నీ రాకుండాపోతాయ్.

రాఘు : అవునులెండి! మీరు చెప్పండి డాక్టర్!

డాక్టర్ : ఈనగరంలో వేలకొద్దీ ఆరోగ్యవంతులు లేకపోలేదు. రా. చెప్పు — నువ్వూ, నీతోపుడు కుర్చీలు — అన్నీ! కాని అందరూ నీవనుకున్నంత దారుణంగా ఉన్నా రంటావా?

రాఘు : లేదు డాక్టర్, నిజమే ....

డాక్టర్ : పైగా నీవనుకొన్న కారణాలుగా వీళ్ళంతా ఆతోపుడుకుర్చీల్లో కూర్చోలేదు. తక్కిన వేలాదిప్రిజల్లాగే నీవెందుకు కుంగిపోవాలి? ఎటొచ్చీ — ఇదికొంచెం సీరియస్ విషయం — అంతే!

రాఘు : కాని చూడండి! ఇది చాలా భయంకరమైన వ్యాధి —

డాక్టర్ : ఔను.

రాఘు : భయంకరమైన వ్యాధుల్లో ఇదొకటికదండీ?

డాక్టర్ : ఔను — కాని నీవు చాలా అదృష్టవంతుడివి.

రాఘు : ఏమిటా అదృష్టం?

డాక్టర్ : పోల్చి చూస్తే చాలా అదృష్టం అనాలి — వ్యాధులన్నిటిలోకీ ఆవొక్క భయంకరమైన వ్యాధినే అంటించుకోవటం అదృష్టం కాదా? దానికి నివారణోపాయాలు చాలా ఉన్నాయి. అంతవరకు సంతోషించు.

రాఘు : నాకు తెలుసులెండి — వ్యాధికంటే దారుణమైన మందులుకూడా ఉన్నాయని.

డాక్టర్ : అదేమీ కాదోయ్!

రాఘు : ఐతే ఈ జబ్బు నిజంగా కుదురుతుందనే చెపుతున్నారా ?

డాక్టర్ : తప్పక కుదురుతుంది.

రాఘు : ఐతే నామీద ఈ నింద పోతుందంటారా డాక్టర్ ?

డాకర్ : నేను పూచీపడుతున్నాగా !

రాఘు : మీరు — మీరు నన్ను 'ఫూల్'ని చెయ్యటం లేదుకదా ? నేను ఎన్నో విన్నాను.

డాక్టర్ : (బుజాలెగరవేసి) ఔను — విన్నావయ్యా — చాలా విన్నావు! ఆస్థి హక్కుల లోతుపాతులన్నీ నీకు తెలీదని ఎవరనగలరూ ?

రాఘు : ఔననుకోండి! కాని ఆవిషయం ఎందుకండీ ఇప్పుడు ?

డాక్టర్ : ఆ న్యాయశాస్త్రం అంతా చెప్పే బదులు — నీ విపుడు బాధపడుతున్న వ్యాధి లక్షణాలన్నీ చెప్పిఉంటే బాగుపడే వాడవు. అపుడు, బహూశా ఆజబ్బు అంటించు కోకుండా ఉండాలని తగిన జాగర్త పడేవాడవికూడా !

రాఘు : కాని ఈమె చాలా .... కాని డాక్టర్! ఎవరను కొంటారు చెప్పండి—ఇలాంటి స్త్రీకికూడా ఈతి బాధలు ఉంటాయని. నేనైనా వీధిముండల వెనక పరుగెత్తాలనుకో లేదు. పవిత్రమైన అడయార్‌లో ఉంటోంది — తైనామ్ పేటలో కాదండీ బాబూ!

డాక్టర్ : ఏ పేటైతే నేమిటి ? స్థలంతో ఏమీ సంబంధంలేదు. ఈ వ్యాధి అందరికీ వొక్క లాగే ఉండదు. బీదవాళ్ళని కనికరం కూడా ఉండదు దీనికి.

రాఘు : కాని ఈ అమ్మాయి అల్లాంటిది కాదండీ! నా స్నేహితుడు గోపాల్ ఇంట్లో అద్దె కుంటున్నారు. కొంతకాలం కాపరంచేసికూడా భర్త వదలిపెట్టేశాట్ట. పాపం! తల్లీ కూతురూ ఇద్దరే ఉంటుండేవారు లెండి! వాళ్ల అమ్మ గ్రామాంతరం వెళ్ళింది. మొదట్లో నేనెంత కాళ్ళా వేళ్లా పడ్డా ఆమె 'ససేమిరా' అంది. ఆఖరికి నేను ఒక గంట బతిమాలగా బతిమాలగా మా గోపాల్ పెళ్లానికి ఉన్న ఉంగరం లాంటిది చేయించి యిస్తానంటే, ఒప్పుకొంది. నౌకరుక్కూడా తెలియకుండా ఉండాలని— మేడ మెట్లెక్కేప్పుడు ఆఖరికి నా బూట్సుకూడా తీయించేసిందంటే నమ్మండి.

డాక్టర్ : ఔనులే! ఇంతకీ నేననేదేమంటే — ముందుగా నీవు తెలుసుకొనే ఉంటే — ఇవన్నీ నీకు రాబోయే ప్రమాదాన్ని రాకుండా కాపాడగలవనే గ్యారంటీ లేదని అర్థమయ్యేది.

రాఘు : ఔను మేమంతా పాఠాలు నేర్చుకోవాలి ఈ విషయంలో.

డాక్టర్ : అంతే! ప్రజలందరికీ నేర్పాలి. అందరూ ముందుగానే తెలుసుకొని ఉండాలి ఈ విపరీతాల్ని.

రాఘు : ఏమైనా పత్రికల్లో డిస్కస్ చేసేటంత గొప్ప విషయంకాదు డాక్టర్!

డాక్టర్ : ఎందుక్కాదు ?

రాఘ : ఏమో — కాదు అంతే; దేశపరిస్థితులు మారితేనేకాని....

డాక్టర్ : అంటే ?

రాఘ : మా నాన్న చిన్నపత్రిక నడిపేవాడు. సిఫ్లిస్ అనేమాట ఆ పత్రికలో పడిందంటే దాని 'సర్క్యులేషన్' ఎపుడో పడిపోయి ఉండేది.

డాక్టర్ : ఉన్నదీ లేనిదీ అంతా కల్పించి బూతు కథలన్నీ ప్రచురిస్తూంటారుగా ?

రాఘ : ఔననుకోండి ! ప్రజలకవే కావాలి మరి.

డాక్టర్ , అవునా ? విద్య నేర్చుకోవలసింది ప్రజలనీ, నేర్పవలసింది ఈ బుద్ధిమంతులేననీ ఎందుకు జ్ఞాపకముంచుకోరు ? ఒక పెద్దమనిషి వినోదం పేరుతో తన పిల్లల్ని అనేకచోట్లకి తీసుకువెళతాడు. డాక్టర్లుకూడా వినడానికి చూడ్డానికి సిగ్గుపడే—అనేక రకాల బూతుపాటలు వింటారు; దిగంబర నృత్యాలు చూస్తారు; అర్ధనగ్న చిత్రాలూ చూస్తారు. అభ్యంతరం లేదు. కాని అతనే— ఆ విషయం కొంచెం 'సీరియస్'గా, శాస్త్రీయంగా ప్రస్తావిస్తే సహించలేడు.

రాఘ : ఇంతకీ ఆ వ్యాధిగురించి పెద్ద 'పబ్లిసిటీ' ఇచ్చినందువల్ల, వచ్చే లాభమేమిటో చెప్పండి డాక్టర్ ?

డాక్టర్ : ఈ వ్యాధిగురించి పూర్తిగా తెలుసుకొంటే — అది ఎప్పుడూ రాకుండా తప్పించుకోవొచ్చునయ్యా !

రాఘ : మనక్కావలసింది అదేగా ?

డాక్టర్ : అవును. అది చాలా స్వల్పవిషయం.

రాఘ : ఎలాగో చెప్పండి !

డాక్టర్ : ఇప్పుడు నీకావిషయాలు అనవసరం; కాని నీకో కొడుకేఉంటే, ఏంచెయ్యాలో చెప్పగలవ్ !

రాఘ : ఏమని చెపుతానండీ !

డాక్టర్ : ఒకే స్త్రీని ప్రేమించమని; ఆమె మొదటి ప్రియుడివి మాత్రమే కమ్మని; జీవితంలో ఎప్పుడూ అవిశ్వాస పాత్రుడివి కాకుండాఉండేటంత ఎక్కువగా ఆమెను ప్రేమించమని ....

రాఘ : మాటలు తేలిగ్గానే అనేయగలం. కాని నా కొడుక్కే పాతికేళ్ళు వచ్చేదాకా పెళ్ళి కాకపోతే ?

డాక్టర్ : నీ అనుభవాన్ని బట్టయినా వాళ్ల అవసరాలు గ్రహించలేవా ?

రాఘ : కాని ఇంతకీ నాకు పిల్లలు పుడతారంటారా ?

డాక్టర్ : తప్పకుండా.

రాఘ : మంచి ఆరోగ్యవంతులే ?

డాకర్ : ఔను — ఆరోగ్యవంతులే! మళ్ళా చెబుతున్నాను; జబ్బు కుదిరేవరకూ కొంచెం జాగ్రత్తగా ఉన్నావా ఇక భయపడవలసింది ఉండదు.

రాఘు ; నిజమేనా డాక్టర్?

డాక్టర్ : తొంభై తొమ్మిది పాళ్లూ నిజం.

రాఘు : ఐతే పెళ్ళి చేసుకోగల నంటారా?

డాక్టర్ . చేసుకోగల వయ్యా!

రాఘు : నిజంగా అంటున్నారా? అనవసరపు ఆశలిన్ని ఏమీ కల్పించడం లేదుకదా మీరు? ఎంత త్వరలో పెళ్ళి చేసుకోగల్గుతానో చెప్పండి.

డాక్టర్ ; మూడు సంవత్సరాల తరువాత....

రాఘు : మూడు సంవత్సరాలా? అంతకంటే ముందుగా సాధ్యంకాదా?

డాక్టర్ : కాదు ....

రాఘు : ఎంచేత? అంతకాలమూ జబ్బుగానే ఉంటానా? మీ రిపుడేగా చెప్పారు ....

డాక్టర్ : ఈ వ్యాధి నీకు ఇంతకన్నా హాని కాలేదు. కాని దీనివల్ల నీవు మాత్రం ఇతరులకు చాలా హానిచేస్తావని చెపుతున్నాను.

రాఘు : కాని డాక్టర్! వచ్చేనెల్లో పెళ్ళి చేసుకోబోతున్నానే!

డాక్టర్ : అసంభవం!

రాఘు : ఇంకేమీ చెయ్యలేను డాక్టర్! అంతా స్థిరమై పోయింది. శుభలేఖలూ అవీ అచ్చయినయ్. నేను మాట ఇచ్చేశానుకూడా ....

డాక్టర్ : ఎంత చక్కని మనిషివోయ్! ఒక్క క్షణం క్రితమేగా ఎలా ఆత్మహత్య చేసుకోనా అని ఆలోచించావ్; సముద్రంలోకి ఉరకనా? 'పొటాసియమ్ సైనేడ్' తీసుకోనా? ఉరిపోసుకోనా అని ఆలోచించిన వాడివి, అప్పుడే ఎలా పెళ్ళిచేసుకోనా, ఆమె గొంతుకెలా కోయనా అని ఆలోచిస్తున్నావా? బాగుంది.

రాఘు : కాని తప్పదు డాక్టర్!

డాక్టర్ : చాలా 'సీరియస్'గా చెపుతున్నాను అలా వేల్లేదని. తరువాత నీయిష్టం!

రాఘు : నిజంగా అంటున్నారా? ఇది నేనూహించిన జబ్బే కాకపోతే — ఆ జబ్బుకూడా కుదురబోతుంటే — నే నెందుకు ఆత్మహత్య చేసుకొవాలి డాక్టర్? ఆత్మహత్య చేసుకోకపోతే నా జీవితాశయాలు నెరవేర్చుకోడానికి ప్రయత్నించాలి కదా! నా జీవితం మామూలుగానే సాగవలసినప్పుడు, మామూలు కార్యక్రమాల్లో నేనుపడొద్దా? కనకనే — ఏమైనా నేనీ పెళ్ళిచేసుకుతీరాలి.

డాక్టర్ ; వీల్లేదు, నాయనా!

రాఘు : నా పెళ్లి తప్పిపోతే పెద్ద గొడవలొచ్చేస్తాయండీ! మీకేం? ఎన్నయినా చెపుతారు— మీకేం తెలుసు? అసలు ఇంత త్వరలో పెళ్ళిచేసుకుందామని నేనెప్పుడూ అనుకొ

లేదు. కాని మా అత్తయ్య — ఆ స్తంతా ఆమెపేరనే ఉందిలెండి — వెంటనే జరిగితీరాలని తొందరపడుతోంది. నేను జీవితంలో స్థిరపడటం చూడాలని మా అమ్మ అంటోంది. ఆమె జీవితంలో ఆఖరికోర్కె — తన మనుమల్ని కళ్ళారా చూచి ముద్దాడాలని — అంతవరకూ బతుకుతానా అని — రోజుకో ఇరవైసార్లన్నా అంటుంది. తరువాత మరో విషయం — కనకవల్లిఅంటే నాకెంత ప్రేమో చెప్ప లేను. ఆమె నింతగా ప్రేమిస్తున్నానని యెప్పుడూ అనుకోలేదు. వెనుకడుగు వేశానా —మా అమ్మ బెంగతో చచ్చిపోతుంది. మా అత్తయ్య ఆస్థికి దూరమౌతాను. మా మామ సంగతి మీకు తెలీదు — ఛాందసుడు, చండశాసనుడు! పైగా కూతురంటే నెత్తిమీద పెట్టుకొని పూజిస్తాడు. ఎందుకూ—ఎదురుచెప్పానా పేల్చె య్యడూ! కాబట్టి — మా అమ్మ ఆరోగ్యం, మా అత్తయ్య ఆస్తీ, నా భవి ష్యత్తూ, నా గౌరవం, బహుశా నా జీవితం అన్నీ నిరాధారంగా గాలిలో కొట్టు మిట్టాడుతున్నాయ్. పైగా మాటిచ్చే శాను.

డాక్టర్ : ఏమైనా వీల్లేదని చెప్పమంటున్నాను — వింటున్నావా?

రాఘు : అది వీలైనా ఇంకోవిషయం ఉందండీబాబూ! రెండునెలలలో మీద 'లీగల్ ప్రాక్టీసు' కొనడానికి ఒక కంట్రాక్టుమీద సంతకం చేశాను. అదెలా వొదుల్చుకోగలనండీ?

డాక్టర్ : అవన్నీ ....

రాఘు ; నా కట్నం డబ్బుతోనే కొనాలి .... అయినప్పటికీ ఇంతవరకూ దాన్లో ఒక్క చిల్లి గవ్వయినా ముట్టుకోలేదనుకోండి!

డాక్టర్ : అవన్నీ నాకనవసరం. నేను డాక్టర్ని. ఇంతకంటే ఏమీ చెప్పలేను. మూడు నాల్గు సంవత్సరాల తిరువాతతప్ప — ఇప్పుడే పెళ్లి చేసుకున్నావా, నీవో నేరస్తుడివి ఔతావని మళ్ళీ చెపుతున్నాను.

రాఘు : కాదు — కాదండీ! మీరువట్టి డాక్టరే కాదు — అంతకంటే గొప్పవారు. ఆపద్బాంధవులు; మీరువట్టి సైన్సుకి సంబంధించినవారేకాదు. నన్ను మీ లేబరేటరీలో ఒక 'స్పెసిమన్' నిచూచినట్టు చూడకండి. 'సైన్సు ఇలా చెబుతుంది, ఇక దయ చెయ్యి' అని ఉపేక్ష చేయటం భరించలేను. డాక్టర్! నాజీవితమంతా మీ చేతులలో పెట్టాను. నామాట కొంచెం వినండి. ఈపరిస్థితి అంతా అర్థం చేసుకోడానికి ప్రయత్నించండి. సరిగా ఒక్క నెలరోజులే నాకు గడువుంది. ఈనెలలోనే నాకు నయం చెయ్యండి. అంతా చక్కబడుతుంది.

డాక్టర్ : అసంభవం! ఒక నెలలో జబ్బు కుదురిపోవటంలాంటిది ఎక్కడా లేదయ్యా! నీ విషయంలో మూడు సంవత్సరాల్లోనైనా కుదురుతుందో లేదో సరిగాచెప్పటం కష్టం.

రాఘు : ఏదో మందు చూద్దురూ! ఎలాగోలాగు జబ్బు కుదర్చటమేకావాలి. మీకర్థం కావటంలేదు. ఇపుడు నాకీ పెళ్ళికాకపోతే. నాకట్నం సొమ్ము ఎలా వొస్తుందో చెప్పండి? సంతకంచేసిన కాంట్రాక్టు ఏమైపోవాలో చూడండి!

డాక్టర్ : ఐతే, అది చాలా స్వల్పవిషయం. ఈ ఆపదను తప్పించుకునేమార్గం చూపిస్తాను. ఒక డబ్బున్న వాడితో స్నేహం చేసుకో. అతని నమ్మకం సంపాదించు. మెల్లిగా వాడి ఆస్తంతా కాజేసేయ్!

రాఘ : ఏమిటి డాక్టర్. వేళాకోళం! అంత తేలిక విషయంకాదుగా!

డాక్టర్ : వేళాకోళం కాదు. ఆ డబ్బున్న వాడిని మోసం చెయ్యడం, లేక ఖూనీ చెయ్యటం కంటే — మంచి యవ్వనంలో, ఆరోగ్యంగా ఉన్న ఒక చక్కని యువతిని ఆమె డబ్బుకోసం పెళ్ళిచేసుకోటం పెద్ద నేరంకాదా? ఆమెకా జబ్బు అంటించి దానివల్ల వచ్చే దారుణ ఫలితాలకు ఆమెను గురిచెయ్యటం ఎంత అన్యాయమో ఆలోచించు!

రాఘ : దారుణ ఫలితాలా?

డాక్టర్ : ఔను — దారుణం — మహాదారుణం — మృత్యువుకంటే దారుణమైన ....

రాఘ : కాని ఇపుడేగా చెప్పారు ....

డాక్టర్ : ఇపుడేమీ చెప్పలేదే? ఈ వ్యాధి తగ్గిపోయినట్టే ఉండి, ఎప్పుడైనా పైకిరావొచ్చు. లోలోపల అణగి ఉంటుంది. మగవాడేదో ఇబ్బందులనుంచి తప్పించుకోవాలని ఆడదానికీ జబ్బు అంటించటం చాలా సిగ్గుచే టంటాను.

రాఘ : ఏమిటి? ఆమెక్కూడా అంటుకొనే అవకాశం ఉందంటారా?

డాక్టర్ : ఆఖరికి నిన్ను సంతోషపెట్టాల నైనా నే నబద్ధం చెప్పటం లేదు నీకు; లేదు — అంటుకు తీరుతుందనేది పూర్తిగా నిజం కాకపోవచ్చు. అంటనూవొచ్చు, అంటక పోనూవొచ్చు. నేను చెప్పవలసింది ఇంకోటుంది. మా మందులు అమోఘమైన వని నేను చెప్పటం లేను; కొన్ని కేసుల్లో — చాలా తక్కువే అనుకో — నూటికి ఐదుగురికి పని చెయ్యకపోవొచ్చు. ఆ మినహాయింపులో, ఆ ఐదుగురిలో నీవూ నీ భార్యా ఉంటే ఉండనూవొచ్చు. అపుడు — నీ ఉపయోగించిన మాటలే అంటున్నాను — ఫలితాలు మహా దారుణంగా ఉంటాయి.

రాఘ : ఐతే నన్నేం చెయ్యమని మీ సలహా?

డాక్టర్ : నేను నీ కివ్వగలిగిన సలహా ఒక్కటే — పెళ్ళి చేసుకోవద్దని. ఇంకోలా చెప్పాలంటే, నువ్వు ఒకరికి బాకీ ఉన్నావను కొందాం. నువ్వు ఎందుకో ఆడబ్బు చెల్లించలేక పోయావ్. ఆ రుణం అలానే ఉండి పోయింది. అలాంటి పరిస్థితుల్లో ఏదో ఒక రోజున అకస్మాత్తుగా నీకు రుణమిచ్చిన ఆసామీ వచ్చి మీద నిరుచుకు పడ్డాడనుకో. ఈసారి చెప్పు! నీకు వ్యాపార వ్యవహారం తెలుసు! వివాహం ఒక కంట్రాక్టు మాత్రమే. ఏమీ చెప్పకుండానే, నువ్వు పెళ్ళి చేసుకొన్నట్టయితే, అది చెడ్డసరుకులని తెలుసుండికూడా వాటిని నువ్వు హామీ ఇచ్చినట్టే, కోర్టువారు నీకు కఠిన శిక్ష విధించవలసిన నేరం కాదా ఇది?

రాఘ : నేనేం చెయ్యాను?

డాక్టర్ : మీ మామదగ్గరకెళ్ళి నిజమంతా చెప్పేసెయ్.

రాఘ : అలా చెప్పానంటే — మూడు నాలుగు సంవత్సరాలు ఆగటంకాదు — ఒక్క-సారి తెగతెంపులు చేసెయ్యడూ ? అతను ఒప్పుకోవటమే!

డాక్టర్ : ఐతే ఏమీ చెప్పకు.

రాఘ : సరైన కారణం చెప్పకపోతే — ఏం చేస్తాడో అని భయంగాఉంది. చాలా కోపదారి మనిషి. పైగా కనకవల్లి ఎంత బాధపడుతుందో మీరాలోచించటం లేదు. ఏం చెయ్యనండీ నేను చెప్పిందాన్నిబట్టి నేను డబ్బుగురించే బాధపడుతున్నా ననుకొంటారు మీరు. మేమిద్దరం కనీసం సుఖంగా బతకడానికైనా ఆలోచించటం నా బాధ్యత కాదంటారా ? నా చిన్నతనంనుంచీ ఇలాంటి విషయాలే పెద్దవాళ్ళు చెప్పారు నాకు. ఐనా ఈ రోజుల్లో డబ్బు ఎంతో ముఖ్యమో మీకు తెలియంది కాదు. అందులోనూ ఆస్థిపరురాల్ని పెళ్ళిచేసుకోబోతున్నాను.

(చలించి) కనకవల్లి చాలా ఉత్తమురాలు డాక్టర్! నాకంటే ఎన్నో రెట్లు గొప్పది. పుస్తకాల్లో ప్రేయసీ ప్రియులు ఎంతగాఢంగా ప్రేమించుకుంటారో అంత గాఢంగా ఆమెని ప్రేమిస్తున్నాను. ఎంతో డబ్బెట్టికొన్న ప్రాక్టీసు నాకు లేకపోవటం పెద్ద ఆశాభంగమే ఐనా, పోల్చిచూస్తే ఆమెను వొదులుకోవటం అంతకంటే పెద్ద ఆశాభంగం! మీరామెను చూసేఉంటే — మీకు తెలిసేఉంటే — మీకిదంతా అర్థమయ్యేది.

(జేబులోంచి డైరీ తీస్తూ) ఇదిగో, ఆమె ఫోటో—ఒక్క-సారి చూడండి!

(డాక్టరు కుతూహలం చూపడు. ఆప్యాయంగా రాఘవేంద్రం ఫోటోలోకి చూస్తూ మళ్ళీ డైరీలో పెట్టేస్తాడు)

క్షమించండి డాక్టర్! నాస్థితిలో మీరేఉంటేనా .... ఆమెనెంత ప్రేమిస్తున్నదీ ఎలా చెప్పాలో తెలియటంలేదు.

డాక్టర్ : అందుకే ఆమెను పెళ్ళి చేసుకోవద్దంటున్నాను.

రాఘ : అవునా ? ఎలా బైడపడమంటారో చెప్పండి ? ఏమీ చెప్పకుండానే వెనక్కి-తగ్గేనా — నా గుట్టంతా బయటపడి ఎంత అవమానాన్ని భరించాలో చూడండి!

డాక్టర్ : జబ్బుపడటం — అవమానం ఎప్పటికీకాదు నాయనా !

రాఘ : కాదండీ బాబూ! ప్రజలు వట్టి శుంఠలు. ఇప్పుడు నాలాంటి పరిస్థితిలోనే ఉన్న ఏ స్నేహితుడి నైనా నిన్న చూచిఉంటే నేనుకూడా నవ్వేవాడినే. పైగా వాడికి మశూచి ఉన్నట్టుగా తప్పించుకు తిరిగేవాడిని. కాని బాధ పడేవాడిని నే నొక్క-డినే ఐతే ఎంత బాగుండును! నన్నెంతో ప్రేమిస్తోంది కనకవల్లి — నిజం చెపుతున్నా నండీ. ఎంతో యోగ్యురాలు. ఆమె ఎంత బాధపడుతుందో ఊహించండి.

డాక్టర్ : తరువాత ఆమె పడే బాధకంటే ఇదేనయం కాదా ?

రాఘ : విపరీతమైన పుకారులు పుడతాయండీ డాక్టర్.

డాక్టర్ : అంతకంటే దారుణమైన దాన్ని తప్పించు కొంటావయ్యా.

[రాఘవేంద్రం ఐదు పది రూపాయలనోట్లు టేబిల్ మీద పెట్టి లేస్తాడు]

రాఘ : ఇంకా ఆలోచిస్తాను. నమస్కారం. వచ్చేవారం తప్పకుండా కలుసుకొంటాను. అవసరమైతే మీరు చెప్పినట్టుగానే .... (తలుపువైపు వెళతాడు)

డాక్టర్ : (లేస్తూ) నాకు తెలుసులెండి! వచ్చేవారం మీ రెల్లాగారారు. పైగా దీన్ని గురించి అసలే ఆలోచించరు. నీకున్న జబ్బేమిటో తెలుసుండే నాదగ్గర కొచ్చావ్ — నీ ఉద్దేశాలకు నా సలహాలు ఏకీభవించక పోతే — పూర్తిగా నన్ను మరిచిపోవాలను కొనే వచ్చావ్. తీరా వచ్చేక ఒక విచిత్రమైన స్థితిలో పడి నీ అంతరాత్మకు కొంత ఓదార్పు తెచ్చుకొన్నావ్. మహా దారుణమైన చర్యకు ఒడిగట్టుతున్నావని నీకు తెలుసుండికూడా, తరువాత ఎవరిమీదనో ఆ దాధ్యత పారేసి చేతులు దులుపేసు కొందామనే ఉద్దేశంతోనే నాదగ్గరికి వొచ్చావ్. నీ మనస్సుకి నచ్చినట్టుగా నేను చెప్పి ఉన్నట్టయితే అలాగే నా సలహా ప్రకారం ఆ దాధ్యత నా భుజాలమీద పారేద్దామను కొన్నావ్. కాదని దబాయించకు. ఇక్కడికి వచ్చేవాళ్లలో చాలామంది ఇంచుమించు ఇలాగే అను కొంటారు తీరా క్రియలోకొచ్చే సరికి నువ్వు చెయ్య దలుచుకొన్నట్టే చేస్తారు. నేను ఎంత కాదన్నా వాళ్లు పెళ్ళిచేసుకొన్న తరువాత ఏర్పడ్డ ఫలితాలు చూస్తే — "అయ్యో! పెళ్ళి వీల్లేదని నేను చెప్పవలసినంత కఠి నంగా చెప్పలేక పోయానే" అనే విచారం కలిగేది. అలాటప్పుడు వాళ్ల రోగవిముక్తికి నేనెంత సంజీవినైనా, వాళ్ల దుఃఖానికికూడా నేను కొంత కారణ మనిపిస్తుంది. నిజంగా ఘోరాలు చేస్తున్న వాళ్ళే నేను చూడగలిగినంత నిశితంగా చూడగలిగి, నేను తెలుసుకో గలిగినంత నిశితంగా తెలుసుకో గల్గితే ఒక్కనాటికీ అలా ప్రవ ర్తించి ఉండలేరు. ఏమైనా పెళ్ళిచేసుకోనని ప్రమాణంచేసి చెప్పు

రాఘ : మాటమాత్రం ఇవ్వలేను డాక్టర్ — మళ్ళీ చెపుతున్నా ఆలోచిస్తానని....

డాక్టర్ : ఏమిటాలోచిస్తావ్?

రాఘ : మీరు చెప్పిందంతా మళ్ళీ ఆలోచిస్తాను.

డాక్ట దానికి ఆలోచించ నవసరంలేదయ్యా నాయనా! నిజాన్ని విప్పి నీముందుపెట్టేను. కొత్త ఆటంకాలేమీ చెప్పలేవు. నీవు చెప్పినవాటన్నికీ సమాధానం చెప్పాను. ఇంక నీవు వొప్పుకుతీరాలి.

రాఘ : మీదగ్గరికి రాకముందు నాలోనేను ఇంతమధనా పడ్డానండీ బాబూ!

డాక్టర్ : సహజంగా పడేవుంటావ్!

రాఘ : ఇంతకీ — మీరనుకుంటున్న జబ్బు నిజంగా నాకున్నదంటారా ?

డాక్టర్ : (అత్యాశ్చర్యంగా) ఆఁ!

రాఘ మీరలాగే అంటారు. పోనీ నిజమే అనుకోండి. పెద్దపెద్ద డాకర్లుకూడా ఒకోసారి పొరపడుతుంటారు కదా! మీ 'లెక్చరర్' రంగాచారిగారు ఇది సాధారణంగా అంటు వ్యాధి కాదనిచెప్పటం వినలేదా?

డాక్టర్ : (అపహాస్యంగా) ఔనౌను!

రాఘ : ఆ విషయం రుజువుచేసుకోడానికి కొన్ని కేసులుకూడా ఆయన చూపించారు. కాని మీరదంతా తప్పని రుజువుచెయ్యడానికి మరికొన్ని కొత్తకేసులు చూపిస్తున్నారు. బాగుంది! కాని ఇదంతా నేను ఆలోచించుకోవాలిగదా? ఆలోచించింతరువాత — మీరు నన్ను బెదిరిస్తున్న దారుణ ఫలితాలు బహుశానమ్మదగినవేఅని నేను గ్రహించవొచ్చు. నన్ను అనవసరంగా భయపెట్టాలని చూస్తున్నారు మీరు.

డాక్టర్ : కాదయ్యా నాయనా!

రాఘ : ఔను — అంతే! పైగా — నాపెళ్ళివల్ల నాభార్యకు ఎలాటి దుష్ఫలితాయీ రావడానికి అవకాశం లేదని మీరు వొప్పుకుతీరాలి.

డాక్టర్ : (కష్టంమీద కోపాన్ని అణచుకొంటూ) కానియ్యి — సమాధానం చెప్తాను.

రాఘ . మీ మందులన్నీ శక్తివంతమైనవన్నారు. రాబోయే దారుణఫలితాలకు — నూటికి ఆ ఐదుగురిలోనూ నాభార్య గురికావచ్చునన్నారు. ఒక గణిత శాస్త్రజ్ఞుడే ఈ రోగంవల్ల కలిగే ఫలితాలని గుణిస్తే, వాటివల్ల వచ్చే ప్రమాదం బహు స్వల్పమనీ, నేను పెళ్ళి సంబంధాన్ని తెగ్గతెంపులు చేసుకోవటంవల్ల గలగబోయే విపరీత విపత్కర పరిస్థితులముందు ఆ కలిగే దారుణ ఫలితాలు శతాంశమో సహస్రాంశమో కాగలవనీ, కనుకనే వివాహానికి సుముఖుణ్ని కావటంలోనే మంచిపని చేశాననీ, దానికి విముఖత్వం చూపటంలో మీరే పొరపడ్డారనీ నిర్ణయించగలడు. పైగా వైద్యంకంటే గణితం ప్రత్యక్ష సత్యంకదా!

డాక్టర్ : అవునులే — నీదంతా నిజమే అంటావు. కాని నేను పొరబడుతున్నానంటావు?

రాఘ : మీ రలాగే అంటారులెండి!

డాక్టర్ : ముమ్మాటికీ తప్పు. ఇలాంటివే ఇరవైకేసుల్ని అతిజాగ్రత్తగా మొదటనుంచీ చివరిదాకా పరీక్షించాను. ఇరవైకి పంథొమ్మిది కేసుల్లో భర్తనుండి భార్యకు అంటుకొన్నవే. ఈ అపాయాన్ని ఉపేక్ష చేయవచ్చుననుకొంటున్నావేమో! ఆమెనికూడా ఇందులో భాగం తీసుకోమని నీ భార్యని బలవంతం చెయ్యడానికి నీకు హక్కుందనుకొంటున్నావు కాబోలు! మగవాడవు మరి!

రాఘ : కాని నాకెలా తెలుస్తుందండీ!

డాక్టర్ : ఎందుకు తెలీదు? నీవు చేస్తున్నదేమిటో ఇవుడే తెలుసుకొందువుగాని; నీ భార్యకు అంటుకొనే ఆనూటికి ఐదువొంతుల 'ఛాన్సు'లోనూ ఆ వ్యాధి ఎలా ఉంటుందో తెలుసుకొందువుగాని, ఈ పుస్తకం చూడు — రంగాచారిగారు వ్రాసింది — ఇక్కడనుంచి చదువుకో — పోనీ నేనే చదివి వినిపిస్తాను.

(ఉద్రేకంతో చదువుతాడు) "ఒకసారి ఈ వ్యాధివల్ల ఒక మృగంకంటే కనిష్టంగా ఐపోయిన ఒక స్త్రీని నేను చూడ్డం తటస్థించింది. మిగిలిన ముఖమంతా మచ్చలతో అతుక్కుపోయినట్టు నొక్కుకుపోయి .... చివరికి ఒక అట్టలా తయారయింది" —

రాఘ : దయచేసి ఆగండి! ఇక చాలు బాబూ — చాలు!

డాక్టర్ : ఎందుకు ఆగాలి? చివరివరకూ చదివి తీరతాను. ఏదో నీ నరాలు తిరగబడుతున్నాయని నా బాధ్యతని మరచిపోలేను.

(చదువుతాడు) 'పై పెదవి పూర్తిగా తినేసింది. గుర్తు దొరకటం లేదు....'

రాఘు : అయ్యో బాబోయ్!

డాక్టర్ : చూశావా? నీ వెంతో ప్రేమిస్తున్నావంటూన్న ఆమెకు ఈ జబ్బు అంటించడానికి నీ వేమీ వెనుతియ్యటంలేదు. కాని ఆ జబ్బు గురించి రాసింది చదువుతుంటే విన లేకపోతున్నావు. పాపం! ఆమెకు ఎవరినుంచి వచ్చిందా సిఫ్లిస్? నేను చెపుతున్న మాటలు కావివి. ఈ పుస్తకంలోనే ఉన్నాయ్. 'తన కా జబ్బు ఉందని తెలిసి కూడా పెళ్ళిచేసుకోడానికి వెనుతియ్యని ఒక నీచుడినుంచి — అనుమానాలు బైలు దేరతాయనే భయంవల్ల ఆ భార్యకుకూడా మందిప్పించని ద్రోహినుంచి ....'' విన్నావా? అతనేం చేశాడో నువ్వూ అదే చెయ్యబోతున్నా విపుడు.

రాఘు : (ధైర్యం చిక్కబట్టుకొని) నా పెళ్ళివల్ల ఇలాంటి దారుణ ఫలితాలు వస్తాయని తెలిసికూడా నేను పెళ్ళి చేసుకొన్నానంటే—ఆ మాటలన్నీ నన్ను గురించి అన్నట్టే. కాని నాకెందుకో నమ్మకం కలగటం లేదు. మీరూ మీ లెక్చరరుగారూ ఈ విషయంలో నిపుణులే. మీరు తీవ్రంగా పరిశోధన సాగిస్తున్న విషయం మీదనే మీ మనస్సును సహజంగా లగ్నం చేశారుకాని, అలా జరగని సందర్భాల్ని గురించి మీ రాలోచించలేదు. అలా అంటువ్యాధిగా భార్యలపై పనిచేయని సందర్భాలు మీ కవసరం లేకపోయాయి.

డాక్టర్ : ఔను — అల్లాంటి వాదనల్ని చాలా విన్నాను.

రాఘు : నన్ను చెప్పనియ్యండి — ఇపుడేగా చెప్పారు — ప్రతి నలుగురిలో ఒకడు సిఫ్లిటిక్ రోగి అనీ, అల్లాంటి వాళ్లే వేలకొద్దీజనం మంచి ఆరోగ్యంతో ఈ పట్నంలో తిరుగుతూనే ఉన్నారనీను.

డాక్టర్ : అవును; వందలాది జనం ఈ రోగం సోకిఉన్నప్పటికీ పైకి కన్పించకుండా ఉండటంవల్ల ఆరోగ్యవంతులుగానే నటిస్తూ తిరుగు తున్నారని అన్నాను. అది అలా ఉంచు; మన శరీరాలు భరించలేనంత దుర్భర భయంకర వ్యాధులకు బలయి పోయి మా హాస్పటల్సులోంచి వెళుతున్న వాళ్లుకూడా వేలకొద్దీ ఉన్నారు. నువ్వు వాళ్లను చూడలేవు. నీ కోసం వాళ్లు ప్రాణాలతో లేరు. పైగా ఇది నీ ఒక్కడి విషయమే అయితే వాళ్లు తొక్కిన దారినే నేనూ తొక్కుతానంటే నేనేమీ అనలేకపోదును. నేను ఖచ్చితంగా చెప్తున్నది, మళ్ళీ అలా వీల్లేదని. నాశక్తికొద్దీ చెప్తున్నదీఒక్కటే—ఏమైనా నువ్వు ఇంకోప్రాణిని నీకుమల్లేనే కృశించి నశించిపోయేటట్లు చేసేందుకు వీల్లేదని. ఏమైనా నేనొప్పుకోను. నీకాహక్కు లేదంటాను. ప్రమాదం చిన్నదేకావొచ్చు— ఐనా అది ఎంత దారుణమైనదోకూడా నాకు తెలుసు. ఇక ఏం చెపుతావో చెప్పు!

రాఘు : ఇంకేంచెప్పను? మీరు చెప్పిందంతా నిజమేకావచ్చు. మీరేచెప్పండి.

డాక్టర్ : ఇక అసలు పెళ్ళిచేసుకోడానికే వీల్లేదనిచెప్పటం లేదునీకు. ఇంత త్వరలో పెళ్లి ప్రయత్నం మానమంటున్నాను. ఆ తరువాత నీఇష్టం. ఈ జబ్బు నీకు ఇంకెప్పటికీ కుదరదని చెప్పటం లేదుగా. పైగా ఎంతో ఆశచూపిస్తున్నాను. మూడునాలుగు సంవత్సరాలుమాత్రం ఆగితే చాలంటున్నాను. ఈలోగా ఏ ఆశా అవకాశమూ లేని

ఆ వేలాది దౌర్భాగ్యుల్లో నువ్వుకూడా ఒకడివో కాదో నేను నిర్ణయం చేసుకోగలను ఈలోగానే నువ్వు తొందరపడ్డావంటే నీ పెళ్ళాం బిడ్డలపాలిట మృత్యుదేవతవే అవుతావు. ఇంతకీ నేను నీ పిల్లలగురించి మాట్లాడటం మరచిపోయాను.

(కొంచెం తమాయించుకొని మెల్లిగా నచ్చచెప్పుతున్నట్టు) వెర్రినాయనా నువ్వు అమాయకుడివి! నీ మీద ఎంత జాలిచూపినా గ్రహించలేనంత అమాయకుడివి. ఇంకా నిన్ను కదిలించగలిగిన సంగతులెన్నో ఉన్నాయి; నీకు వాటిని గురించి వివరంగా చెప్పి నచ్చచెప్పుకోలేకపోయానంటే అది నా లోపమే. నమ్మునామాట; నీగురించి నా హృదయం ఎంతో ఆవేదనపడుతోంది. కనీసం దానికోసమైనా నేను చెప్పినదాన్నిగురించి మరికొంత ఆలోచించవలసిందని ప్రాధేయపడుతున్నాను. నువ్వే ఒప్పుకొన్నావు. నీ భార్యని ఈ దారుణ రోగానికి గురిచేసే అధికారం నీకులేదని. అవునా? దీనివల్ల బాధపడేది ఆమె ఒక్కతే కాదు — ఆమెపిల్లలుకూడాను. నీ పిల్లలు—వాళ్ళకూ్కడా ఈ వ్యాధి అంటిస్తావ్. ఒక్కక్షణం నిన్నుగురించీ నీభార్యగురించీ అలా వదలిపెట్టు. ఐనా ఆ నోరులేని పసికందులకోసం నిన్ను ప్రార్థిస్తున్నాను; ఈ జాతి భవిష్యత్తుకోసం నిన్ను బతిమాలుతున్నాను.

(రాఘవేంద్రం అడ్డుచెప్పాలని ప్రయత్నిస్తాడు. డాక్టర్ ఉరిమిచూస్తాడు) వినుముందు. ఇలా జరిగిన ఇరవై వివాహాల్లోనూ పదిహేనుగురికే పిల్లలు పుట్టారు. మొత్తానికి ఇరవై ఎనమండుగురు పిల్లలు పుట్టారు. ఎంతమంది బతికేరనుకొంటావ్? ముగ్గురే; ఇరవైయెనమండుగురికి ముగ్గురుమాత్రమే బతికేరు. ఇంతకీ చెప్పవచ్చిందేమంటే — సిఫ్లిస్ అంటే భ్రూణహత్యే. ప్రతిసంవత్సరమూ ఇలాంటి అమాయిక శిశువులు వేలకొద్దీ హతమైపోతున్నారు. ఇక్కడేకాదు, ప్రపంచమంతా ఇదేతీరు. ప్రాణాన్ని కాపాడ్డం నాపనే ఐనప్పటికీ — నిజం చెపుతున్నా — చచ్చిపోయిన ఆ పసిపాపలే అదృష్టవంతులేమో అనిపిస్తుంది. సిఫ్లిటిక్ తలిదండ్రులకు పుట్టిన పిల్లల్ని చూడాలనిఉంటే పిల్లల హాస్పిటల్సుకి వెళ్ళు ఆ నరకం ఎలా ఉంటుందో అర్థమౌతుంది. ఏ డాక్టరైనా ఇతరులనుంచి వేరుచేసివాళ్ళను చూపగలడు. వినాశమూ, అశక్తీ దుర్బలత్వాల ముద్రలు వాళ్ళ ముఖాలమీద తాండవిస్తాయి. అంగవైకల్యం, విరిగిపోయిన నడుములు, ఊసరకాళ్ళు, కుందేటి పెదవులు పెద్ద తలలు చిన్న శరీరాలు — పుట్టుకపూర్వంనుంచీ శరీరంలో జీర్ణించుకుపోయిన ఈ వ్యాధితో వాళ్లు కన్పిస్తారు. అసహ్యంతో అవమానంతో చేతులు విరగ్గట్టి హాస్పటల్సులో పారేసి, ఈ లోకానికీ జీవితానికే దూరంచ్చేసింది. నీకు తెలుసున్నరోగాన్నే కప్పిపుచ్చి పెళ్లిచేసుకొన్నవీళ్ల తలిదండ్రులు ఈ తలిదండ్రులుచేసిన శిక్షలేని నేరాలకు ఈ అమాయకులైన శిశువులు నేరంలేని శిక్షను అనుభవిస్తున్నారు. నాకే చేతనైతే నాపే వీలయితే ఈ ఇంటికి కప్పులెక్కి—ముళ్లకంచెల్లో బతకనూలేక చావనూలేక గిలగిలా కొట్టుకొంటూన్న ఆ అమాయిక ప్రాణులకోసం రోదించేవాణ్ణి.

(ఆగి) నేను చెప్పిందాన్లో ఏమీ అతిశయోక్తిలేను. మంచిచెడ్డల్ని విచారించుకొని జ్ఞాపకం ఉంచుకో — ఒకవైపు నీ వేదన, రెండవవైపు ఇతరుల బాధలూ ఉన్నాయని మరచిపోకు.

రాఘు : అలాగే డాక్టర్! ఒప్పుకుంటున్నాను. పెళ్ళి చేసుకోను. ఏదైనా నెపం కల్పిస్తాను ఆఖరికి ఆరునెలల వరకూ తోసేస్తాలెండి! అంతకంటే అసాధ్యం మరి.

డాక్టర్ : కనీసం మూడుసంవత్సరాలన్నా లేనిదే ....

రాఘు : కాదు — కాదు బాబోయ్ కాదు, దయతలచండి. ఈ లోపుగానే నన్ను బాగు చెసెయ్య గలరు.

డాక్టర్ : లాభంలేదు నాయనా !

రాఘు : చెయ్యగలరు బాబూ! నాకు తెలుసు ప్రార్థిస్తున్నా — సైన్సు ఏదైనా చేస్తుంది.

డాక్టర్ : సైన్సు భగవంతుడు కాదుగా! మంత్రాలయుగం పోయింది.

రాఘు : మీరు తలుచుకొంటే ఏదైనా చేస్తారు డాక్టర్! నాకు తెలుసు. ఏదో కనిపెట్టండి. ఏదో సృష్టించండి. మోతాదు రెండింతలు చెయ్యండి. కొత్త చికిత్స ఏదైనా నా మీద వాడండి. ఏదైనా ఎంతైనా భరిస్తాను. ఏదో ఆరునెలల్లో నా జబ్బు కుదిరే విధానం ఆలోచిస్తేచాలు. ఆ తరువాత నేను మాత్రం బాధ్యుణ్నికాదు. కాబోయే నా భార్యా, పుట్టబోయే నా పిల్లల గురించైనా ఏదో చెయ్యండి.

డాక్టర్ : నాన్ సెన్స్ !

రాఘు : నా జబ్బు కుదిర్చేరంటే—మీరేం చెయ్యమంటే అది చేస్తాను, జీవితాంతంవరకూ మీకు విధేయుణ్నయి ఉంటాను. నాకు వచ్చే ఆస్తిలో సగం మీ కిచ్చేస్తాను .దయ ఉంచి ఏదో చెయ్యండి !

డాక్టర్ : ఇతరు లందరికంటే నీకే ఏదో ఎక్కువగా చెయ్యమంటున్నావ్ నన్ను. అవునా?


రాఘు : ఔను డాక్టర్! అంతే!

డాక్టర్ : నా దగ్గరికి వచ్చిన ప్రతి రోగికీ — గొప్పవాడుకానీ పేదవాడుకానీ — నేను శక్తివంచన లేకుండా సేవచేస్తాను. గొప్పవారినిబట్టి చప్పున కుదిరేవీ, పేదవారిని బట్టి ఆలశ్యంగా కుదిరేవీ, అని రెండు రకాల మందులు నా దగ్గర దొరకవు నాయనా.

రాఘు : ఐతే శలవ్ డాక్టరుగారూ!

డాక్టర్ : శలవు. [తెర]





## రెండోరంగం

దృశ్యం : రాఘవేంద్రం బంగళాలో, చదువుకొనేగది.

[ఎడమవైపు కిటికీ. కిటికీకి ముందుగా టేబిల్, కుర్చీ. టేబిల్ మీద టెలీఫోన్. టేబిల్‌కి కుడివైపు ఒక ఆరమ్‌ఛైర్. చిన్నబల్ల మీద అల్లిక దారాలు, సూదులు వగైరా. ఫుట్‌లైట్స్‌కి దగ్గరగా ఒక ఈజీఛైర్. వెనకగా పెద్ద బుక్‌కేస్. దానిముందు చక్కని చిన్న బల్లమీద వాజులో పూలగుత్తులు. వెనక – కుడివైపుగా ఒక ద్వారం. ఎడమవైపు ఇంకొక ద్వారం. రెండు కుర్చీలు. కనకవల్లి కూర్చుని చిన్న సిల్కు జుబ్బాకు పూలు కుడుతోంది. అందమైన ముఖం ఎంతో నాజూగ్గా వుంటుంది. మనిషి పొడగరి, వయసు ఇరవైరెండు. కొంతసేపైన తరువాత జుబ్బా వేళ్ళతో దూరంగా పట్టుకొని పరీక్షగా చూస్తుంది. రాఘవేంద్రం వెనక తలుపువద్ద కన్పిస్తాడు. తలుపు వేసేసి వొచ్చి హాల్లో కోటు విప్పుతూంటాడు]

రాఘ : వల్లీ, వల్లీ! ఇక్కడే వున్నావ్ — ఇక్కడే! హ్హాఁ హ!

కనక : [లేచి కులాసాగా] ఓ హ్! మీగొంతు గుర్తుపట్టలేననుకొన్నారా ?

రాఘ : ఓఁ ఓఁ హ! (నవ్వుతూ కనకవల్లిని దగ్గరికి తీసుకొని) పిచ్చినాన్నలు! తెల్లబోయావ్ కదూ ? హ్హాఁ హఁ!

కనక : (నవ్వుతూ) కొంచం తగ్గండి — ఇక చాలు ఆ నవ్వు.

రాఘ : హల్లో! హల్లో! కనకవల్లిగారా? (ఆడదాని పిరికిగొంతు అనుకరిస్తూ) 'ఔను — ఔను, నేనే! ఇక్కడున్నా' అఖరిముక్కలంటూ కొంచెం సిగ్గుపడ్డావ్. ఔనా?

కనక : (నవ్వుతూ) 'ఔను — ఔను, నేనే! ఇక్కడున్నా అని ఆ గొంతుతో అనలేదు లెండి. 'ఔను' అన్నా నంతే!

రాఘ : 'హల్లో! కనకవల్లిగారూ! రాఘవేంద్రం ఉన్నాడా అక్కడ? (నవ్వుతూ) ఒక్కసారి తెల్లపోయావ్, దబాయించకు మరి. (ఆడదాని పంతంతో) 'రాఘవేంద్రంగారు బైటకు వెళ్ళారు. ఎవరండీ మాట్లాడేది?' ఇక ఆపుకోలేక పోయాను. 'నేనూ — గోపాల్‌ని' నిజంగా గోపాలే అనుకొన్నావు కదూ?

కనక : మీ స్నేహితుడు గోపాల్ 'టెలిఫోన్' చెయ్యటంలో వింతేముందండీ?

రాఘ : ఇంకా అలానే — (గోపాల్‌గొంతు అనుకరిస్తూ) 'ఎలా ఉన్నావ్ రాజీ?' దానితో నీవు 'ఏమిటీ?' అని బెదరగొట్టేశావు. ఒక్కసారి కంగారైపోయింది. ఆ 'ఏమిటీ' తో.

కనక : ఔను, నాకు తెలుసులెండి. అప్పుడే గ్రహించాను మీరేనని.

రాఘ : నవ్వలేక చచ్చానులే! (కుర్చీలో కూర్చుని సంతోషంగా ఆమెను కనిపెడుతూ) బలేదానివే!

కనక : (కూర్చుంటూ భర్తకేసి తిరిగి) ఎంత తమాషావారండీ?

రాఘ : నేనా?

కనక : (కులాసాగా)పదిహేను సంవత్సరాలనుంచీ మిమ్మల్నెరిగుండీ, పైగా సంవత్సరం నుంచీ మీతో కాపరంచేస్తూ మిమ్మల్ని ఆమాత్రం తెలుసుకోలేక పోయానంటారా?

రాఘ : ఊఁ కానియ్యి. ఏమనుకొన్నావో చెప్పు నాగురించి....

కనక : నిజం చెప్పాలంటే మీకు ఆదుర్దా హెచ్చు; అసూయకూడా ఉంది; చెడ్డ అనుమానంకూడాను! అందుమూలాన్నే ఎప్పుడూ ఏదో చిలిపి పనులుచేస్తూ ఆ తప్పు దిద్దుకోడానికి నేర్పుగా ఎన్నో దార్లు తొక్కుతుంటారు.

రాఘ : (తనగురించి చెపుతున్నందుకు సంతోషపడుతూ) ఐతే అలా అనుకొంటున్నావన్న మాట! ఇంకా చెప్పు — కొంచెం విందాం....

కనక : నేను చెప్పింది నిజం కాదంటారా?

రాఘ : (మందహాసంతో వొప్పుకుంటూ) ఐతే?

కనక : నన్నేదో బోల్తాకొట్టించాలని ఆడిన నాటకంకదూ మీరలా ఫోన్‌లో మాట్లాట్టం?

రాఘ : ఛా, కాదంటూంటే!

కనక : అవును, దబాయించకండి! నేను బైటకు వెళ్ళానో లేదో తెలుసుకొందామని మీ నాటకం. ఇవేళ 'గాన్‌విత్ ది విండ్' షోటిసీకి వెళ్ళొద్దన్నారుగా!

రాఘ : (అమాయికంగా) ఔను — వద్దన్నాను.

కనక : చూడండి, నేనంటే ఎంత అనుమానమో మీకు!

రాఘ : అబ్బే, కాదు వల్లీ! నువ్వంటే నాకేమీ అనుమానం లేదు.

కనక : అఁ. కబుర్లకేంలెండి! అంతా అనుమానమే మీకు. ఎప్పుడూ ఇంతేమీరు. ప్రతి దానికీ కష్టపెట్టుకొంటారు. ఔనా? సరిగ్గా చెప్పాలంటే భయపడతారనాలి.

రాఘ : (సీరియస్‌గా) అలా అని చిన్నప్పుడు నన్ను చూచి నవ్వేవారు.

కనక : మగవారికి వాళ్ళ స్నేహితుల భార్యలతో ఉండే స్నేహాలగురించి కొంచెం బాగా తెలుసు ననుకొంటాను మీకు. అందుకేకదూ ?.... అన్నీ కొంటివేషాలే!

రాఘు : (నవ్వుతూ)నీ ఉద్దేశమేమిటో తెలుసుకోవాలని కుతూహలం కొద్దీ ....

కనక : ఒకవేళ పోస్ చేసింది గోపాల్ అనుకొని — 'యస్! 'గాన్ విత్ ది విండ్' ఫస్ట్క్లాస్ — థాంక్స్', ఏంచేస్తున్నావ్ డియర్' అని నేనంటే?

రాఘు : (నవ్వుతూ)అందరిమీదా యీ 'ట్రిక్' ఉపయోగిస్తాననుకోకు. (సంభాషణ మారుస్తూ) అన్నట్టు నేనొస్తుంటే పట్టాభి పలకరించాడు.

కనక : ఊహూఁ!

రాఘు : జీతం పెంచమంటాడు.

కనక : మంచి సమయమే కనిపెట్టాడే ?

రాఘు : కాదా మరి? నా బటన్స్, కప్స్, బకిల్స్, సాక్సు అమ్మేయటంవల్ల ఏమీ మిగలటం లేదా అన్నాను.

కనక , అందుకేమన్నాడేమిటి ?

రాఘు : మండిపోయాడు — ఇంక పనిలోకి రానని నోటీసిస్తానన్నాడు; ఇంక నిర్ధారణ చేసుకొన్నాలే — మళ్ళీ వాణ్ణి పనిలో పెట్టకూడదని.

కనక : మంచిపని చేశారు.

రాఘు ; ఈ నెలాఖరిలో పంపేద్దాం — పీడ వదిలిపోతుంది. అమ్మకూడా సంతోషిస్తుంది. ఇంతకీ అమ్మ 'వైర్' ఇవ్వలేదు కదూ ?

కనక : లేదండీ!

రాఘు : ఐతే రేపుకాని రాదనుకొంటాను.

కనక : ఏమైనా పాపాయిని వదలి ఒక్క-క్షణం ఉండలేరు సుమండీ!

రాఘు : అమ్మంటే నీకు ఈర్ష్యగా ఉందను కొంటాను.

కనక : నాకు ఈర్ష్యందుకులెండి! పాపాయి ఆమెదగ్గరున్నా, నాదగ్గరున్నా ఒకటి కాదా ఏమిటి? ఇంతకీ పాపాయికి ఒంట్లో బాగుండలేదనిగాని ....

రాఘు : పాపాయి ఏమాత్రం నలతగాఉన్నా ఆమె 'వైర్' చేసేదే.

కనక : పాపాయిని మనదగ్గరే ఉంచుకొంటే బాగుండేదేమోననుకొంటున్నానండీ!

రాఘు : మళ్ళీ మొదటికొచ్చావ్?

కనక ; కాదు — కాదు — నాకు తెలీదేమిటి? ఈవూరి గాలి పాపాయికి పడదుగా!

రాఘు : (హేళనగా) పల్లెటూరి గాలింటే ఈ దుమ్ముకొట్టిన ఇళ్లు చాలా మంచివను కొంటానేం?

కనక : ఊరుకొండీ, వేళాకోళం!

రాఘు : పెట్రోలూ, తారూకంపు కొట్టుకొంటున్న ఈ వీధులు....

కనక : ఔను మహాశయా! తమరు చెప్పిందేనిజం. ఇంక ఊరుకోండి!

రాఘు : అమావాస్యకో పౌర్ణానికో ఎపుడో ఆఖరికి ఈ మాత్రమన్నా వొప్పుకొన్నందుకు చాలా సంతోషం.

కనక : పాపాయికి నేనింక పాలివ్వలేని పరిస్థితిలో అంతనమ్మకమైన గొల్లది దొరకటం ఎంత అదృష్టం. అది చాలా మంచిదండీ పాపం!

రాఘు : నీసాపాలు పడుతుంటే అసలు తాగేదేకాదు. ఏక్కుతూంటే, నాకెంతో భయం వేసేది — ఇంక లాభం లేదనుకొనే వాడిని.

కనక : 'అనాసజబ్బు' అంటాడు డాక్టర్. ఇంత చిన్న పిల్లలకే ఎందు కొస్తాయో ఇలాంటి జబ్బులన్నీ! ఇలాంటి గొల్లలే లేకపోతే ఏమైపోయేవాళ్ళం?

రాఘు : 'హెల్తు మినిష్టర్' గారి మనుమరాలికి తను పాలిస్తున్నానని మన గొల్ల చాలా గర్వ పడుతుంటుంది సుమా!

కనక : గర్వంకదూ మరి!

రాఘు : బడాయిగా తిప్పుకుంటూ దానిచుట్టాలతో చెప్పుకోటం వినలేదా నువ్వు? (గొల్ల గొంతు అనుకరిస్తూ) 'ఎంత అదృష్టం అమ్మా నాకు! మన మంత్రిగారి కూతురు కూతురు! ఎంత అందమైనపాప అను కొన్నారు. అపుడే ఎంత తెలివి! అన్నీ అర్థం చేసుకొంటుంది. ఎంత అదృష్టం నాకు' అని.

కనక : (నవ్వుతూ) ఊరుకోండురూ! గొల్ల అల్లా ఎప్పుడూ మాట్లాడదు.

రాఘు : ఐతే నా 'ఇమిటేషన్ను' ఏమీ బాగోలేదంటావ్?

కనక : అది కాదండీ! మీ అమ్మగారు ఎంత మంచివారనుకొన్నారు! పాపాయంటే ఆవిడకెంతో ప్రాణం. ఆవిణ్ణి పువ్వులో పెట్టి పూజించాలి.

రాఘు : మా కుటుంబమే అల్లాంటిది — నీకు తెలీదేమిటీ!

కనక : కిందటిసారి అత్తయ్యగారుకూడా మనం వెళ్ళినపుడు — జ్ఞాపకం ఉందా? — మీ రెక్కడికో వెళ్ళారు....

రాఘు : పదమూడవ శతాబ్దంనాటి చోళరాజులు కట్టించిన దేవాలయంలోని శిల్పం ....

కనక : ఔనులెండి! మీరు మాటిమాటికీ పొగుడుతున్న ఆ శిల్పచాతుర్యం ....

రాఘు : అన్నట్టు — నువ్వేమిటో చెప్తున్నావు.

కనక : ఆఁ — మీరు బైటకు వెళ్ళారు. గొల్ల కోవెలకు వెళ్ళిందనుకొన్నాను ....

రాఘు : లేక కాఫీతాగడానికి వెళ్ళిందో — ఊఁ, చెప్పు!

కనక : ఆ చిన్న గదిలోనే ఉన్నాను — అత్తయ్యగారు నేను లేనేమో అనుకున్నారు. నేనంతా వింటునేఉన్నాను. పాపాయితో ఎన్నో ముద్దుమాటలు చెపుతున్నారు — చిన్న చిన్న చిలిపి విషయాలుకూడా చెప్పారు. గట్టిగా నవ్వి అరుద్దామనిపించింది నాకు.

రాఘు : నా ముద్దుకృష్ణా, నా బాలకృష్ణా అనలేదూ?

కనక : ఏమిటి, మీరూ విన్నారూ?

రాఘు : లేదులే! చిన్నప్పుడు నన్నుకూడా అలానే పిలిచేది. మహా భక్తురాలు, అమ్మ!

కనక : ఆరోజే అన్నారు — పాపాయి తనని చూచి నవ్వుతోందని, గుర్తుపట్టుతోందని....

రాఘు : ఇక్కడ — ఒకరోజు అమ్మగదివైపు వెళ్ళాను. తలుపు కొంచెం వేసుంది — నేరావటం ఆమె చూడలేదు. పాపాయికాళ్ళకు తొడగాలని కొన్న వెండిమువ్వలకేసి ఊరికే చూస్తోంది.

కనక : ఊఁ, తరువాత?

రాఘు : ఆ పాదాలు పైకెత్తి ముద్దుపెట్టుకొని కళ్ళకద్దుకొంది.

కనక : మీరేమన్నారేమిటి?

రాఘు : ఏమీలేదు. మెల్లిగా వెళ్ళిపోతూ వెనకనుంచే నమస్కారం పెట్టేశాను అమ్మకు.

కనక : మొన్న మీ అమ్మగారు నన్ను చూడ్డానికి వచ్చినప్పుడు — గొల్లదగ్గరనుంచి బేబీ వొంట్లో — బాగోలేదని ఉత్తరంవస్తే, ఆ ఎనిమిదిగంటల బండికే భోజనంకూడా చెయ్యకుండా ఎంత త్వరగా పరుగెట్టేరనుకొన్నారు.

రాఘ : ఏమైనా — పాపాయికి కులాసాగానే ఉండి ఉంటుంది.

కనక : లేదు — నిజమేనేమో! నేనుకూడా వెళ్ళివుంటే బాగుండునండీ !

రాఘ : పాపం! ప్రతీదీ నమ్ముతావ్ వల్లీ! అసలువిషయం ఏమిటో ఒక్కసారి గ్రహించేశాను. గొల్ల ఏదో అబద్ధమాడిఉండాలి — పందెం — మనల్ని ఏదో కంగారు పెట్టేస్తే తనకు జీతం పెంచుతాం కదా అని!

కనక : కాదండీ !

రాఘ : పందెంవేస్తావా — గొల్ల తమాషా చెయ్యలేదని.

కనక : అబ్బ! పోదురూ !

రాఘ : రా, పందెం! ఏం? ఆ రవ్వల 'నెక్‌లెస్'....

కనక : అనవసరం — ఆ నెక్‌లెస్ నేను కొట్టేయటం....

రాఘ : (నవ్వుతూ) తగ్గుదూ—నేనేదో పాపాయిని లక్ష్యపెట్టటంలేదని నీ ఉద్దేశం, ఔనా? ఎందుకూ, పాపాయికి ఎన్ని నెలలోకూడా తెలీదు నీకు.

కనక : నాకు తెలీదనా మీ ఉద్దేశం? పాపాయి....

రాఘ : కాదు — కాదు — సరిగ్గా! ఉండు! ఆఁ! మూడు నెలల ఎనిమిది గంటలు.... (నవ్వుతాడు) గొల్ల అవసరం తీరిపోగానే వెంటనే ఇక్కడికి తీసుకువచ్చేద్దాంలే. ఇంకా ఆరునెలలు ఆగాలిగా!

కనక : ఆరునెలలే! మనపెళ్ళి ఆరునెలలకు వెనక్కి తోసెయ్యకపోతే — పాపాయి ఇప్పటికి వచ్చేసి ఉండేదికదండీ !

రాఘ : నీకెన్నిసార్లు చెప్పాను — నేను చేసిందే చాలా సబబైన పనని! ఆలోచించు.... ఎలా పెళ్ళిచేసుకోమంటావ్ —నాకేదో క్షయలాంటిది ఉండేదని డాక్టర్ చెపుతూంటే?

కనక : మీ డాక్టర్ వట్టి పశువంటాను — మీరేదో క్షయఉన్నట్టు కనిపించినట్లు!

రాఘ : డాక్టర్లంతా వట్టి 'ఈడియట్స్' అని ఎవరికి తెలీదు వల్లీ!

కనక : నిజంగా మూడు నాల్గు సంవత్సరాలు ఆగాలని చూశారుగా!

రాఘ : ఔను, నిజానికి నా 'లంగ్స్'లో ఏ దోషమూలేదు.

కనక : పైగా నన్నంటారు, డాక్టర్ చెప్పాడుకదా అని....

రాఘ : కాని — నిజానికి నాకు మొదట 'బ్రోంకైల్ ట్రబుల్' ఉన్నట్టుగా ఉండేదిలే! గట్టిగా ఊపిరి పీలుస్తుంటే — అలా — అదొకలా ఉండేది .... కాని ఎక్కువగా కాదనుకో. గుండెకి రెండుపక్కలా ఏదో బరువుగా ఉన్నట్టుండేది.

కనక : మనపెళ్ళి అంతకాలమూ తొసెయ్యడానికి అదేమీ కారణం కాదుగా!

రాఘ : (లేస్తూ) ఔనౌను! కాని నిజానికి — ఒక క్షయరోగిని పెళ్ళిచేసుకొనే ప్రమాదానికి నిన్ను గురిచెయ్యటం నాతప్పుకాదా మరి? అలా జరిగినందుకు నాకేమాత్రం బెంగలేదంటాను. కాని ఆ 'స్పెషలిస్టు'మాత్రం జ్ఞాపకంవస్తే నవ్వొస్తుంది వల్లీ! జబ్బుగా ఉన్నవాడెవడైనా ఎదురైతే ఇపుడు 'సలహా చెప్పడానికే ముప్ఫైరూపాయిలు అడిగే డాక్టర్ల దగ్గరికి — నాయనా వెళ్ళొద్దని' చెప్పాలనుకొంటాను.

కనక : మీజబ్బు బాగవటానికి ఒకడు నాల్గు సంవత్సరాలు పడుకుందన్నాడు కదూ?

రాఘ : చావనిద్దూ! డాక్టర్లుమాత్రం మనుష్యులు కారేమిటి? వాళ్ళుమాత్రం ఎలాగోలాగు బతకాలిగా! వాళ్ళ సలహాలు అంత ఖరీదూచేస్తే వాళ్లకే మంచిదిగా.

కనక : ఆఖరికి ఊరూపేరూలేని ఒక చిన్న డాక్టర్ మూడు నెలల్లో కుదిర్చేశాడు మీ జబ్బు, కదూ!

రాఘ : ఔను, పాపం! అసలు పేరేలేదు ఆ డాక్టరికి. అతని ఎడ్రసు ఎలామర్చిపోయానో ఆశ్చర్యంగాఉంది వల్లీ! పేపరులో చూచినట్టు జ్ఞాపకం — ఇంచు మించు 'కాసినో' వద్దో .... చచ్చాను, ఎంతకీ ఎడ్రసుమళ్ళీ దొరకందే!

కనక : ఆఖరికి — పాపాయికి ఒక ఏడాది ఉండవలసింది — ఆరు నెలలే ఇప్పుడు.

రాఘ : ఐతేఏం? పాపాయి పెద్దదైనపుడు ఆ ఆరునెలలూ ఎక్కువగా ఉంచేసుకొందాం మన దగ్గర — తరువాత పెళ్ళి చేసేద్దాంలే!

కనక : ఊరుకోండి; అల్లాంటి మాట అనకండి! ఎప్పటికైనా పాపాయి మన దగ్గరనుంచి వెళ్ళిపోతుందంటే — నా కెంతో ఇదిగా ఉంటుందిప్పుడే!

రాఘ : కంజీవరం — వరదరాజస్వామి ఆలయంలో పాపాయిపెళ్ళి — ఆదృశ్యం ఆపుడే కళ్ళకు కట్టినట్టుంది నాకు.

కనక : కంజీవరంలో ఎందుకండీ?

రాఘ : ఔను, అక్కడే జరిగితీరాలి — పాపాయికి రవ్వల నెక్‌లెస్, బంగారపుజడా, రవ్వల దుద్దులు — అబ్బ! ఎందరు వస్తారనుకొన్నావ్!

కనక : అబ్బో! చాలాకాలముంది లెద్దురూ! అప్పుడే ఎందుకు ఈ మాటలన్నీ ....

రాఘ : ఔనులే!

కనక : (లేస్తూ) 'షాపింగ్'కి వెళ్ళాలండీ — ఇపుడే వస్తా — ఏమనుకోరు కదూ?

రాఘ : వెళ్ళు — పరుగెత్తు! డ్రైవర్‌తో చెప్పావా? చక్కగా ఉంది ఇవేళ.

కనక : చూడండి, ఈ జుబ్బా ఇంకోటి — దేవికి ఎంతో బాగుంటుంది (జుబ్బాతో ఆడుతున్నట్టు) రా, చిట్టితల్లీ! అమ్మకేసి నవ్వు ....

రాఘ : ఎంత మురిసిపోతుందండీ! ఊం, వెళ్లు త్వరగా! నా కెంతో పనుంది — నీవు బైటకు వెళ్ళింతరువాత మొదలెట్టాలి. చూడు యీ కాగితాలు! త్వరగా దయ చెయ్యండి.

(కనకవల్లి అప్యాయంగా రాఘవేంద్రం బుగాలు ఒక్కసారి ఊపి నవ్వుతూ, చలాకీగా వెళ్ళిపోతుంది. రాఘవేంద్రం సిగరెట్ ముట్టిస్తాడు. అద్దంలో ఒకసారి తనని చూచుకొని — నవ్వుకొని — ఎడమవైపు ఉన్న ఈజీఛైర్‌లో కూర్చుంటాడు — చిన్న రాగం ఆలాపిస్తూ కాళ్ళ కిందికి చిన్న బల్ల లాక్కొని కాళ్లు చాస్తాడు. ఎడమవైపు ద్వారంనుంచి సుందరమ్మ వస్తుంది, వయసు నలభైఐదు. సన్నగా పొడవుగా ఠీవైన ముఖంతో వుంటుంది.)

రాఘ : (లేస్తూ ఆశ్చర్యంగా) అమ్మా! పైరివ్వ లేదేం? రేపటికికాని రావనుకొంటున్నాం. కనకవల్లి ఇప్పుడే బైటికి వెళ్ళింది. వెంటనే పిలిపించనా?

సుంద : ఒద్దులే; ఇప్పుడామె అవసరంలేదు.

రాఘ : విషయం ఏమిటమ్మా!

[వారి సంభాషణ మధ్య మధ్య తెగిపోతూంటూంది]

సుంద : పాపాయినీ గొల్లనీ తీసుకువచ్చాను ఇక్కడికి.

రాఘ : పాపాయికి సుస్తిగా ఉందా ?
సుంద : ఊఁ !
రాఘ : ఏమయిందేమిటి ?
సుంద : భయపడవలసిందేమీ లేదు.
రాఘ : పోనీలే !
సుంద : ప్రస్తుతానికి మాత్రమే ....
రాఘ : ఐతే డాక్టర్‌కి కబురంపాలి.
సుంద : డాక్టర్ దగ్గర్నుంచే వస్తున్నాను.
రాఘ : ఒహో ! నేనెక్కడికీ వెళ్ళటం లేదులే. డాక్టర్‌తో మాట్లాడుతాను.
సుంద : నేను కలుసుకొన్నాను డాక్టర్ని.
రాఘ : ఉన్నాడన్న మాట ?
సుంద : పాపాయిని తీసుకువెళ్ళి చూపించాను డాక్టరికి.
రాఘ : అంత 'అర్జంట్' విషయమేమిటి ?
సుంద : మన పల్లెటూరి డాక్టర్ చెప్పిందాన్నిబట్టి — త్వరగా నిర్ధారణ చేసుకోవటం మంచిదని ....
రాఘ : ఇంతకీ 'సీరియస్'గా ఏమీ లేదుగా!
సుంద : ప్రస్తుతానికి లేదులే !
రాఘ : ఆరాత్రి నీవిక్కడనుంచి వెళ్ళింతరువాత — పాపాయ్ ఎలాఉందప్పుడు ?
సుంద : బాగానే ఉంది — ఐనా డాక్టర్‌ని పిలిపించాను వెంటనే.
రాఘ : ఎమన్నాడేమిటి ?
సుంద : పాపాయికి సీసాతో పాలు పట్టాలంటాడు.
రాఘ : సీసాతోనా ? అసంభవం ! నీకు తెలుసుగా !
సుంద : ఆడాక్టర్‌తో వాదనేమిటని ఊరుకొన్నాను. పాపాయి జబ్బుమాత్రం చాలా ప్రమాదమౌతుందంటాడు. అదంతా గొల్లకేమీ చెప్పకుండానే, కూడా తీసుకువచ్చేశాను.
రాఘ : ఇంతకీ పాపాయికి జబ్బేమిటంటాడు ?
సుంద : (చాలాసేపు ఆలోచనతో ఆగి) నాకు తెలీదు.
రాఘ : డాక్టర్ని అడిగేవా ?
సుంద : ఊఁ; అడిగేను.
రాఘ : ఏమన్నాడు ?

[ నిశ్శబ్దం ]

సుంద : నాకేం చెప్పలేదు, డాక్టర్ !
రాఘ : (మెల్లిగా) బహుశా అతనికే తెలీదేమో !
సుంద : (కొంతసేపు ఆగి శ్లేషగా) బహుశా తెలుసుండదు.

[ఇక జరిగే సంభాషణలో ఒకరినొకరు చూచుకోరు]

రాఘ : మన 'ఫేమిలీ' డాక్టర్ — ఇపుడు — ఏమీ చెప్పలేదా?
సుంద : ఆయనదగ్గరికి వెళ్ళందే !

రాఘ : ఒహో (నిశ్శబ్దం. చాలవరకు మెల్లిగా) ఏం ? ఎంచేత ?
సుంద : ఆ పల్లెటూరి డాక్టర్ నన్ను భయపట్టేశాడు.
రాఘ : భయపెట్టాడా ?
సుంద : ఔను ఆ జబ్బు....

[ నిశ్శబ్దం ]

రాఘ : (బాధగా) ఏమన్నాడు ?
సుంద : మన 'ఫేమిలీ' డాక్టర్‌కికూడా లొంగనంత జబ్బా అని అడిగేను.
రాఘ : ఏమన్నాడు ?
సుంద : ఒక పెద్ద డాక్టర్‌నిచూడ్డం మంచిదన్నాడు.
రాఘ : (తమాయించుకొంటున్నట్టు) మరి — ఎక్కడికి వెళ్ళమన్నాడు ?
సుంద : (కార్డొకటి ఇచ్చి) చూడు ఈ కార్డు....
రాఘ : ఈ డాక్టర్‌దగ్గరకా వెళ్ళమంట ?
సుంద : ఔను. నీవెరుగుదువా ఈ డాక్టర్‌ని ?
రాఘ : లేదు — అవును — ఎపుడో కలుసుకొన్నట్టు గుర్తు — జ్ఞాపకంలేదు. (అతి మెల్లిగా) భగవాన్ !
సుంద : (కొంతసేపు ఆగి) ఇపుడు నీతో మాట్లాడ్డానికి వస్తున్నాడు.
రాఘ : (మాట్లాడలేకపోతున్నట్టు) ఐతే అంత ఆత్రుతగా ఉన్నాడా ?
సుంద : నీతో మాట్లాడాలట వెంటనే !
రాఘ : నాతోనా ?
సుంద : అవును — నీతోనే !
రాఘ : (ఓర్చుకొంటూ) మంచిదే !
సుంద : గొల్లని డాకర్ 'వైటింగ్ రూమ్'లో కూర్చోబెట్టాను; దాన్ని చూడ్డానికివచ్చి డాక్టర్ నాతో 'ఈ పాప తండ్రిని కలుసుకొని మాట్లాడితేకాని — మందివ్వటం కష్టం' అన్నాడు. అలాగేనని నీఎడ్రసు ఇచ్చాను. యీపాటికి వస్తుంటాడు.
రాఘ : (తనలో తాను మెల్లిగా) పాపం ! నోరులేని పసిపాప !
సుంద : అవును — నోరులేని....
రాఘ : (చాలాసేపటికి) అమ్మా !
సుంద : (తలుపు తెరవటం విని) ఊరుకో ! (రాముడువచ్చి సుందరమ్మతో మాట్లాడతాడు. రాఘవేంద్రతో) డాక్టర్ వచ్చాడట.
(రాముడుతో) లోపలికి తీసుకురా.
(లేస్తూ రాఘవేంద్రంతో) నేను పిలవగానే వస్తాను.

[ఎడమ ద్వారంలోకి వెళ్ళిపోతుంది సుందరమ్మ. కుడివైపు ద్వారంనుంచి డాక్టర్ వస్తాడు]

డాక్టర్ : (రాముడితో)పాపాయి లేవగానే నాకుచెప్పు. తెలిసిందా ?
రాముడు : అలాగేనండీ ! (వెళ్ళిపోతాడు)
రాఘ : (ఉద్రేకంతో)నమస్కారం, డాక్టర్ ! నన్ను గుర్తుపట్టేరా ?
డాక్టర్ : (నిరుత్సాహంగా — 'సింపిల్'గా)నీవు — నీవేనా ?
నే చెప్పిందంతామాని — పెళ్ళిచేసుకొని పైగా బిడ్డనుకూడా కన్నావూ ?
(తనలోతానే)'స్కౌండ్రిల్ '!

రాఘు : నన్ను ఎక్స్‌ప్లెయిన్ చెయ్యనియ్యండి, డాక్టర్!
డాక్టర్ : అవసరంలేదు.

[నిశ్శబ్దం]

రాఘు : (బతిమాలుకొంటున్నట్టు)నా చిట్టిపాపను 'ట్రీట్' చేస్తారు కదూ?
డాక్టర్ : (బుజాలెగరవేసి, మెల్లిగా)అసంభవం!
రాఘు : (వినన్నట్టు) ఆరునెలలుమాత్రమే పెళ్ళి ఆపుచెయ్యగల్గేను, డాక్టర్!
డాక్టర్ : ఆవిషయాలతో నాకేం సంబంధం? నాకోపానికిమాత్రం నీవెందుకు గురికావాలిపుడు? నీకు నువ్వే ఆలోచించుకోడానికి వొదిలెయ్యవలసింది. నీపాప భవిష్యత్తును గురించీ, గొల్లయొక్క భావినిగురించీ మాత్రమే నేనిప్పుడు ఆలోచించాలి. ఇతర విషయాలతో నాకు పనిలేదు.
రాఘు : ఆమెకు అపాయం లేదుకదా, డాక్టర్?
డాక్టర్ : గొల్లకు ఆవ్యాధి అంటుకొనే అపాయం మాత్రమే ఉంది.
రాఘు : కాదు — కాదు — మాపాపాయి సంగతి అడుగుతున్నాను.
డాక్టర్ : ప్రస్తుతం లక్షణాలు ముదిరినట్టుగా లేవు.
రాఘు : థాంక్సు! (తేలికగా)గొల్లగురించి — అదేనా మీరనేది? మా అమ్మను ఇక్కడికి పిలిపిస్తే మీకు అభ్యంతరం లేదు కదూ? ఈవిషయములు నాకంటే ఆమెకే బాగా తెలుసు.
డాక్టర్ : నీ ఇష్టం/ పిలు.
రాఘు : (తలుపు దగ్గరికి వెళ్ళి — తిరిగివచ్చి — ఉద్రేకంతో)మిమ్మల్నొక విషయంలో వేడుకొంటున్నా. జరిగిందంతా నా భార్యకు తెలీకుండా కాపాడగలరా, డాక్టర్! దీనికంతకీ నేనే కారణమని నా భార్యకు తెలిస్తే — ఆమెకోసం మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. ఆమె తప్పేముంది, పాపం!
డాక్టర్ : ఆమెకిదేమీ తెలీకుండా, ఏదైనా చేస్తాను.
రాఘు : థాంక్యూ! థాంక్యూ!
డాక్టర్ : ఇంక చాలు! అబద్ధాలు చెప్పావనంటే — అంతా ఆమెనుగురించే — నీగురించి కాదు.
రాఘు : మా అమ్మకు తెలుసా?
డాక్టర్ : ఆమెకంతా తెలుసు.
రాఘు : కాని....

డాక్టర్ : ఇంకా చాలా విషయాలు మాట్లాడాలి — దయుంచి మీఅమ్మగార్ని త్వరగాపిలు.

[రాఘువేంద్రం తలుపుదగ్గరకు వెళ్ళి తల్లిని పిలుచుకువస్తాడు. డాక్టర్‌కి సుందరమ్మ నమస్కరిస్తూ ఒక కుర్చీచూపి తనూ టేబిల్‌దగ్గరగా కూర్చుంటుంది. టేబిల్ ముందుగా రాఘువేంద్రం కూర్చుంటాడు]

డాక్టర్ : పాపాయికి 'ప్రిస్క్రిప్షన్' వ్రాసిస్తాను. ఇంకేమీ 'కాంప్లికేషన్స్' లేకుండా 'కండిషన్' బాగుపడుతుంది కాని అంతటితో మన బాధ్యతలు తీరిపోవు. ఇప్పటికైనా మించిపోలేదు — ముందు గొల్లదాని ఆరోగ్యం కాపాడాలి.

సుంద : మేమేంచెయ్యాలో చెప్పండి, డాక్టర్.

డాక్టర్ : మీ పాపాయికి ఆ గొల్ల పాలివ్వటం మానాలి.

సుంద : ఆ గొల్లని మార్చాలని అంటున్నారా ?

డాక్టర్ : కాదు. మీ పాప — ఈ గొల్లేకాదు — ఆరోగ్యంగాఉన్న ఏ గొల్లపాలైనా తాగటం ఇంక మానాలంటున్నాను.

సుంద : వీల్లేదు (తమాయించుకొంటూ) ఎందుకు ?

డాక్టర్ : తనకు పాలిచ్చిన ఆమెకు ఈ పాపవల్ల ఈ రోగం అంటుకొనే అవకాశముంది.

సుంద : కాని సీసాపాలుపడితే పాపాయి చచ్చిపోతుంది డాక్టర్! మా కోడలికి పాలులేక పోతే — సీసాపాలు పట్టాలని ప్రయత్నించాం. ప్రతిసారీ పాలన్నీ కక్కేసేది — ఒక్కరోజా! ఆఖరికి ఈ గొల్లని ...

రాఘు : (ఏడుస్తూ) భగవాన్ ! ఇదంతా నా పొరపాటు!

డాక్టర్ : మంచి అనుభవమున్న హాస్పటల్ నర్సు 'చార్జిలో' కొత్త పద్ధతుల్లో 'ట్రీట్ మెంట్' ఇస్తే —

సుంద : పిల్లలకి బాగా ఆరోగ్యంగా ఉంటే ఎలాపట్టినా సరిపోతుంది. కాని ఈ మూడు నెలల పసిపిల్లకి చనుబాలు తప్ప ఇంకేం పడతాయి, డాక్టర్?

డాక్టర్ : అదికాదమ్మా!

సుంద : అవునా అండి మరి! మీకు తెలియదుకనక నా — మాపాపాయి ప్రాణానికి గొల్లదాని ఆరోగ్యానికిమధ్య దేన్ని ఎన్నుకోవాలో నాకుతెలీటం లేదు.

రాఘు : (ఏడుస్తూ) ఓం హో! హో! భగవాన్ !

డాక్టర్ : మీ పాపమీద ప్రేమ దారుణమైన మాటలనిపిస్తోంది. ఏదిఎన్నుకోటానికైనా అది మీరు చేయవలసిందికాదమ్మా! ఈ పాపకు చనుబాలు పట్టడం నేను తీవ్రంగా నిరసిస్తున్నాను. ఆ గొల్లదాని ఆరోగ్యం మీ స్వంతాస్తి కాదు కదా!

సుంద : అవునా? మాపాపాయి ప్రాణాలుకూడా మీకు అంతేకదా? మాపాపాయి ప్రాణాన్ని కాపాడుకోడానికి చివరకు ఒక్కమార్గమున్నా దాన్ని అవలంబించాల్సిందే! అల్లాంటప్పుడు మీరుచెప్పినట్లే ఒప్పుకొంటే 'నాబిడ్డ ప్రాణంకూడా నాకు దక్కక పోవొచ్చు. ఏమైనా మాపాపని అలా ఊరికే చచ్చిపోనిస్తామనుకొంటున్నారా? నేతీసుకోవలసిన జాగర్తలో నేనున్నానెండి! పాపాయిని ఏదైతే కాపాడుతుందో అదే మానమంటున్నారు. అది పెద్దనేరం కాదా డాక్టర్? గొల్ల విషయం అంటారా — దానికి నష్టపరిహారంగా ... మేం చెయ్యగల్గింది చేస్తాంలెండి. కాని ఆపాలుమాత్రం ఎలా మానమంటారు? లాభం లేదు — పాపాయికి ఎంతైతే జరగాలో అంతే జరిగి తీరాలి .... ఏమైనా సరే ఎంత ఖర్చయినా సరే! కాని మీరేం అడుగుతున్నారో మీకర్థంకావటంలేదు. మాపాపాయిని చంపుకొని (కన్నీళ్ళతో) పాప— నా చిట్టిపాప — నా ముద్దు కృష్ణ ....

[రాఘవేంద్రం ఏడవటం మొదలు పెట్టినదగ్గరనుంచీ అదేఏడుపు. తల్లి అన్న ఆఖరి మాటలు వినగానే గొల్లుమంటాడు. అతని ఏడుపు జాలి పుట్టిస్తుంది]

రాఘు : (అవ్యక్తంగా) ఓం హో! నా చిట్టితల్లి! కన్నతల్లి! ఓ ....ఓ .... (చాలా మెల్లిగా) ఎంత నీచుణ్ని నేను! ఎంత 'ఫూల్'ని నేను.

డాక్టర్ : ఊరుకోండమ్మా! ఇల్లా కోపగిస్తే విషయాలు చక్కబడతాయా? తాపీగా ఆలోచించడానికే ప్రయత్నించండి ....

సుంద : ఔను డాక్టర్! క్షమించండి! ఈ పాపమీదే ప్రాణాలన్నీ పెట్టుకున్నాం. ఈ వయసులోనే, నాకోపాపాయి పోయింది. పెద్దదాన్నైపోయాను — పైగా విధవని. ఇంకా నా మనుమల్ని చూచేవరకూ బ్రతుకుతాననుకోను. రాఘవేంద్రం—కొంచెం ఊరుకో నాయనా! ఎంత ఏడిస్తే ఏమిటిలాభం? పాపాయి ఆరోగ్యంతప్ప ఇంకేవిషయానికీ నేనొప్పుకొంటాననుకొను. చనుబాలు మానేసి — పాపాయిని పంపుకొంటానను కొన్నావా వెర్రి తండ్రీ!

డాక్టర్ : ఇది మొదటిసారి కాదు — ఇలాంటి పరిస్థితుల్లో ఇదివరకే చాలాసార్లు ఇరుక్కున్నాను. నా సలహా వినకుండా వాటిని రోసివేసిన తలిదండ్రులు తరువాత ఎంత పశ్చాత్తాపపడ్డారో — మీకు ముందుగానే చెపుతున్నాను.

సుంద : నేను పశ్చాత్తాపపడవలసినది ఒకే ఒక్క విషయం....

డాక్టర్ : మీ గొల్లదానిలాంటి ఈ పల్లెటూరివాళ్ళు ఎంత బురదగొడ్లలా కనిపించినా కసి తీర్చుకోవలసివస్తే సల్లతాచుల్లా పగపడతారు. ఆ సంగతి మీకు తెలియదు. పైగా ఈ గొల్లకు కావాలని మీరు అన్యాయం చేస్తున్నారుకూడా.

సుంద : ఆఁ, ఏడిసిందిలెండి! అదేం చెయ్యగలదు?

డాక్టర్ : మీమీద ఏదైనా చర్యతీసుకోవచ్చు.

సుంద : ఇలాంటి విషయాలు ఆలోచించడానికి బుర్రెక్కడేడిసిందిలెండి!

డాక్టర్ : ఇతరులు దానిబుర్రలో ఎక్కిస్తారు.

సుంద : కోర్టువరకూ వెళ్ళడానికి దానికి దమ్మెక్కడిదండీ!

డాక్టర్ : అయితే దాని పేదతనం—అవివేకం అదనుగా తీసుకొని మీరేదో లాభం పొందాలనే చూస్తారా. కోర్టు ఆమెకు సహాయం చెయ్యవచ్చు.

సుంద : లాభంలేదు — ఎప్పటికీ....

డాక్టర్ : అలాగా! ఇలాంటివి పదికేసులు చూశాను. నిజమంతా బజారైనప్పుడు — తలిదండ్రులకే వ్యతిరేకంగా తీర్పు చెప్పబడిందని నాకు తెలుసు.

సుంద : ఇలాంటి కేసు విషయంలో బహుంపటు, డాక్టర్! అమాయకురాలైన ఇలాంటి పసిపాప జీవితం దగ్ధమైపోతున్నపుడు కాదనుకొంటాను — పొరపడిఉంటారు మీరు.

డాక్టర్ : అన్ని కేసులూ ఇల్లాంటివే — నేను తారీకులతో సహా ఇవ్వగలను.

రాఘ : 'లా రిపోర్ట్సు' ఇవిగో!

డాక్టర్ : (చిన్నపేపర్‌మీద వ్రాస్తూ) ఈ 'వాల్యూమ్' కావాలి.

రాఘ : (లేచి) ఇదిగో డాక్టర్! (పుస్తకం ఇస్తాడు)

సుంద : అవన్నీ అనవసరం.

డాక్టర్ : (రాఘవేంద్రంతో) నీవైనా ఆమెకు నచ్చచెప్పి చూడు! ఒకటి రెండు కేసుల్లో ఇలాంటి గొల్లవాళ్ళకు సాలీనా 'పెన్‌షన్' కింద ఆ తలిదండ్రులచేత కొంత ఇప్పించారు. కొన్ని కేసుల్లో ఏడెనిమిదివేల రూపాయిలు....

సుంద : ఆ 'చార్జి' మామీదే వస్తే .... పెద్ద పెద్ద లాయర్లని మేమూ ఎరుగుదుము. ఆ మాత్రం మేమూ తట్టుకోగలంలెండి! భగవంతుడు మాకామాత్రం ఇచ్చాడు. ఆ

వ్యాధి పాపాయిది కాదని — ఆ గొల్లచే పాపాయికి అంటుకొన్నదని మేమూ వాదించగలం.

డాక్టర్ : అలా చేసే మీరెంత రాక్షసానికి వొడిగట్టుకోవటమో ఆలోచించండి !

సుంద : అదంతా నాయర్లపనండీ! నేనేం చెప్పను ? ఏమైనా మా కేసు గెలుస్తుందని మాత్రం చెప్పగలను.

డాక్టర్ : ఎంత అపఖ్యాతిపాలుగావలసివస్తుందో ఆలోచించారా ?

రాఘ : (పుస్తకంలో ఒక పేజీ చూపిస్తూ) ఇదిగో! మీరంటూన్న .... ఆరువేల రూపాయలకు డిక్రీ.

డాక్టర్ : తరువాత మీ అమ్మగార్కి చదివి విన్పించు. 'రిపోర్టు'లన్నీ ఉన్నాయికాబట్టి (రాసియిచ్చి) ఈ'వాల్యూమ్, ముందు ఇలా ఇయ్యి (రాఘవేంద్రం 'బుక్ కేస్'దగ్గిరికి వెళతాడు. సుందరమ్మతో) ఎంత అపవాదువస్తుందో ఆలోచించారా?

రాఘ : (వెనిక్కివస్తూ) కాని డాక్టర్! ఇల్లాంటి 'రిపోర్టు'లో పేరుమాత్రం బైటపెట్టరండీ

డాక్టర్ : కోర్టులో చెపుతారుగా !

రాఘ : అవును - నిజమే!

డాక్టర్ : ఏ పేపరైనా ఈ కేసుని మొత్తంగా ప్రకటించదని హామీఏమిటి?

సుంద : అమ్మో! అపఖ్యాతి!

డాక్టర్ : ఎంతదారుణమైన అపఖ్యాతో చూడండి! [రాఘవేంద్రం దల ఊపుతాడు.] పెద్ద విపత్తులో పడతారు.

రాఘ : ముఖ్యంగా సాటి లాయర్లకి....(ఇంకో 'వాల్యూమ్' తేవడానికి వెళతాడు.)

సుంద : మా మీద ఎలాటి కేసూ పెట్టకుండా ఆగొల్లని చూసుకుంటాం లెండి. ఆమె కేం కావలిస్తే అది ఇచ్చుకొంటాం.

డాక్టర్ : ఐతే దారుణంగా మోసపోయారన్నమాటే; ఆమెని తడిగుడ్డతో గొంతుకోసినట్టు కదూ ? పన్నెండు సంవత్సరాలు ఇలా చాటుగా లంచమిచ్చుకొంటూ వచ్చిన ఒక గొప్ప కుటుంబాన్ని కూడా నేనెరుగుదును.

సుంద : రసీదుమీద సంతకం చేయించుకొంటాం.

డాక్టర్ : అన్నిహక్కులూ మీవేననా ?

రాఘ : అవును — ఇదిగో 'వాల్యూమ్'.

సుంద : మేమిచ్చే డబ్బులో ఒకపొలం చిన్న ఇల్లూ కొనుక్కోవానికి, ఆనందంగా తిరిగి వెళ్ళిపోతుంది గొల్ల. అలాంటివాని కదే మహాభాగ్యం .

[గొల్లవస్తుంది]

గొల్ల : పాపాయి లేచిందండీ అమ్మగారూ ?

డాక్టర్ : ఇప్పుడే వచ్చి చూస్తా. (సుందరమ్మతో)ఇప్పుడే వొస్తాను.

సుంద : అలాగే డాక్టర్! గొల్లపనేమైనా ఉందా ?

డాక్టర్ : అవసరంలేదు.

[డాక్టర్ వెళతాడు]

సుంద : గొల్లా! ఒక్కనిమిషంలో మళ్ళీవస్తావా? నీతోనూ మాట్లాడాలి. (గొల్లవెళుతుంది. మెల్లిగా రాఘవేంద్రంతో) దానితో ఎలా వ్యవహరించాలో నాకుతెలుసులే. దాన్ని

హెచ్చరించినప్పటికీ అది ఇక్కడే ఉండటానికి ఒప్పుకొంటే, డాక్టర్‌మాత్రం కాదనగలదేమిటిలే!

రాఘు : ఆఁ, ఏమీ అనలేము.

సుంద : పాపాయికి అలాగే పాలిస్తూఉంటే ఆఖరున రెండు వందల రూపాయలు చేతిలో పెడతానని చెపుతాను. ఏం?

రాఘు : సరిపోతుందంటావా?

సుంద : సరే చూద్దాంగా! అక్కడికీ ఒప్పుకోకపోతే — పెంచుదాంలే!

రాఘు : సరేలే!

[గొల్ల వస్తుంది]

సుంద : (గొల్ల వైపు తిరిగి ఆలోచిసుగా) గొల్లా! పాపాయికి ఒంట్లో ఏమీ దాగోలేదని నీకు తెలుసుగా!

గొల్ల : తెలీదండమ్మా!

సుంద : పాపం! దానికి ఒంట్లో దాగోలేదే!

గొల్ల : నేను చెయ్యవలసిందంతా చేశానమ్మా!

సుంద : నీవు చెయ్యలేదనటంకాదుగొల్లా! కాని పాపాయికి జబ్బుగాడుంది. డాక్టర్ చెపుతున్నాడు అలాఅని.

గొల్ల : అంతా అబద్ధమండీ అమ్మగారూ! డాక్టర్లు ఏదో తప్పుపడుతూనే ఉంటారు - కాకపోతే వాళ్ళకు ఏమీతెలీదను కొంటారనిభయం.

సుంద : కాని ఈయన చాలాపెద్దడాక్టరులే. పాపాయికి పోతరపు పొక్కుల్లాంటివి ఉండటం నువ్వు చూచేఉంటావ్!

గొల్ల : కొంచెం వేడిచేసిఉంటుంది అంతేనండి అమ్మగారూ! మీరు ఖంగారుపడకండి. అదంతా పాపాయి రక్తంలో ఉన్నబలం, అంతే! నాతప్పేమీలేదు. నేను చెయ్యగలిగిందంతా చేశాను. కంటికి రెప్పలాకాపాడానండి!

సుంద : నీ తప్పని ఎవరంటున్నారుగొల్లా!

గొల్ల : ఐతే నాలో ఏం తప్పుఉందంటారు? పాపాయికేం ఫరవాలేదమ్మా! బస్తీపిల్ల—ఆమెకేం? కాని కొంచెం పీనాసి. అంతేనంటమ్మగారూ!

సుంద : సుస్తీగా ఉందంటున్నానంతే! కొంచెంరొంపచేసింది. గొంతువెనక చిన్నకురుపులు లేచాయట!

గొల్ల : పాపనోట్లో వేలుపెట్టి ఇష్టంవచ్చినట్టూ గోకితే ఏమౌతుంది అమ్మగారూ! కొంచెం రొంపచేసిందంటే ఎప్పుడు వచ్చిందో నాకు తెలీదుమరి. గుడ్డలన్నీ అతిజాగ్రత్తగా కప్పి — మూడేసి పొరలుచుట్టి కప్పేదాన్ని. మొన్నరాత్రి మీరువచ్చినపుడు కిటికీలన్నీ తెరిచేశారు జ్ఞాపకం ఉందాండి! అపుడువచ్చుండాలి—రొంప నాతప్పు....

సుంద : అదేంటే గొల్లా నీతప్పని యెవరంటున్నారంటావ్?

గొల్ల : అవునులెండి! కాని....ఏంచెయ్యనమ్మా!—పల్లెటూరిదాన్ని మరి....

సుంద : అదేమిటే అల్లా అంటావ్?

గొల్ల : అవునులెండి....అంతా నాకు తెలుసు.

సుంద : నీకు మళ్ళీమళ్ళీ చెపుతున్నాను — నీతప్పేమీలేదని. చెపుతుంటే వినవేంటి!

గొల్ల : (అదేధోరణిలో) ఇలాంటిగొడవలన్నీ వస్తాయని అనుకోలేదు వొచ్చేముందు (గొణుక్కుంటుంది)

సుంద : నీవువేసిన పొరపాటేమిటే గొల్లా! పాపాయికి సుస్తీగా ఉందని నీకు ముందుగా చెపుతున్నాం.. అంతే! పైగా పాపాయిమూలంగా నీకూడా సుస్తీ చెయ్యొచ్చునని అంటున్నానన్నమాట!

గొల్ల : (చించుకొంటూ) ఐతే పాపాయిరోగం నాకు పట్టుకొంటే — ఇదిమొదటిసారి కాదులెండి. నాకు చిన్నప్పటినుంచీ అలవాటే.

సుంద : పాపాయికున్న పోతరం పొక్కుల్లాంటివి నీకూడా రావొచ్చు!

గొల్ల : (హేళనగా)మీబస్తీ పిల్లలకు మల్లే మాలాంటి పల్లెటూరి వాళ్లకు సుకుమారమైన తెల్ల చర్మాలు ఉండవ్ కదమ్మా! ఎండనకా వాననకా రోజల్లా పొలాల్లో పనిచేసే మేం పౌడర్లతో ముఖాలు నింపుకోం కదమ్మా! నేనిలా అంటున్నానని కాదు — ఏదోవొంక దొరకాలంటే....

సుంద : ఏమిటి వొంక అంటావ్ గొల్లా!

గొల్ల : నాకుతెలుసు లెండి అమ్మగారూ!

సుంద : ఏమిటి తెలుసు నీకు?

గొల్ల : పల్లెటూరి గొల్లదాన్ని అమ్మగారూ ....

సుంద : నీవనేదేమిటో నాకసలు అర్థం కావటంలేదు.

గొల్ల : నేనంటూంది నాకు తెలుసు అమ్మగారూ!

సుంద : ఐతే ఏమిటో చెప్పు!

గొల్ల : ఏంలాభం అమ్మగారూ?

సుంద : చెప్పుగొల్లా, నిజంగా....

గొల్ల : అదికాదమ్మగారూ....

సుంద : ఊఁ, కానియ్యి....

గొల్ల : నేనెంత పల్లెదాన్నైనా అంత తెలివితక్కువదాన్ని కాదంవోయ్! మీకుకావలసిందేమిటో నాకుతెలుసు. ఈ బస్తీవస్తే నెలకి యింకో ఇరవైరూపాయిలు ఎక్కువగా ఇస్తారని పెద్దమ్మగారు చెప్పిందాన్కి బాబుగార్కి కోపంవచ్చింది.(రాఘవేంద్రంకేసి తిరిగి) ఏంబాబూ! ఏం అనుకొన్నారు? నా కుర్రోడినిమాత్రం పెంచుకోఅక్కర్లేదా బాబూ? వాడిఅయ్యమాత్రం తిండితినక్కర్లేదా బాబూ! పల్లెటూరి పేదవాళ్ళంబాబూ!

రాఘ : పొరపాటుగొల్లా! అదేమీకానేకాదు. అమ్మ — అవనంగా ఆ ఇరవైరూపాయిలూ నీకిస్తాననటం చాలాసబబుగా ఉందంటాను. ఇంతకీ నీవు సరిపోతాయా లేదా అని అనుకొంటున్నాను. పాపాయి పెద్దదై నవుస్తుంటే — నీవెలాగూ పెళ్ళిపోతావా— అప్పుడు మా సంతోషం తెలుపుతూ ....

సుంద : (అడ్డువొస్తూ)పెద్దబహుమానంఇస్తాం అర్థమయిందా—నీజీతంకాక అన్నమాట!నీకు—(రాఘవేంద్రంకేసి చూస్తూ) ఐదువందల రూపాయలు ఇస్తాం —లేక వెయ్యిరూపాయిలో! పాపాయి మంచి ఆరోగ్యంలో ఉంటేనే సుమా!

గొల్ల : (తికమకపడుతూ) నాకు ఐదువందల రూపాయల్తే — (అర్థం చేసుకోడానికి గింజుకొంటూ) ఏమో! ఎందుకు లెండి అమ్మగారూ!
ముందు మనం అలా అనుకోలేదు కదండీ!

సుంద : కాదు — కాని....

గొల్ల : (మెల్లిగా తనలో తానే) ఐతే ఏ మొచ్చింది అమ్మగారూ!

సుంద : అతిజాగ్రత్తగా — చాలా శ్రద్ధతో పాపాయిని చూడాలి కాబట్టి నీవు కొంచెం కష్టపడాల్సుంటుంది—పాపాయిగురించి మందూమాకూ ఇస్తూండాలి. పూర్వంకంటే పని కొంచెం కష్టం కావొచ్చు.

గొల్ల : ఓం! అంతేనా! అతి జాగ్రత్తగా పాపాయిని చూస్తానని మీరిక ధైర్యంగా ఉండొచ్చు. 'పాపాయి అంటే గొల్లకి ప్రాణం' అని అనుకోండి.

సుంద : ఐతే వొప్పుకొన్నట్టేనా ?

గొల్ల : అలాగే అమ్మగారూ!

సుంద : మంచిది. మళ్ళా వెనక్కివచ్చి పేచీలు అవీ పెట్టవుకదా ? పాపాయికి సుస్తీగా ఉంది — ఆ సుస్తీ నీకూడా చెయ్యొచ్చు. నీకు ముందుగానే చెపుతున్నాం. నీకు శ్రమకూడా హెచ్చవుతుంది కాబట్టి — నీ పని ఇక్కడ పూర్తయ్యాక ఐదు వందల రూపాయిలు నీకిస్తాం. అర్థమయిందా?

గొల్ల : వెయ్యిరూపాయిలన్నారు, అమ్మగారూ!

సుంద : పోనీ వెయ్యిరూపాయిలనుకో, ఏం ?

[రాఘవేంద్రం తక్కిన ఇద్దరికీ కుడివైపుగా వెనక్కివెళ్ళి సుందరమ్మతో 'రాతమూలకంగా ఉంచేనో' అని సౌజ్ఞ చేస్తాడు]

సుంద : గొల్లా! ఇక తిరుగులేదనుకో— చూశావా! అప్పుడే మరచిపోయాను— వెయ్యి రూపాయిలు నీకిస్తానన్నానని! అందుకే ఓ కాగితంమీద రాసిస్తాం — నువ్వు వేలి ముద్దర వేద్దువుగాని....

గొల్ల : అలాగేనండి అమ్మగారూ!

సుంద : అదిగో! డాక్టర్‌గారు — గొల్లా నువ్వు వెళ్ళు —

గొల్ల : వెళతానమ్మా! (ఆశ్చర్యంగా) వెయ్యిరూపాయిలే. అమ్మయ్యో! వెయ్యిరూపాయిలే ఇంతసొమ్ము ఎందుకిస్తారన్నారు చెప్మా!

[గొల్ల ఆశ్చర్యపోతూ — ఎడమవైపుగావెళ్ళి డాక్టర్ రావడానికి తలుపు పట్టుకొని లోపలికి వెళ్ళిపోతుంది]

డాక్టర్ : (వచ్చి) పరిస్థితి ఏమీ మారలేదు. కంగారు పడవలసిందేమీ లేదు.

[టేబిల్ దగ్గర కూర్చొని 'ట్రీట్‌మెంట్' వ్రాస్తాడు]

సుంద : డాక్టర్! మీరిక పాపాయిని కొంచెం జాగర్తగా చూస్తే చాలు. మీరు వెళ్ళిం తరువాత గొల్లతో అంతా మాట్లాడాం. ఇక్కడే ఉంటానని వొప్పుకొంది. అదైనా కొంత డబ్బిస్తామని వాగ్దానం చేసినమీదటేలెండి!

డాక్టర్ : పాపాయికి పాలిస్తుంటే తనకు తప్పకుండా అంటుకొనేవ్యాధి—ఎంతమొత్తానికైనా లాభసాటిబేరంకాదు. గొల్లది ఆ జబ్బుతో చచ్చిపోకపోయినా పూర్తిగా అశక్తురాలై పోతుందికదా!

సుంద : కాని అది ఒప్పుకొందండి!

డాక్టర్ : ముందుముందు ఎందుకూపనికిరాకుండా పోవటమే కాకుండా తను ఇంకా పాలిచ్చే తక్కిన పిల్లలకు పెద్దప్రమాదం తెస్తుంది. ఆ వ్యాధిఫలితాన్ని ఆమె పెద్దగా అనుభవించకపోవచ్చు. కాని మనం డబ్బిచ్చినా ఆమె భవిష్యత్తు ధ్వంసమైపోతుంది.

సుంద : అది వొప్పుకోండండీ! తనఇష్టంవచ్చినట్లు చేసుకోడానికి దానికిహక్కు లేదంటారా?

డాక్టర్ : ఆమె ఆరోగ్యాన్ని అమ్ముకోడానికి హక్కు వుందో లేదో నాకుతెలీదుకాని—నిజానికి తనభర్తా పిల్లల ఆరోగ్యం అమ్ముకోడానికిమాత్రం ఆమెకు హక్కులేదంటాను. ఈ జబ్బు తాను అంటించుకొంటే — తనభర్తకీ పిల్లలకీకూడా తప్పక అంటిస్తుంది. దానికి తరువాత పుట్టేపిల్లల ఆరోగ్యాన్నీ జీవితాన్నీ మాత్రం అపాయంలోకి తెస్తుంది. ఇలాంటిబేరం కుదుర్చుకోటం ఎంత అపాయమో మీకర్థమౌతుందా? ఇల్లాంటి అన్యాయం ఇంకా జరక్కపోతే — దాన్ని ఆపడానికి ప్రయత్నించండి.

సుంద : 'ఈ అన్యాయం ఇంకా జరక్కపోతే' అన్నారు నిర్ధారించి చెప్పలేరా, డాక్టర్?

డాక్టర్ : అపుడేకాదు. మొదటి లక్షణాలు కన్పించడానికీ, ఈ జబ్బు అంటుకోడానికీ మధ్య ఐదారు వారాలైనా పడుతుంది.

సుంద : మీరొక పల్లెటూరి గొల్లదాన్ని గురించే ఇంత ఆలోచిస్తున్నారు కాని విలువైన మా చిట్టిపాప జీవితం మాటేమిటి? మేం ఎలా చచ్చిపోనిస్తాం పాపాయిని?

రాఘు : అవును పోనివ్వం!

డాక్టర్ : జీవితపు విలువలు — గొప్పవారికైనా పేదవారికైనా ఒకటేనమ్మా! ఈ గొల్ల జీవితం అపాయంలో పడటం నేనొప్పుకోను.

సుంద : మమ్మల్నిగురించి ఏమీ ఆలోచించటంలేదు మీరు!

డాక్టర్ : అవును. నిర్భాగ్యులు, దుర్బలుల తరఫున మాట్లాడుతున్నాను.

సుంద : మా 'ఫేమిలీ' డాక్టర్‌ని పిలుచుకువస్తే — ఇలా మాట్లాడేవాడు కాదు.

డాక్టర్ : లాభంలేదేమో! (లేస్తూ) ఇపుడేంమించిపోయింది — పిలుచుకురండి!

రాఘు : అమ్మా! — దయుంచి వెళ్ళకండి డాక్టర్!

సుంద : (విన్నపం చేసుకుంటున్నట్టు) ఇలా వదలివెళ్ళటం ధావ్యంకాదు డాక్టర్! ఈ పాప నాకు పంచప్రాణాలని మీకు తెలుసుంటే — ఇలా చెయ్యరు. జబ్బుపిల్ల — నిర్భాగ్యురాలు! బాధపడుతున్న ఈ పసిపాపను చూచినపుడైనా జాలి వెయ్యటంలేదా మీకు? మిమ్మల్ని బతిమాలుకొంటున్నాం, డాక్టర్!

రాఘు : మిమ్మల్ని ప్రార్థిస్తున్నాం డాక్టర్!

డాక్టర్ : నిజంగా జాలేస్తుంది. శక్తివంచనలేకుండా ఆమెను కాపాడ్డానికి ప్రయత్నిస్తా. కాని ఈ జబ్బుబిడ్డను గురించి నడియవ్వనంలో వున్న గొల్లదాని ఆరోగ్యం త్యాగం చెయ్యమని అడగొద్దు. ఆరోగ్యవంతమైన పిల్లల్ని కనడానికి అశక్తురాలైపోయి — తన కుటుంబాన్నంతా నాశనం చేసుకొనే ఈ వ్యాధిని అంటించుకోటం నేను తీవ్రంగా నిరశిస్తున్నాను.

సుంద : (తడి ఆరినగొంతుతో) ఇలాంటి పేదవాళ్ళు ఎందరులేరు, ఈలోకంలో!

డాక్టర్ : ఏమంటున్నారు?

సుంద : (అదేగొంతుతో) ఆగొల్లకి ఇక పిల్లలేపుట్టకపోతే—దరిద్రంతో మాడి చచ్చేవాళ్ళు ఇక తగ్గిపోతారు లోకంలో....

## రెండో రంగం

డాక్టర్ ; (మంటగా) ఈ విషయంలో ఇక వాదించుకోటం అనవసరం !

సుంద ; (తీవ్రంగా) మీ సలహాలు నాకేమీ అవసరంలేదు. నేనేమీ వినదల్చుకోలేదు.

డాక్టర్ : నాసలహా విననందుకు ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్న వ్యక్తి ఇక్కడేఉన్నాడు.

రాఘు ; భగవాన్ !

సుంద : (ఇంకా ఉద్రేకంతో) నాకేమీ లెక్కలేదు. ఇక్కడా పరలోకంలోనూ నన్ను ఇందుకే శిక్షిస్తే, నాకేమీ లెక్కలేదు. ఇదొక నేరమైతే — ఇదొక పాపమైతే ఎలాటివైనా ఆబాధ్యతలన్నీ నేనే భరిస్తాను. రాసు—మా పాపాయిని బతికించుకో దానికి నా ఆత్మనైనా వంచించుకొంటాను. పాపాత్ములంటే నరకం అనినారు తెలుసు. ఐనా భగవంతుడు నన్ను విచారించి, శిక్ష వేస్తాడా — అన్నిటికీ సిద్ధం....

డాక్టర్ ; ఆ బాధ్యతలు మీరు వహించటం నేనొప్పుకోను. మీరలా చెయ్యటంలో నా అంగీకారం మీకవసరం. కాని ఒప్పుకోను....

సుంద : ఐతే ఏమంటారు ?

డాక్టర్ ; ఆగొల్లతో మాట్లాడి వివరాలన్నీ ఇస్తాను.

సుంద : ఏమిటి ? మీరు—ఒక డాక్టరు—అతిగుప్తంగా ఒక కుటుంబ రహస్యం మీతో చెపితే, ద్రోహం తలపెడతారా ? ఐనా ఇలాంటి రహస్యాలు !

డాక్టర్ : ఇది ద్రోహమే అయితే న్యాయంనన్ను ఒత్తిడి చేసిందంటాను.

సుంద : న్యాయం ! మా కుటుంబరహస్యాలు మీరు కాపాడ తారనుకొన్నాను.

డాక్టర్ : ( 'రిపోర్ట్సు' తిరగవేస్తూ ) బొంబేకోర్టులో ఇచ్చిన ఒక తీర్పువినండి ! మీకు తప్పక చదివి వినిపించాలి. (చదువుతూ) ఒక డాక్టర్ తనకు తెలిసుండీ, సిఫిలిటిక్ పిల్లకు పాలియ్యటంవల్ల వచ్చేప్రమాదం ఒకనర్సుకి చెప్పకుండా ఉన్నందుకు— ఆమెకు వచ్చిన దుష్ఫలితాలకు అతనేబాధ్యుడు. చూశారా ! మీకూ, మీమనస్సాక్షికీ కూడా వ్యతిరేకంగాఉంది న్యాయం. ఇలాంటి నేరం చెయ్యడానికి మీదాదల ప్రోద్బలంతో తొందరపడటం నేనొప్పుకోను. నీసాపాలే పట్టడానికి మీరు ఒప్పుకోకపోతే గొల్లతో అంతాచెప్పేసి మీకేసే వొదులు కుంటాను.

సుంద : ఎంత బెదిరిస్తున్నారుమమ్మల్ని ! మీవిజ్ఞానం మీకిచ్చేశక్తివల్లనా? మీ అవసరం మాకెంతుందో మీకు తెలుసు. మీరిలా వదలివెళ్ళిపోతే బహుశా పాపాయి చచ్చిపోవచ్చు; మీరుచెప్పేదంతా వొప్పుకొన్నప్పటికీ ఎలాగూ చచ్చిపోతుంది (కోపంగా) భగవాన్ ! నన్ను నేనెందుకు అర్పించుకోలేను? నా ఈ ముసలిరోలు ఆగొల్లదాని పడుచు శరీరంలా మారితే—నాకు పాలిచ్చే శక్తేవస్తే ఈ వ్యాధికి ఎంత ఆనందంగా గురైపోదునో! ఈవ్యాధి నా ంటుకొని ఆ దారుణఫలితాలు ఎంత ఆనందంతో అనుభవించ గలిగేదాన్నో! మూ లేకుండా, పశ్చాత్తాపపడకుండా నాజీవితాన్ని అర్పించి—పాపాయినిమ గల్గితే—

రాఘ : (తల్లినిగట్టిగాపట్టుకొని పెద్దపెట్టున ఏడుస్తూ) అమ్మా! అమ్మా! అమ్మా!

[ఇద్దరూ ఏడుస్తారు]

డాక్టర్ : (చలించి) పాపం! దురదృష్ట వంతులు!

సుంద : (ఎంతోఓర్పుతో కూర్చుని) చెప్పండి ఏంచెయ్యాలో...

డాక్టర్ : ఈ గొల్లదాన్ని ఇక్కడే ఉండనీయండి—పరిచర్యలు చేస్తుంటుంది. ఇతరచోట్లకు ఈ వ్యాధిని తీసుకుపోవటం ఇంక కుదరదు. సీసాతోనే పాలుపడుతూ ఉందాం. ఈ మార్పువల్ల వచ్చే ప్రమాదం ఏమీలేదు. ఈ రోజుల్లో చాలా కొత్తపద్ధతులున్నాయ్. ట్రీట్‌మెంట్ విషయంలో అన్నిఏర్పాట్లూ చేస్తాను. శక్తివంచనలేకుండ ప్రయత్నించి సాధిస్తానని హామీఇస్తాను. రేపు మళ్ళీ కలుసుకొందాం-నమస్కారం.

సుంద : (కదలకుండానే) నమస్కారం!

రాఘ : (తలుపువరకూ వెళ్ళి డాక్టర్‌తో కరస్పర్శచేసి) థాంక్యూ! థాంక్యూ!

[డాక్టర్ వెళ్ళిపోతాడు. రాఘవేంద్రంవచ్చి, చేతులుచాపి తల్లిదగ్గరకు వెళుతూ] అమ్మా!

సుంద : (అసహ్యంతో) నన్ను వొంటరిగా ఉండనియ్యి.

రాఘ : (తననితాను సంబాళించుకొంటూ) ఒకర్నొకరం అసహ్యించుకోవడానే అనుభవిస్తోంది చాలకా ?

సుంద : తండ్రిచేసిన పాపాలకు కూతుర్ని పరీక్షిస్తున్నాడు భగవంతుడు.

రాఘ : ఇంత నీచత్వానికి పాల్పడిన క్రూరుడే ఇక్కడుండగా....

[తిరిగీ గొల్ల ప్రవేశిస్తుంది]

గొల్ల : ఇంతసేపూ ఆలోచిస్తున్నా నమ్మగారూ! ఇంక వెంటనే వెళ్ళిపోవాలని....

సుంద : ఏమంటున్నావ్? మమ్మల్నివదలి వెళ్ళిపోతావా?

గొల్ల : ఔను, అమ్మగారూ!

రాఘ : పది నిమిషాలక్రితం వెళ్ళనన్నావ్? (నిశ్శబ్దం)

సుంద : ఏమయింది గొల్లా? (నిశ్శబ్దం)

గొల్ల : ఆలోచిస్తున్నాను....

సుంద : ఆలోచిస్తున్నావా? ఏమని? [నిశ్శబ్దం]

గొల్ల : మాఆయనా, పిల్లాడూ జ్ఞాపకం వచ్చారు....

రాఘ : పదినిమిషాల వెనక.... అదికాదు, ఏదో ఐఉంటుంది.

సుంద : తప్పకుండా ఏదో ఐఉండాలి.

గొల్ల : లేదండీ అమ్మగారూ!

సుంద : కాదు—ఏదో ఉంటుంది. [చాలాసేపు నిశ్శబ్దం]

గొల్ల : ఈడుండిరిసీళ్ళు నాకు పడవేమోనని భయంగాఉంది అమ్మగారూ!

సుంద : వచ్చి ఒక్కరోజుకూడా కాలేదే---ఎలాచెప్పగలవ్ ?

గొల్ల : వెంటనే ఇంటికి వెళ్ళిపోవాలి అమ్మగారూ ;
సుంద ; ఆఖరికి—ఎందుకో చెప్పుపోనీ !
గొల్ల : మీకు చెప్పానుకదూ—ఆలోచిస్తున్నానని....
సుంద : ఏమని ఆలోచిస్తున్నావ్? [నిశ్శబ్దం]
గొల్ల : ఆలోచిస్తున్నాను....
సుంద : ఎప్పుడూ అదేవాగకు—'ఆలోచిస్తున్నాను — ఆలోచిస్తున్నాను' ఏమిటి ఆలోచించేది?
గొల్ల : అన్నిటి గురించీనీ....
సుంద : దేనినిగురించో సరిగాచెప్పలేవూ ?
గొల్ల : మీకు చెప్పానుకదూ—అన్నిటి గురించీనని....
సుంద : పిచ్చిముండ !
రాఘ : (తల్లికి ముందుగావచ్చి) నన్ను మాటలాడనీ....
గొల్ల : పల్లెటూరి పేదవాళ్ళం—నాకు తెలుసులెండి !
రాఘ ; గొల్లా, వినుముందు! నీజీతంతో నీవు తృప్తిపడ్డమేకాకుండా, నిన్ను పొమ్మంటామేమోననికూడా ముందు భయపడ్డావ్, ఔనా? జీతంకాకుండా నీవు వెళ్ళిపోయేటపుడు వెయ్యిరూపాయి లిస్తామని వాగ్దానం చేశాం. కాని ఇప్పుదేమిటి? వెంటనేవెళ్ళిపోవాలంటావ్? చెప్పు, ఏదోకారణం ఉండితీరాలి. నిన్నెవ రేమన్నారు?
గొల్ల : లేదు బాబూ !
రాఘ ; ఐతేమరి ఇప్పుదేమొచ్చింది ? [నిశ్శబ్దం]
గొల్ల : ఆలోచిస్తున్నాను బాబూ !
రాఘ ; (కోపంతో మండిపోతూ) మాటిమాటికీ అదే వల్లించకు, ఏమిటినీవుద్దేశం ? (మెల్లిగా) రా, చెప్పు—ఎందుకు వెళ్ళిపోవాలనుకొంటున్నావ్? [నిశ్శబ్దం] చెప్పూ!
గొల్ల : మీకు చెప్పాను....
రాఘ : నీతో మాట్లాడేకంటే గోడతో మాటలాడినా నయమే....
సుంద : మమ్మల్ని వదలివెళ్ళడానికి నీకు హక్కులేదంటాను.
గొల్ల : ఔనులెండి—వెళ్ళిపోవాలను కొంటున్నాను.
సుంద : వెళ్ళడానికి వీల్లేదు.
రాఘ : వెళ్ళిపోనిద్దూ—దాన్ని బలవంతంగా ఆపగలమేమిటి? (గొల్లతో) వెళ్ళిపోవాలనుకొంటున్నావు కాబట్టి—వెళ్ళు. కాని నీవు వట్టి ఖంఠవనిమాత్రం చెపుతున్నాను.
గొల్ల : ఫరవాలేదు లెండి!
రాఘ ; ఈనెలకు నీకు జీతంరాదు. రైలుటిక్కెట్టు నువ్వేకొనుక్కో !
గొల్ల ; చూద్దాంలెండి !

రాఘు : ఔను, చూస్తువుగానిలే! ముందు బైటకునడు. ఒక్కనిమిషంకూడా ఉండటానికి వీల్లేదు. పో!

సుంద : నీకు మతిపోయిందేమిటి రఘూ! (గొల్లతో) నిజంగా అంటున్నావా గొల్లా?

గొల్ల : ఔను. వెంటనేవెళ్ళిపోవాలి—ఆ వెయ్యిరూపాయిలూ ముందిచ్చెయ్యండి!

రాఘు : ఏమిటీ!

సుంద : ఏమిటి నీవంటున్నది?

రాఘు : వెయ్యిరూపాయలా?

సుంద : ఏమిటీ! వెయ్యిరూపాయలు!

గొల్ల : మీరిస్తానన్న వెయ్యిరూపాయిలున్నూ

రాఘు : అలా ఏమీ ఇస్తామని చెప్పలేదు.

గొల్ల : ఔను—ఇస్తానన్నారు.

సుంద : పాపాయికి పాలివ్వటం పూర్తయ్యాక....మాకు తృప్తికరంగా ఉంటే....

గొల్ల : నేను వెళ్లిపోయేప్పుడు వెయ్యిరూపాయలూ ఇస్తానని చెప్పలేదూ? నేనిపుడే వెళ్ళిపోతున్నాను—ఆ డబ్బు ఇచ్చేయండి!

సుంద : కొంచెం జాగ్రత్తగా మాట్లాడు....

గొల్ల : ఆ వెయ్యిరూపాయిలూ ఇచ్చేస్తే—ఒక్క మాటగూడా మాటలాడను.

రాఘు : ఓహో! అలాగా!నీపనిలోంచి యిపుడే తీసివేస్తున్నాను. ముందు నడు అవతలికి....

సుంద : అంతేఅవాలి....

రాఘు : ఊఁ, పో, అవతలకి....

గొల్ల : నాడబ్బు ఇలాపారెయ్యండి....

రాఘు : (కోపంగా తలుపువైపు చూపిస్తూ) వింటున్నావా? తన్ని అవతలికి ఈడ్చేసేలోపున పోతావా లేదా? దొంగముండా!

గొల్ల : (చప్ప తేలవేసి) ఏమన్నావ్? ఎంతపొగరొచ్చిందినీకు?

రాఘు : బైటకుపోతావా లేక పోలీసుకు 'ఫోను' చెయ్యనా?

గొల్ల : పోలీసా? ఎందుకు?

రాఘు : నిన్ను బైటకు ఈడ్చెయ్యటానికి....నీ....సీ....

గొల్ల : ఔను—నేనెవర్ని? పల్లెటూరిదాన్ని. నాకు బుర్ర లేకపోవచ్చు.

సుంద : ఔను—బుర్ర లేదునీకు. ఇంతకంటే....

గొల్ల : (అడ్డువచ్చి) నాకు బుద్ధిలేకపోవచ్చు. కాని నేను....

సుంద : రాయిఃన్నా ఉంటుందికాని నీకు గుండెల్లేవు పాపిష్టిముండా!

రాఘు : ఏదో అనుకొన్నాం—పచ్చి దొంగలం....

# రెండో రంగం

గొల్ల : దొంగా ! నేను? ఎందుకు ?

రాఘ : ఇంకొకరి డబ్బు పట్టుకుపోవాలని చూస్తున్నావ్ కాబట్టి.

సుంద : మా పాపాయిని వదలి వెళ్ళిపోతున్నావ్ కాబట్టి-ఎంత పాపిష్ఠురాలివే

రాఘ : బైటకు ఈడ్చేయ్య మంటావా.... (చెయ్యిపట్టుకు లాగబోతాడు)

గొల్ల : అలాగా! ఐతే- నేనెందుకు వెళ్ళిపోతున్నానో వినాలని ఉందా?

రాఘ : ఇప్పుడైనా చెప్పు!

సుంద : ఎందుకేమిటి గొల్లా?

(కనకవల్లి వెనకనుంచి వొస్తుంది. ఆగోలలో ఎవరూ చూడరు)

గొల్ల : మీ ఛండాలపు జబ్బునాకు తగిలించుకోటం ఇష్టంలేక వెళ్ళిపోతున్నాను.

సుంద : ఊరుకుంటావా లేదా?

రాఘ : నోరు మూస్తావా లేదా?

గొల్ల : అంత భయపడక్కర్లేదు మీరు. ఇక్కడ అందరికీ తెలుసు. రాముడు డాక్టర్‌గారు చెప్పిందంతా విన్నాడు తలుపు దగ్గర్నుంచి. నాతో అంతా చెప్పాడు. నాకు బుర్ర లేకపోవచ్చు. కాని మీరనుకొన్నంత తెలివి లేకపోలేదండోయ్! నాకిబ్బు వెంటనే పారేస్తే-ఒక్కక్షణంకూడా ఉండనిక్కడ!

రాఘ ; నోర్ముయ్ !

సుంద : (చేత్తో గొల్లవాసిరెక్క పట్టుకొని) నోరు మూస్తావాలేదా?


గొల్ల : నన్ను వెళ్ళనియ్యండి—నన్ను పోనియ్యండి. ఏ వీధిమురుకిదగ్గరో వాళ్ళనాన్న అంటించుకువచ్చిన ఈదుష్ట జబ్బుతో మీ పాప కుళ్ళిపోయిందని నాకు తెలీదా? మీ పాప బతుకుతుందనుకోకండి.

కనక : (కీచుమని) ఆఁ !

రాఘ : (విసురుగా ఆమెవైపువెళ్ళి) భగవాన్ - కనకవల్లి! (రాఘవేంద్రాన్ని తప్పించు కొంటుంది కనకవల్లి. ముఖంలో అసహ్యం, చికాకు, భయం ఆవహించాయి)

కనకవల్లి : (పిచ్చిదానిలా అరుస్తూ) నన్ను ముట్టుకోవొద్దు. ముట్టుకోకు

( తెర )



## మూడోరంగం

దృశ్యం : మొదటిరంగంలాగే ! డాక్టర్ సలహాగది.

(డాక్టర్, మెడికల్ స్టూడెంటుతో ప్రవేశం)

డాక్టర్ : ఇందాక మనకు కన్పించిన పెద్దమనిషి వెయిటింగ్ రూమ్‌లో ఇంకా ఉన్నారేమో చూశావా ?

మె : స్టూడెంట్ : మీకోసమే అనుకొంటాను.

డాక్టర్ : హెల్తుమినిష్టరు గారనుకొంటాను, వారి పేరేమిటో నీకుతెలుసా ? రోజుకో మంత్రివర్గం మారిపోతోంది. ప్రజల కందుబాట్లోలేని మంత్రులపేర్లు ఎలాజ్ఞాపకం ఉంటాయిలే ! ఆయనకార్డు ఎక్కడపెట్టాను? (టేబిల్‌మీద చూస్తాడు) ఇదిగో— 'పి. వెంకట్రామయ్య—హెల్తుమినిష్టర్'....

మె: స్టూ : ఓ, ఆయనా ! చాలా పెద్దపేరుందేదే ఆయనకు. గొప్పగా ఉపన్యసిస్తారు కూడా, కదండీ ?

డాక్టర్ : ఔను (నవ్వుతూ) పెద్దపెద్ద సంస్కరణలు చేశారు కదూమరి !

మె॥ స్టూ : (వేళాకోళంగా) ఔనౌను !

డాక్టర్ : ఇలాంటి వ్యక్తులేకావాలి మనకిపుడు. (ఎత్తిపొడుపుగా) సాంఘిక వ్యవస్థమీద ప్రశ్నలవర్షం కురిపిస్తారనుకొంటాను.

మె: స్టూ : అంతే అయ్యుండాలి.

డాక్టర్ : మనం ఇంతకాలం గొంతులు చించుకొని అరుస్తున్న ఈ మెడికల్ డిమాండ్ల విషయాలకు 'ఛేంబర్'లో పెద్ద అలజడి లేచిందని కదలి వచ్చారనుకొంటాను.

ముందుగానే వారికి కావలసిన సాధన సంపత్తి సేకరించాలను కొంటున్నారు. ఏమైనా సలహాకి మాత్రంకాదు.

మె: స్టూ : మీరన్నట్టే జరుగుతుంది. ఒంపరిగానే వచ్చారు—ఆసిబ్బందీ ఖద్దరు టోపీలూ అవేమీ లేవే వెనక !

డాక్టర్ : మినిష్టర్‌గారే స్వయంగా దయచేశారు కాబట్టి, గుండెపు నాటుకొనేలా చెప్తాను. నీవిందాక చూచిన రోగులను వారికి చూపించడానికే రమ్మన్నాను ఇక్కడికి.

మె॥ స్టూ : నాఅవసరం ఏమైనా ఉంటుందాండీ ?

డాక్టర్ : లేదు—కాని శ్రీ వెంకట్రామయ్యగార్ని ఇలా లోపలికి దయచెయ్యమని చెపుతావా ?

మె : స్టూ : యస్, సార్ !

(మెడికల్ స్టూడెంట్ వెంకట్రామయ్యగారికి ముందు దారి చూపిస్తుంటాడు. వెంకట్రామయ్యగారు ప్రవేశం. వయసు నలభై ఎనిమిది. ఖద్దరు-విశ్వపంచెకట్టు, లాల్చీ, ఖండువా, టోపీ, చేతిబెత్తం, నల్లద్దాల కళ్లజోడు, డాక్టర్ నమస్కారంచేస్తాడు. వెంకట్రామయ్యగారు ఠీవిగా కూర్చుంటారు.)

గౌ. వెంక : డాక్టర్ ! మీ'రెగ్యులర్ అవర్స్'లో కాకుండా నాకిలాటి అవకాశం కల్పించినందుకు సంతోషం. నేనిక్కడికి వచ్చినపని చాలా దుఃఖభాజనమైంది. రాఘవేంద్రం మాఅల్లుడు. నిన్న జరిగిన గొడవతరువాత మా అమ్మాయి తన పాపాయితో సహా ఇంటికి వచ్చేసింది. ఆపాపాయిని మా ఇంటిదగ్గరే చూస్తూ ఉండమని చెప్పటానికే వచ్చాను.

డాక్టర్ : అలాగేనండి !

గౌ. వెంక : థాంక్స్ ! ఇంక - ఈ దురదృష్టానికంతటికీ కారణమైన ఆనీచుడి సంగతి....

డాక్టర్ : (మెల్లిగా) క్షమించండి ! ఆవిషయం తమతో చర్చించలేను. నేను డాక్టర్ని మాత్రమే !

గౌ. వెంక ; (బరువు గొంతుతో) కాని నేను చెప్పేదికూడా కొంచెంవింటే- మీరే ఏకీభవిస్తారు నాతో ! నిన్నజరిగిందంతా మీకు తెలుసుగా ! ముందువాణ్ని తీవ్రంగా శిక్షిద్దామనుకున్నాను. ఆవిషయాలతో మిమ్మల్ని చికాకు పెట్టదలచుకో లేదనుకోండి ! నిజానికి కోపం అణుచుకోలేక పోతున్నాను. కసి తీర్చుకోవాలని ఉంది; కాని సహనం వీడకూడదని గాంధీగారు చెప్పారుకదా ! అందుకనే మళ్ళీ నిశ్చయించుకున్నాను. మీతో తాపీగా మనవిచేద్దామనే వచ్చాను. కాని ఆ రాక్షసుణ్నిగురించీ, వాడి దౌర్జన్యాన్నిగురించీ - నామీదా నాకూతురుమీదా పశుత్వంతో, పిరికితనంతో వాడు ప్రయోగించిన ఆయుధాన్నిగురించీ తలుచుకుంటే ఆపుకోలేక పోతున్నాను. డాక్టర్! ఎంత ఘోరం ! నాకూతుర్ని ఇరవైరెండేళ్లదాన్ని ...ఇరవైరెండేళ్లు!....క్షమించాలిడాక్టర్- ఆపుకోలేక పోతున్నాను. (నిశ్శబ్దం)

డాక్టర్ : తమభావాలని గౌరవదృష్టితో చూస్తున్నాను. కాని ఏ నిర్ణయానికి రావడానికైనా మీరు స్థిమితంగాలేరు.

గౌ. వెంక : (ప్రయత్నంగా) ఔనౌను. 'కంట్రోల్' చేసుకొంటాలెండి. రాత్రంతా ఏం చేద్దామా అని ఆలోచిస్తునే ఉన్నాను. వాడిమీద పగసాధించటంవల్ల ప్రయోజనం లేదని గ్రహించాను; ఆఖరికి నేనూ, మా కనకవల్లీ ఒకేనిర్ణయానికి వొచ్చాం — వెంటనే విడాకులు ఇచ్చుకొంటే వొదిలిపోతుందని. అందుకేమీవద్దకు వచ్చిందిపుడు. ఒక 'సర్టిఫికెట్' ఇమ్మని అడగడానికి—

డాక్టర్ : ఏం సర్టిఫికేట్ ?

గౌ॥ వెంక: వీడు అంటించిన ఆజబ్బుయొక్క 'నేచర్' అంతా రుజువుచేస్తున్న 'సర్టిఫికెట్'

డాక్టర్ : అలాంటి 'సర్టిఫికెట్' నేనేమాత్రమూ ఇవ్వలేనని—క్షమించమని—

గౌ॥ వెంక : ఏం, ఎంచేత ?

డాక్టర్ ; నావృత్తిధర్మం. నాకుంటే నియమాల్ని వొదులుకోలేను.

గౌ॥ వెంక ; అమాయకురాలైన దౌర్భాగ్యురాలకు వ్యతిరేకంగా ఒక నేరస్థుని తరఫున మీరు మాట్లాడటం మీకు ధర్మంకాదను కొంటాను.

డాక్టర్ : ఏమైనా—అలాచెయ్యడానికి నాకు స్వాతంత్ర్యమున్నా—మీరడిగినట్టు నేనే మాత్రమూ చెయ్యలేను.

గౌ॥ వెంక : ఎందుకో అడగవచ్చా ?

డాక్టర్ : ఈ విడాకులు పుచ్చుకోడానికి మీకెలాంటి సహాయమూ చెయ్యొద్దని నా అంతరాత్మ చెబుతోంది.

గౌ॥ వెంక : ఏదోఒక సిద్ధాంతంవల్లనో ,ఇలాంటి కష్టాలుచూచి చూచి మీవృత్తి మీహృదయాన్నొక రాయిచేసి వేయటం వల్లనేమో—ఈ నీచుడిపేర తన జీవితాంతంపరకూ నాకూతురు కుళ్లికుళ్లి చావవలసిందేనని మీరు భావిస్తున్నారనుకుంటాను.

డాక్టర్ : మీ అమ్మాయి భవిష్యత్తు ఆలోచించే నేను ఇవ్వనంటున్నాను.

గౌ॥ వెంక : నిజం? ఐతేమీకు మాఅమ్మాయి విషయంలో విపరీతమైన అభిప్రాయా లున్నాయన్నమాట ?

డాక్టర్ : (మెల్లిగా) ఉద్రేకంచెందిన మీప్రస్తుత మనస్థితిలో ఏదేదో అనేస్తున్నారు నన్ను. నాఅంత అనుభవం ఉన్నవాడిని ఇల్లాంటివేమీ కలతపెట్టలేవు. ఈ వాదనలో ఎందుకు దిగదలచు కోలేదో ఇప్పటికైనామీకు అర్థమై ఉంటుంది. ప్రస్తావన వచ్చింది కాబట్టి—నాపరిస్థితి మీకు వివరిస్తున్నాను. మీఅల్లుడు 'సిఫిలిస్' అంటించుకొన్నాడని రుజువు చెయ్యటానికి కోర్టులో నన్ను సాక్ష్యం యిమ్మంటున్నారు. అవునా ?

గౌ॥ వెంక : ఔను.

డాక్టర్ :అలాచేస్తే—మీఅమ్మాయికి కూడా ఆజబ్బు అంటుకొందని బహిరంగంగా ఒప్పుకొంటున్నారనే విషయం మర్చిపోతున్నారనేకదా చెప్పాలి? కోర్టురికార్డులో ఈ

యదార్థాలన్నీ రాతపూర్వకంగా వుంటాయికదా? ఆ తరువాత ఆమెకు మళ్లీ భర్త దొరకు తాడని నమ్మకం ఉందా ?

గౌ॥ వెంక : మళ్ళి ఆమె పెళ్ళిచేసుకోదు.

డాక్టర్ : ఇపుడలానే అంటారు. ఇంకో ఐదు సంవత్సరాల తర్వాత అలానే ఆమె అంటుందని నిర్ధారణగా చెప్పగలరా? ఏమైనా—నేను సాక్ష్యం చెప్పనుకాబట్టి విడాకులు ఇచ్చుకోటం అసాధ్యం.

గౌ. వెంక : ఐతే ఇంకో విధంగా ఏర్పాటు చేసుకొంటాను. పాపాయిని వేరే డాక్టరు చేత పరీక్ష చేయిస్తాను.

డాక్టర్: అలానా? జీవితారంభంలోనే ఆపాప దురదృష్ట వంతురాలుగా పుట్టిందని మీకుతెలీదా? శారీరకంగా పాడైపోయిందే కాకుండా పుట్టుకతోనే సిఫ్లిస్ ఉందనే కోర్టుముద్రితో ఆమెజీవితాన్ని కళంకిం చెయ్యాలని చూస్తున్నారా? మీరు మీకూతుర్ని కాపాడుకోవటం కోసం, ఆమెకూతుర్ని హత్యచేస్తారా? అదిమీజీవితాన్ని మీరేహత్యచేసుకొన్నట్టుకాదా?

గౌ. వెంక : ఐతే ఈధర్మ చట్టాలనుబట్టి పతితుల్ని ఉద్ధరించటమంటే వాళ్లనిమరింతలోతుగా పాతెయ్యటమేనా ? ఈ దేశంలో ఏం న్యాయముంది ? అమాయికురాలు— విధేయురాలు—నిండుయౌవ్వనంలోఉన్న ఆమెను, తననీచమైన వ్యభిచారంతో ఆమె జీవితంలో పెద్దమచ్చ వేశాడు వీడు. నిర్భాగ్యురాలైన ఒక పసికూనకు తల్లిగా చేశాడు ఆమెను. కాని అతనికివ్యతిరేకంగా ఎలాంటి 'డిఫెన్సు' నూ చూపించవు ఈ న్యాయ చట్టాలు. తన భార్యకు దారుణమైన నీచత్వాన్ని ఆపాదించాడు. ఒక వ్యభిచారిణి దౌష్ట్యంతో కలుషితం అయ్యాడు. దాని కుళ్ళుజబ్బులు తన భార్యకూ అంటించాడు. తన భార్యకూ—అనీచమైన వ్యక్తికీమధ్య ఒక రక్తసంబంధాన్ని కల్పించి-భార్యకూ పిల్లకూ ఆ విషాన్ని ఎక్కించాడు. ఈ వ్యభిచారిణి మాజీవిత ఛాయల్లోనే బతుకుతూ మాకుటుంబంలో ఒక వ్యక్తి అయింది. నా కూతురుశరీరాన్ని కలుషితం చెయ్యడమే కాకుండా, ఆమెహృదయాన్నికూడా మలినంచేశాడు పాపాత్ముడు. జీవితాంతంవరకూ ఆదర్శ ప్రేమ అనే ఆశయాల ఔన్నత్యాలతో ఆమె మనస్సును కట్టివేశాడు. ఈ పాపను కని, కనకవల్లి శరీరాన్ని గాయంచేశాడు, ఆమె గౌరవాన్నీ, ప్రేమనీ దోచుకొన్నాడు, దారుణమైన అవమానానికి ఆమెని గురిచేశాడు. ఆస్త్రీ అలాంటిభర్తనుండి వేరుకావటం ప్రజలదృష్టిలో విరుద్ధం! న్యాయచట్టాలకు వ్యతిరేకం! తల్లీపిల్లల జీవితాలను దగ్ధంచేసి ఆపనిందను భరించగల ధైర్యంవుంటే—పోనియ్యండి! న్యాయంఎవడిక్కావాలి! రాత్రి ఆవెధవని ఎందుకు 'షూట్' చెయ్యకూడదా అనుకొన్నాను. ధైర్యం చాల్లేదు. కోర్టునాకు న్యాయం చెప్పదా? ఫరవాలేదు—నే నే న్యాయం జరుపుతాను. ఆఖరికి వీడి చావు ఇతరయువకుల కైనా కొంతబుద్ధి చెప్పగలుగుతుంది.

డాక్టర్ : మీ మీదకోర్టులో....

గా. వెంక : భయంలేదు—నిర్దోషినని విడుదల చేస్తారు....

డాక్టర్ : కావొచ్చు: కాని మీఇబ్బందులన్నీ ప్రజలకు తెలిసిపోతాయ్. ఎంతఅపఖ్యాతి,ఎంత అవమానం భరించాలో ఊహించారా? మీవిడుదలతరువాత మళ్ళీ ఇంకోకోర్టులో నిర్దయుడైన ఇంకోన్యాయాధికారి ముందునిలుచోవలసివస్తే? మీ అమ్మాయిఅపుడు పశ్చాత్తాపపడి—మీరామె జీవితాన్ని దగ్ధంచేశారనే నిర్ణయానికేవస్తే? అపుడు అడగదా?—నాభర్తని ఖూనీచెయ్యటానికి నీకేంహక్కుందని? ఏంచెపుతారపుడు? ఆమెపాపాయికూడా తనతండ్రిని ఎందుకుచంపావని నిలదీసి ప్రశ్నిస్తే మీరేం సమాధానం చెప్తారు?

గా. వెంక : (డాక్టర్ మాట్లాడకముందే) ఔను—అపుడేంచెయ్యను?

డాక్టర్ : (చప్పున) అతన్ని క్షమించండి!

[నిశ్శబ్దం]

గా. వెంక : (నీరసంగా) వీల్లేదండీ!

డాక్టర్ : ఇలాంటివిసంగా ప్రవర్తించటం న్యాయమని తోస్తోందా మీకు? ఈ దుఃఖాన్నుంచి మీఅమ్మాయిని కాపాడ్డం అంతా మీచేతుల్లోనే ఉన్నప్పుడేంచేశారు?

గా. వెంక: నాచేతుల్లోనా? దీనికంతకీ నేనేబాధ్యుణ్ణని అంటున్నారా?

డాక్టర్ : ఔను—అంటున్నాను....పెళ్ళిప్రయత్నాలు జరిగేప్పుడు మీకుకాబోయే అల్లుడి ఆదాయం ఎంతవస్తోందాఅని వాకబు చేసే ఉంటారు. స్థిరాస్థి ఎంతుందో తెలుసుకొన్నారు. ఆ ఆస్థిమీద తనకాలేవీ లేవుకదాఅని రహస్యంగా సమాచారం సేకరించారు. చదువుసంధ్యల గురించి అడిగేరు. 'టెన్నిస్ ఆడుతున్నావానాయనా?' అని ప్రశ్నించారు. బహుశా 'అపుడప్పుడు ఇద్దరు కడుతున్నావా?' అనికూడా అడిగి ఉంటారు. అతని గుణగణాలన్నీచూచి తృప్తిపడ్డారు. కాని ఒకముఖ్య విషయంమాత్రం వొదిలేశారు. అతని ఆరోగ్యవిషయం ఏమైనా వాకబుచేశారా?

గా. వెంక : లేదు.

డాక్టర్ : ఎంచేత?

గా. వెంక : అలాఎవ్వరూ ఎపుడూ చెయ్యరుకాబట్టి.

డాక్టర్ : ఒక్కరిమనసులోనూ స్పష్టమైన అభిప్రాయాలు లేవు. లోకమంతటితోపాటు మేమూను అంటారు. స్వతంత్రింగా యోచించే శక్తిలేదు. కాని—తప్పకుండా ఆరోగ్యవిషయంముందుగా విచారించాలికదా? ఆరోగ్యశాఖామంత్రిలు, తమకైనా తెలీదా?

గా. వెంక : నిజం డాక్టర్! ఒక చట్టం పాస్ చేయిస్తాను.

డాక్టర్ : చాలు, చాలు! కొత్త చట్టాలేమీ మన కవసరంలేదు. ఇప్పటికే చాలా ఉన్నాయ్. అవ్యాధి యొక్క స్వభావమంతా ప్రజలందరికీ తెలియచెయ్యాలి. ఒక యువకుడు

ఒక యువతిని పెళ్ళి చేసుకోమని అడిగినపుడు—అతను సంపూర్ణ ఆరోగ్యంలో ఉన్నానని ఒకసర్టిఫికెట్, ఆమెకు చూపించాలని ప్రతియువకుడూ గ్రహించాలి; తను పెళ్ళిచేసుకొంటున్న ఆకుటుంబంలోకి ఈ దారుణమైన వ్యాధిని తీసుకురానని హామీ ఇవ్వాలి. పెళ్ళిళ్ళు నిశ్చయమైనపుడు కట్నాల గురించీ, ఇచ్చిపుచ్చుకోటాల గురించీ పెద్దలంతా చేరటంలేదా? కానిఇపుడు—ఆరెండు కుటుంబాలడాక్టర్లూ కలుసుకొని విషయాలన్నీ మాట్లాడుకొంటే ఇలాంటి ఆపదలు ఇకముందు రాకుండా తప్పిపోతాయ్కదా? మీ విచారణ అసంపూర్ణమైంది. చూడండీ! మగవారు—పిల్లల్నిగన్న తండ్రి మీరు ఇలాంటివన్నీ ముందుగానే తెలుసుకొని ఉండాలి. ఆమె ఆరోగ్య విషయంలో—ఆమె భవిష్యత్తు కంటే—సరియైన జాగ్రత్త ఎందుకు తీసుకోలేదా అని అడగదా మీ అమ్మాయి? (ఆగి) కాబట్టి మనస్ఫూర్తిగా అతన్ని క్షమించమంటున్నాను.

గౌ. వెంక: వీల్లేదు, డాక్టర్!

డాక్టర్: ఐతే చివరిమాట అంటున్నాను—మరోకలా అనుకోవద్దు. మీరే పాపాలూ చెయ్యలేదంటారా—అంత నిర్దయగా మాట్లాడతారు?

గౌ. వెంక: ఇలాంటి కుళ్ళు జబ్బులు నేనెప్పుడూ అంటించుకోలేదు.

డాక్టర్: అదికాదు నేనడిగేది—ఈవ్యాధి అంటించుకొనే ప్రమాదంలోకి మీ రెప్పుడూ దూకనేలేదా అని!

[డాక్టర్ ఆగాడు. వెంకటాప్రమయ్య మాట్టాడరు]

చూడండి! అక్కడ పవిత్రత కాదు మిమ్మల్ని రక్షించింది-మీఅదృష్టం! 'కుళ్లు జబ్బు' లని అన్నారే—ఆమాట వింటూంటే నాకు ఉద్రేకం హెచ్చుతోంది. అన్ని వ్యాధుల్లాటిదే ఇదీని. మనకున్న దురదృష్టాల్లో ఇదొకటి. దౌర్భాగ్యు డైనంత మాత్రాన అవమానం ఏమీ లేదు—'డిజర్వ్' ఐనప్పటికీ

(ఘాటుగా) కొంచెం విడమర్చి మాట్లాడుకొందాం. ఈపవిత్రులంతా వాళ్ళనంగనాచితనంతో మడిగట్టుకొంటారు. వాళ్ళలో ప్రతిఒక్కడూ 'సిఫ్లిస్' అనేమాట ఉచ్చరించడానికే అదిరిపోతాడు. అవమానంవస్తుందంటే లెక్కచెయ్యనివాణ్ణి ఒక్కక్షణం క్షమించరువీరు. ఒకవేళ ఆమాట అనవలసివస్తే 'సుపీరియర్'గా మొఖాలుపెట్టి ఏవగించుకొంటున్నట్టు నటిస్తారు. ఈ వ్యాధికి గురైన దౌర్భాగ్యుల్ని వట్టినేరస్తులుగా పరిగణిస్తారు. అవినీతిని తిట్టడం ఒక 'ఫేషన్' ఐపోయిందిపుడు. ఈ పవిత్రులు ఆనిర్భాగ్యుల్ని చూడ్డం తటస్థిస్తే 'షాక్' తగిలినట్టు నటిస్తారు—తమ అభిరుచులు ఎంతసున్నితమైనవో చూపేందుకు వాళ్ళలో ఎంతమంది ఈ సిఫ్లిస్ అంటించుకొనే ప్రమాదంలోకి దూరలేదో తెలుసుకోవాలని ఉంది. నీతిపరుల్లా మాట్లాడ్డానికి వీరికిహక్కుంటే ఉండవచ్చు. అలాంటి పవిత్రులు ఎంతమంది ఉంటారంటారు? వెయ్యికొక నల్గురేమో! పోనీ, ఆనల్గురునీ

వాదిలేయండి / సిఫ్లిస్ అంటించుకొన్నవాళ్ళకూ—అంటించుకోనివాళ్ళకూ ఒక్కటేభేదం. ఒకరు దురదృష్టవంతులు-రెండవవారు అదృష్టవంతులూను. అంతే / (బిగ్గరగా) కళ్ళులేక పోవటం పురాకృత ఖర్మ వల్లనని వాళ్ళకు చేయూత కూడా ఇవ్వక జంకే నీచులు ఈ పవిత్రులంతా ! అదృష్టంకొద్దీ సిఫ్లిస్ అంటించుకో కుండా తప్పించుకు పోయిన వాళ్లనిచూస్తే నాకేమీ జాల్లేదు; తక్కిన దౌర్భాగ్యులు జరిమానా చెల్లించుకుంటారు. పశ్చాత్తాపాల రూపంలో, బాధలరూపంలో చెల్లించారు. (సంబాళించుకొని) ఇలాంటి మోసాన్నంతనూ ఒకసారి పాతివేద్దాం. రండి (ఆగి) మీఅల్లుడు — మీలాగే — ఈవేలకొద్దీ మనుష్యులందరిలాగే — పెళ్లికాకముందే ఈ కాముకవ్యాపారం సాగిం చాడు. అతని దురదృష్టంవల్ల సిఫ్లిస్ అంటుకొంది. ఈవ్యాధి తనకేవిధంగానూ అపాయం కాదనే అపోహతో పెళ్ళిచేసుకొన్నాడు. కాని నిజానికది శృతిమించింది. దాన్ని మరింత చెరచకుండా చక్క బెట్టుకురావటం మనబాధ్యత. బహుశా మీవయసులో ఇన్నిదారుణాలూ చేసేఉంటారు—ఫలితం అనుభవించీఉంటారు. పట్టుబడని దొంగస్థితిలాఉంచి—చాలాకాలం శిక్ష ననుభవించిన వాడికి మీరు బోధచెయ్యటం. మళ్ళీ ఒకసారి ఆలోచించండి, విషయ మంతా చక్కబడుతుంది.

గౌ. వెంక: ఇదంతా ఎలాపెట్టారంటే....

డాక్టర్: నేను చెప్పింది నిజమంటారా లేదా?

గౌ. వెంక: కావొచ్చు; కాని ఇదంతా మాఅమ్మాయితో చెప్పి భర్త దగ్గరికి తిరిగి వెళ్లమని బోధించ లేనండీ !

డాక్టర్: మీరు నచ్చజెప్ప వలసిన విషయాలు ఇంకాఉన్నయ్.

గౌ. వెంక: ఏమిటవి?

డాక్టర్: కావలసి నన్ని. ఇలా విడిపోవటం మీఅందరికీ ఒక ఘోర ప్రమాదమనిచెప్పండి. ఆ పాపను అన్ని విధాలా రక్షించటంలో మీ అల్లుడి ఇంటరెట్స్ కూడా ఉన్నాయని చెప్పండి. ప్రస్తుతం ఆమె వివాహానందం భగ్నమై ఉండొచ్చు. కాని ఆ శిథిలావస్థ లోంచి అనురాగంతో కూడిన ఒక చక్కని జీవితాన్ని మళ్ళీ నిర్మించు కోవచ్చునని, ఇతరులు ఈర్ష్యపడే ఒక అపూర్వ సంసారాన్ని మళ్ళీ సృష్టించు కోవచ్చు నని చెప్పండి ! 'పచ్చివ్యభిచారపు తుంటరుల్నికూడా సంస్కరిస్తే మంచిభర్తలు కాగల ర'నే దానిలో నిజంలేకపోలేదు. మీఅల్లుడివిషయం చూడండి ! అంతామరిచి పోడానికీ అతన్నిక్షమించడానికీ మీఅమ్మాయి ఒప్పుకొంటే—అతను ఆమెనుగౌర వించటమేకాదు, జీవితాంతంవరకూ కృతజ్ఞతతోకుంగిపోతుంటాడు. ఇవన్నీచెప్పండి. ఇంకా ఆలోచించండి / భావిసంగతి అంటారా, వీరిద్దరూ మళ్ళీకలుసుకొన్న తరు

వాత, ఆలోచిద్దాం. ఈసారి వారికి పుట్టబోయేపిల్లలు చాలాఆరోగ్యవంతంగా, దారుఢ్యంగా ఉంటారు.

గౌ. వెంక : అదిసాధ్యం ఔతుందా డాక్టర్ ?

డాక్టర్ : తప్పకుండా ! నేను మారోగులతో ఒకటే చెపుతాను; ప్రతివీధిమలుపులోనూ ఇలా 'పోష్టర్స్' అంటిస్తాను: "తనపట్టు వాదులుకొంటున్నాననే భయంవల్ల తన స్వభావాన్ని రేపుకొన్న స్త్రీ లాంటిది సిఫ్లిస్. దానికేప్రాముఖ్యతా లేదనుకొనే వారికే అది భయంకరమౌతుంది—దానిసంగతులన్నీ తెలుసుకొన్నవారికిమాత్రం కాదు." అదే మీఅమ్మాయికి చెప్పండి ! ఆమెను భర్త దగ్గరికి పంపండి—అతనివల్ల భయపడవలసిందేమీలేదు. రెండుసంవత్సరాల్లో—నేను 'గ్యారంటీ' ఇస్తున్నా, పరమానందంతో మనుమల్ని ఎత్తుకొంటారు.

గౌ. వెంక : థాంక్స్ డాక్టర్ ! నేను నిర్లక్ష్యం చేసిన బాధ్యతల విషయంలో నన్ను ఎంతో ఇబ్బందిపెట్టారు. కాని తొందరపడి ఏమీచెయ్యకుండా—నాకెంతో ఆశకూడా కల్పించారు. కొన్నాళ్ళకైనా నాచిట్టితల్లి తనభర్తను క్షమించాలనే నిర్ణయానికే వస్తే నేనేమీ అడ్డుచెప్పను.

డాక్టర్ : చాలా సంతోషం! కాని మీకు ఇంకోకూతురేఉంటే, మొదటిఆమె పెళ్ళివిషయంలో చేసినపొరపాట్లు మళ్ళీచెయ్యకుండా మాత్రం జాగ్రత్తపడండి !

గౌ. వెంక : నాకెలాతెలుస్తాయండీ అవన్నీ ?

డాక్టర్ , ఏమిటీ—మీకుతెలీదూ ? పిల్లల్నికన్నతండ్రి, మీకుతెలీదూ ? మంత్రులు ఆరోగ్యశాఖామంత్రులు — గౌరవనీయులు — బాధ్యత గలవారు — మాకందరికీ న్యాయచట్టాలు తయారు చేసేవారు—మీకుతెలీదూ ! సిఫ్లిస్‌గురించి మీకు తెలీదూ? మీమాట విడిచి పెట్టండి. మీరు అల్లాంటివారు కాకపోవచ్చు; రెండువందల మందికి తక్కువకాకుండా ఉన్నారు శాసనసభ్యులు ! ఊరికే పొట్టలు పోసుకొంటున్నాయి మంత్రివర్గాలు ! ఎవరెంత అలిసేట్టు మాట్లాడామా అనేకాని, ప్రజోపయోగమైన పనులుఎంత వరకూ చేశామా అనే ఆలోచనేలేదు. పొందూరు ఖద్దరు ఎంతసన్నంగా ఉంటుందో, స్పెన్సర్ కంపెనీ ఎత్తేయటంవల్ల ఎంతనష్టం వచ్చిందో, ఫాంటియాక్‌కారు ఎంతసున్నితంగా పరుగెడుతుందో, ఊటీలో వేసవికాలం ఎంతచల్లగా ఉంటుందో, సన్మానసభల్లోనూ, కాఫీహోటళ్ళను తెరవటంలోనూ ఏ విధంగా ఉపన్యసించాలో మాత్రంతెలుసు. కాని వాళ్ళకు సిఫ్లిస్ గురించి తెలీదూ ? ధర్మాస్పత్రిలో ఎంతధర్మం ఉంటుందో, సీసా ఒక్కంటికి ఎన్ని రంగునీళ్లు కాంపౌండర్ కలుపుతాడో, ఫలానా కేసులో డి. యం. వో. కి ఎంత ముట్టిందో, సర్టిఫికెట్ ఇవ్వడానికి గవర్నమెంట్ హాస్పటల్ డాక్టర్లు రివాజుగా

ఎంతపుచ్చుకొంటారో, అక్కడరోగుల కియ్యవలసిన పాలూ రొట్టే వాళ్ళకి ఎంత వరకూ చేరుతున్నాయో, హాస్పటల్ మందులతో డాక్టర్‌గారు ప్రైవేట్ ప్రాక్టీస్ ఎంతసవ్యంగా చేసుకుంటారో—ఇవన్నీనిజంగా తెలీవా? తెలిసినా తప్పులుఅంతా చేస్తారు కాబట్టి ప్రథమ తప్పిదంగా ప్రతిసారీ క్షమిస్తారు. లేదా చూసీచూడనట్లు వూరుకుంటారు. (కాస్తఆగి)

క్షయసంగతి చూడండి! కార్మికులకు చాలినంత జీతం, తలదాచుకోడానికి శుభ్రమైన కొంపా ఇస్తే, ఈ రోగం ఎక్కడి దక్కడె ఎగిరి పోతుందని మీకుతెలీదా? ఎంతహీనంగా పోషించబడ్డా వృథాగా ఈ పెద్దలందరికీ సిరి సంపదల్ని ఆర్జించి పెడుతున్నది వారేనని, మీకు తెలియదా! పైగా "ఉమ్మి వేయకూడదు" ని రైళ్ళలోనూ, కార్ఖానాల్లోనూ ధర్మ పన్నాలు ప్రకటిస్తారు. సెభాస్! మంత్రులు—బాధ్యతగల మంత్రులు! సిఫిలిస్ ఒక సమస్య కిందే కన్పించలేదా మీకు? క్షమించండి ఇలామాట్లాడినందుకు,

గౌ. వెంక: డాక్టర్‌గారూ, అందరూ పడుతున్న అపోహలోనే మీరూపడ్డారండీ! ప్రపంచం లోని అన్ని రోగాలకూ మంత్రివర్గాలదే బాధ్యత అంటే ఎలా? గొప్పగొప్ప సైంటిస్టులు చెయ్యాలాపని. మీరుసలహాలివ్వాలి కాని—

డాక్టర్; పరిపాలనా బాధ్యతల్ని మీద వేసుకొని సంపాదించుకోవటం తెలిసినవారికి రోగాల నుంచి తప్పించే బాధ్యతలు తెలీవంటారా? ఈ వ్యవస్థనే అలాపట్టుకొస్తున్నారు. 1938 లో అంతర్జాతీయ కార్మిక కార్యాలయం, ఇండస్ట్రియల్ లేబర్ ఆఫ్ ఇండియా లో 98 వ పేజీలో ఏమివ్రాసిందో, * ఆరోగ్య అభివృద్ధి విచారణ సంఘం 1946లో ఏమని తన నివేదిక నిచ్చిందో పొరబాటు నన్నా మీరు చూశారా? ఆ నివేదికలన్నీ ఇపుడు ఈ ప్రజా ప్రభుత్వపు రద్దీలో గాలికి ఎగిరి పోయాయనుకొంటాను.

గౌ. వెంక: నిజంగా మనం చేయగలిగిన వేమైనాఉన్నాయంటారా?

డాక్టర్: అది మీరాలోచించాలి. నిన్న తమచీటీ చూచింతరువాత, ఆరోగ్య శాఖామంత్రిగారి హోదాలో ఏదో విచారణ చెయ్యడానికి వొస్తున్నారనుకొన్నాను. 'టైమ్‌ఫిక్సు' చేసిం తరువాత నారోగుల నిద్దరిని ఇక్కడికి రమ్మన్నాను తమకు చూపించాలని, భయపడకండి! 'షాక్' కూడాకావొద్దు. ఈఅనంతమైన మానవ జీవితంలో వాళ్లు కుళ్లుసరుకులు మాత్రమే! కొంచెం దీర్ఘంగా ఆలోచిస్తారనేకాని—తమకు 'పేథాలజీ' మీద పాఠాలు చెప్పటానికికాదు, తమరు వేరేపనిమీద వచ్చారు. ఐనా ఇక్కడే ఉన్నారు కాబట్టి ఇక వెళ్లనివ్వను.

[నిశ్శబ్దం]

---

* రజనీపామీదత్తు వ్రాసిన నేటి భారతదేశంనుంచి

కూర్చుంటారు కదూ?

[వెంకటాద్రిమయ్యగారు కష్టంగా వొప్పుకుంటారు.]

ఈసారి ఒక్క_క్షణం మీవ్యక్తిగత బాధల్ని దాటి ఇలాంటి కారణాలవల్ల కుళ్ళి పోతున్న లక్షలాది సామాన్య ప్రజల్నిగురించి ఆలోచించండి! ఏకులంలోగానీ, ఏమతంలో గానీ, ఏవర్గంలోగానీ వేలాది ప్రజ దీనితో కుమిలిపోతున్నారు. ఈరోగం గుడిసెలనుంచి సౌధాలకు నాలుగడుగుల్లో చేరుకొంటుంది. కనుక కుళ్లుకాలవల్ని మరామత్తు చేయాలనటం కుటుంబాల్ని బాగుచెయ్యటం కోసమే. మనకున్న ఆగర్భశత్రువల్లా అజ్ఞానం! అజ్ఞానమనే మళ్లీ అంటున్నాను. ఎవర్నడిగినా ఒకటే సమాధానం వినిపిస్తుంది. 'నాకు తెలియదంటే, నాకుతెలియద'ని. ఇంక మాదగ్గరకొచ్చేరోగులు ఏమాత్రమూ ఆశలేని స్థితిలోనేవస్తారు. అప్పటికే వాళ్ల శక్తివంచనలేకుండా ఈరోగాన్ని నలుదిక్కు_లా వెదజల్లిఉంటారు. ఏమాత్రం ముందుగావచ్చినా ఈప్రమాదంనుంచి అందర్నీ కాపాడే అవకాశముండేది. ఏమిటయ్యా యీఘోరమంటే—'మాకుతెలియదండి' అనేస్తారు.

(తలుపుదగ్గరకెళ్తూ) ఏంచెయ్యగలం చెప్పండి! కొంపల్లోంచి, రోడ్లమీంచి యీడ్చి ఎంతమందినని కాల్పించగలం చెప్పండి!

( ఆగి వెయిటింగ్‌రూమ్‌లోఉన్న ఎవరినో పిలుస్తాడు.)

ఇలారా!

[ఒకస్త్రీ ప్రవేశిస్తుంది—మిల్లుకూలీది.]

అలాకూర్చో ! (ఆమె కూర్చుంటుంది.)

(డాక్టర్, వెంకటాద్రిమయ్యకేసి తిరిగి)ఇదొక కేసు, ఈమెకు చాలా జబ్బుగాఉంది. అలా అని ఆమెకు చెప్పాను; వారానికొకసారి ఇక్కడికి రమ్మని కూడా చెప్పాను.

[స్త్రీతో]

అవునా?

స్త్రీ : ఔనండి

డాక్టర్ : (కోపంగా) ఎన్నాళ్ళయింది నీవు కిందటి సారివచ్చి ?

స్త్రీ : మూడునెల లయిందండీ;

డాక్టర్ : మూడునెలలు! ఇలాఅయితే నేనెలా బాగుచెయ్యగల ననుకొన్నావ్? లాభంలేదు- వింటున్నావా? ఏమీలాభంలేదు. ఏం, ఎందుకు రాలేదు? చాలాభయంకరమైన జబ్బుతో నీవు బాధపడుతున్నావని నీకుతెలీదూ?

స్త్రీ : ఔను—తెలుసునండి! మా ఆయన ఆజబ్బుతోనే చచ్చిపోయాడు.

డాక్టర్॥ (మెల్లిగా) నీభర్త ఆజబ్బుతోనే చచ్చిపోయాడా?

స్త్రీ : ఔనండి!

డాక్టర్॥ డాక్టర్ దగ్గరికి వెళ్లలేదా?

స్త్రీ : లేదండి!

డాక్టర్: అప్పటికీ నీవు కళ్లుతెరవలేదా ?

స్త్రీ : మీరు రమ్మన్నపుడు ప్రతిసారీ వచ్చేదాన్నే—కాని నాకు కుదరదండీ!

డాక్టర్: అంటే? కుదరక పోవట మేమిటి?

గౌ. వెంక : ఉచితంగా ఇక్కడ సలహాలు ఇస్తారుగా?

స్త్రీ : ఔనండి! ఆసమయంలో నేను మిల్లులో ఉండాలండి! ఎలారాగలనో చెప్పండి? అందరి వాంతూ వచ్చేవరకూ ఆగాలి. అంతసేపూ ఇక్కడేవుండిపోతే నానౌకరీ ఊడి పోతుందండి. పొమ్మంటారు మిల్లుయజమానులు. ఇంక—ఇంక ఇంతకాలమూ ఆగిపోయాను. తరవాత....

డాక్టర్ : ఊఁ,

స్త్రీ : ఏమీలేదుబాబూ / మీరెంతో దయగా చూశారు.

డాక్టర్: చెప్పు, భయంలేదు.

స్త్రీ : నేనెప్పుడూ ఇంతదరిద్రం అనుభవించలేదు. నాభర్తకు జబ్బుచేసేవరకూ బాగానే బతికేంబాబూ! తరవాత తలతాకట్టు పెట్టుకోవలసొచ్చింది. తప్పేఅనుకోండి, కాని గడవకబాబూ! అదిగాక నలుగురితో కలిసి అలాగే ఉండిపోతే—అందరిఎదుట నాగురించి చెప్పటానికి—తప్పేఅనుకోండి—ఎలాచెప్పగలనుబాబూ!

డాక్టర్ : పాపం !

(ఆగి—దయగా)

ఐతే నీభర్తదగ్గరనుంచి ఈవ్యాధి అంటించుకొన్నావన్నమాట ?

స్త్రీ : ఔనండీ / పల్లెటూరివాళ్లంబాబూ ! అక్కడేఅంటించుకొన్నాడాయన. ఒక పెద్ద ఈనాందారువద్ద పనిచేసేవాడు. ఏముందిబాబూ, ధాన్యంపోగుచేసుకోడానికి బొమ్మరసాన్లు వస్తుంటారు. ఈయన రెండుమోపుల పనలు కట్టి ఇస్తుండేవాడు. అంతే ఆ జబ్బుతోటి ఇంచుమించు మతికూడా పోగొట్టుకొన్నాడు. ఏంచేస్తున్నాడో అతనికి తెలిసేదికాదు. మేంకొనలేని వేవేవో తీసుకురమ్మని తిట్టేవాడు.

డాక్టర్ : ఏదైనా ఐస్త్రీవెళ్ళి డాక్టర్‌కు ఎందుకుచూపించుకోలేదు ?

స్త్రీ : చూపించుకొన్నాంబాబూ అతన్ని పనిలోంచి తొలగించేశారు. చేతిలో ఒక్కకానీ కూడా లేకపోతే అన్నీ అమ్మేసుకొని ఇక్కడికి వచ్చాం. తరవాత ఆసుపత్రిల్లో జేర్చాం.

డాక్టర్ : తరువాత ?

స్త్రీ : అక్కడదొరకలా చూసేవారుబాబూ ! రంగునీళ్లు పోసేవారంతే !

డాక్టర్ : ఏం ఎంచేత ?

స్త్రీ : ఇండీషన్లు ఇప్పించుకోడానికి డబ్బేది బాబూ। ఊరికే ఇవ్వరుగదండీ। ఇంకనాతప్పేముంది బాబూ।

డాక్టర్ : నీకు పిల్లలులేరా ?

స్త్రీ : చలా కడుపులు పోయాయి బాబూ ! మాకు పెళ్ళయిన కొద్దిరోజులకే అతనికి ఆజబ్బంటుకొంది.

[నిశ్శబ్దం]

డాక్టర్ : (తను వ్రాసిన ఒక కాగితం ఆమెకిచ్చి) ఇది నాఇంటినెంబరు. ప్రతి ఆదివారం ఉదయంవచ్చి నన్ను కలుసుకొంటూండు. (తలుపుదగ్గరకువెళ్లి) ఇలారా। (వెనుకనడుస్తుందామె. తలుపుదగ్గర కొంతడబ్బు ఆమెచేతిలో పడేసి విసురుగా) ఇది తీసుకొని ఇక వెళ్ళిపో—

స్త్రీ : బాబూ - అదేంటి - నేను !....

డాక్టర్ : 'నాన్సెన్స్' నాకు టైమ్‌లేదు ఇవన్నీ వినడానికి. ఊఁ। వెంటనే వెళ్ళిపో. (ఆమెను మెల్లగా తోసేసి—ప్రేక్షకులకు కనబడని ఎవరితోనో మాట్లాడుతూ) ఏమండీ ! ఏంకావాలి ?

పురుషుడు : (బైటనుంచే) ఈఉదయం మీరు చూచిన కుర్రాడితండ్రినండి. నేనిక్కడికి రావొచ్చునాఅని, మీతో తరువాత మాట్లాడ వచ్చునాఅని అడిగేను కదండీ।

డాక్టర్ : ఔను - జ్ఞాపకం వచ్చింది. మీఅబ్బాయి కాలేజీలో చదువుకొంటున్నాడుకదూ ?

పురుషుడు : (గుమ్మంలో) ఔనండి !

డాక్టరు : రండి లోపలికి ఫరవాలేదు - ఈ ఊరు కాదులెండి వీరిది. మాట్లాడవచ్చు.

పురుషుడు : (ప్రవేశించి) మాకష్టాలు మీకు తెలిసినవేగా। నాకొడుక్కి పద్దెనిమిదేళ్లు. ఈ వ్యాధి కారణంగా సగం పక్షవాతం వచ్చేసిందపుడే. మాది చిన్నవ్యాపారంబాబూ. వాణ్ని కాలేజీకి పంపడానికి చెమటోడ్చి సంసారం అతిక్లుప్తంగా చేసుకొంటూ వచ్చాం. ఆఖరికి....

డాక్ట : కూర్చోండి !

పురు : (కూర్చుంటూ) ఒకరోజు కాలేజీనుంచి వచ్చేస్తుంటే మావాడు ఆకుళ్లముండల వల్లోపడ్డాడు. ఆముండలనావిధంగా బహిరంగంగా తిరగనియ్యటం న్యాయంఅంటారా? పద్దెనిమిదేళ్ల కుర్రవాళ్లని అలా దుర్మార్గానికి తిప్పుకుపోతుంటే ఇంతమంది పోలీసులూ ఏం చేస్తున్నారు ? 'బ్రోదల్‌ఏక్టు' ఏమయింది ? 'చెకింగ్' అనే వొంకతో లోపలికెళ్లి ఇంకసలు బైటకు ఊడేరాని - ఈపోలీసు ఇనస్పెక్టర్లు తమ 'డ్యూటీని' అతిసవ్యంగా నిర్వర్తిస్తారుబాబూ !

డాక్టర్ : అదికాదులే.

పురు : ఐతే ఎందుకు ఆపరుమరి ?

డాక్టర్ : (వెంకట్రామయ్య కేసి ఓరగా చూస్తూ) నాకు తెలీదు.

పురు : నాకొడుకుని చూడండి ! కాటిలోనే కాని ఇంక బాగుపడే అవకాశంలేదు. చక్కని కుర్రాడు. వాడంటే ఎంతో గర్వంగా ఉండేదిమాకు !

డాక్టర్ : నిరాశ చెందకండి ! మీవాడిని బాగుచెయ్యడానికి చేయగలిగిందంతా చేస్తాను (జాలిగా)ఇంతకాలం నాదగ్గరకు తీసురాకుండా ఏం చేస్తున్నారు ?

పురు : వాడికేంఉందో నాకెలా తెలుస్తుందిబాబూ ! నాతోచెప్పడానికి భయపడి—అలాగే జబ్బు ముదరబెట్టుకొన్నాడు. ఇటు ఆబాధకి ఆగలేక నాకుతెలీకుండా నాటువైద్యుల దగ్గరికి వెళ్ళాడు. వాడిచ్చింది కాస్తా కాజేసి ఏవోబైరాగి చిట్కాలువేసి వెనక్కి తోసేశారు బాగుచెయ్యకుండానే. యీ క్యాటలాగు వైద్యుల్నికూడా న్యాయమే అంటారా ? ఇలాంటి అన్యాయాలు జరుగుతూంటే ప్రభుత్వం ఏంచేసిందో చెప్పండి, సిపాయిల్ని పెంచుతోంది తప్ప. ఏదీ కొత్తగా నాలుగు హాస్పటల్సన్నా కట్టించిందా ? ఎందుకీ నిధులూ, స్మారక సభలూను? ఒక్కొక్కడు చస్తే లక్షల్ని పుంజి పుచ్చుకొంటున్నారు మళ్ళీ. నారికురుపులు, బోదకాళ్లు ఎంతవరకూ రాకుండా చేశారో చెప్పండి. ఎందుకీ ఆరోగ్యశాఖలు ? శానిటరీ ఇనస్పెక్టర్లు, హెల్తు ఆఫీసర్లు - అబ్బో! సిబ్బంది చాలా ఉంటుంది ! మెడికల్ కాలేజీలో అదనంగా ఎంతమంది విద్యార్థులు చేరడానికి అవకాశం కల్పించారు? సీటుదొరకాలంటే మంత్రిగారి రికమండేషను కావాలికదా ? ఏదో జపాన్ స్కూలుపిల్లలు ఏనుగుల్ని చూడలేదని ఏడుస్తుంటే మన జాతీయ నాయకులు ఒక ఏనుగుని పంపిస్తూ వాళ్లకళ్లనీళ్ల తుడిచారు. తిండిలేక, గుడ్డలేక చదువుకొనే అవకాశంలేక, మందిప్పించు కోడానికి డబ్బులేకఏడ్చే లక్షలాది అనాధ శిశువుల మాటేమిటి బాబూ ? మాగోడు ఎవరువింటారు ? శ్రీరామచంద్రా !

డాక్టర్ : అవును, ప్రభుత్వానికి—ఒకే నెపంఉంది. ఈ సంగతులేవీ వాళ్లవరకూ రాలేదంటారు. భయపడకండి ! మీ అబ్బాయికంటే విషమించిన కేసులు బాగుచేశాం. తక్కినవాళ్లవిషయం అంటారా—వీలుచూచుకొని వాళ్ళనుచూదాం.

(డాక్టర్లేచి అతనికి దారిచూపిస్తాడు. వెంకట్రామయ్య వైపుతిరిగి)

చూస్తున్నారా—మనమూఢ విశ్వాసాన్ని రాజ్యాంగ యంత్రాన్ని పూర్తిగా మార్చుకోవాలి. సిఫిలిస్ అనేమాట ఉచ్చరించడానికైనా తగని ఘోరపాపంకింద పరిగణించడం ముందు మానాలి. ఆవ్యాధియొక్క లక్షణాలు, దారుణఫలితాలు ప్రజలకు అసలుతెలియనే తెలియవు. అందుకే ఆవ్యాధిఇంకా దగ్ధంచేస్తోంది ప్రజల్ని—ఇలా దేశమంతటా వ్యాపిస్తోంది. ఏమిటంయ్యా అంటే—'నాకుతెలీదు' అదిఎలా అంటుకొంటోందయ్యా అంటే— 'నాకుతెలీదు'. 'సరైన జాగ్రత్త తీసుకోకపోతే ఎంత

ప్రమాదకరం అవుతుందో మీకు తెలియదా' అంటే—'నాకు తెలీదు' అంతే ప్రతిఒక్కడి సమాధానమూను — 'నాకు తెలీదు—నాకు తెలీదు— నాకు తెలీదు'. మూడవప్రపంచ యుద్ధం ఎందుకురావాలో స్కూల్సులో చెప్తారుగాని ఇలాంటి రోగాల్ని గురించి చెప్పరు.

గౌ. వెంక : ఏమైనా ఇలాంటి విషయాలు స్కూల్సులో పిల్లలకు చెప్పటం ఎలాకుదురుతుంది డాక్టర్ ?

డాక్టర్ : ఏం, ఎందుకు కుదరదు ?

గౌ. వెంక : వాళ్ళబుద్ధిని పెడదార్లు తొక్కించదండీ !

డాక్టర్ : వాళ్ళకి చిన్నతనంలోనే అనవసరపు కుతూహలం కలుగుతోందని వాళ్లకు విద్యచెప్పకుండా అలాంటి విషయాల్ని దాచివేసినంత మాత్రాన ఆభావాలు కలగకుండా చేయగలమనా మీ అభిప్రాయం ? ఎలిమెంటరీ బడిలోకి వెళుతున్న ప్రతీ కుర్రాడికీ, ప్రతికుర్రదానికీ ఈ సంగతులన్నీ తెలుసు. వాళ్ళకుతూహలాన్ని అణచాలని మీరుచేసే ప్రయత్నమల్లా వారిని తప్పుదారుల్ని తొక్కిస్తూనేఉంది. ప్రేమవల్ల జీవితాన్ని పునరుత్పత్తి చేసేచర్యలో అవినీతి ఏముందో చెప్పండి ? కానిమన పిల్లల అభివృద్ధి కోసమని చెప్పి, మౌనం వహించి వాళ్ళని అడ్డమైన దారుల్లోనూ వ్యభిచరించేలా చేస్తున్నాం. ఈపెద్దమనుషులంతా ఏంచేస్తున్నారో చూడండి : తమఆడపిల్లలకి సంగీతంపేర "రతిసుఖసారే గతమభిసారే" లాంటి బూతు పాటల్ని పాడిస్తున్నారు—ఇవన్నీ భక్తిలక్షణాలు కాబోలు ! అవన్నీవింటూ నోరు చప్పరిస్తూ కూర్చునే ఈపెద్దమనుషులు ఇవన్నీ సశాస్త్రీయ విమర్శతో వాళ్ళకు స్కూల్సులో తెలియజెప్పరామంటే 'హరిహరీ' అని చెవులు మూసుకొంటారు! ఈపెద్దమనుషులంతా నాదగ్గరికి సలహాల కొచ్చేవాళ్ళే. ఇది వ్యభిచారంకాదు. శాస్త్రం. ఈజాతి భవిష్యత్తు ఈనాటిబాలబాలికల్లోనేఉంది. అల్లాంటప్పుడు తమపిత్రార్జితాలుగా ఈరోగాల్ని అనుభవించి పెంపొందించి తమసంతతికి ప్రసాదించవలసివస్తే ఈ జాతి ఎన్నితరాలలో శూన్యమైపోతుందో ఆలోచించండి !

గౌ. వెం : యువకులకి కొంత నిగ్రహం ఉండాలి.

డాక్టర్ : నిగ్రహం ఇదంతానటన ! ఇతరులముందు సహజంగా కనపడితే లోకువని భయం. కోర్కెలతో మధనపడుతూ అవిలేనట్టు కప్పిపుచ్చేందుకు జీవితాన్ని ఎన్ని వంకర్లోతిప్పి బాధపడతారు. కోర్కెలు ఎంతతక్కువగాఉంటే అంత గౌరవనీయుడూ పవిత్రుడూను, ప్రస్తుత ప్రపంచంలో. అందరూ కోర్కెల్ని రేకెత్తించుకొనేవారే ! కాని కోర్కె కలిగిందని ఇతరులకి తెలీటం భరించలేరు. సహజమైన యదార్థాలని కప్పిపుచ్చే ఈ దొంగవేషాలు, వెకిలితనాలు తుడుచుకుపోవాలి. సృష్టి

కార్యంలో ప్రతియువకుడూ గర్వంతో 'ఇన్‌స్పైర్' కావాలి; భావిసంతతియొక్క పురోభివృద్ధి వారిచేతుల్లోనే ఉందని గ్రహించాలి. 'సెక్సు' నీచమని బోధించటం కాదు—దాన్ని దుర్వినియోగం చేసుకోవద్దని బోధించాలి. అపవిత్రకార్యాన్ని నిర్బంధించి, ఖండించి, శాశించడం అమానుషం!

గౌ. వెంక : కాని ఇంకాకొంచెం ముందుకువెళ్ళాలేమో! ఈరోగంఎక్కడ పుట్టిందో అక్కడే మనం 'ఆపరేట్' చేస్తే తీరిపోతుందిగా! వ్యభిచారాన్ని నిర్మూలిద్దాం. సాంఘికజీవితాన్నే విషపూరితంచేస్తున్న ఇలాంటి వేరుపురుగుల్ని—పడుపుకత్తెల్ని మనంపూర్తిగా ఏరించి వేద్దాం.

డాక్టర్ : కాని మరచిపోతున్నారు—ముందు వాళ్లనేమనం విషపూరితం చేశాం, పాపం! అలాంటిదాన్ని మీకొకామెను చూపిస్తాను. కొంచెం మోటుగా మాట్లాడినా తమరు బాధపడకండి! ఆమె 'వేనిటీ' మీద 'ప్లే' చేసి ఆమెచేత అంతాచెప్పిస్తాను. పెద్ద సినిమాస్టార్ అవ్వాలని ఆమెకోర్కె. [తలుపు తెరుస్తాడు. ఇరవైఏళ్ల చక్కని యువతి ప్రవేశిస్తుంది. చలాకీగా సరదాగా ఉంటుంది.] ఊఁ రాలోపలికి. ఏం, ఎలా ఉన్నావ్? [సమాధానానికి ఆగకుండానే] సినిమాలో చేరాలని ఇంకా ఉందా?

యువతి : ఎందుకుండదూ?

డాక్టర్ : ఐతే—వీరికొక స్నేహితుడున్నాడు-ఒకడైరక్టర్. నీకోఉత్తరం వ్రాసిస్తారు-ఏం?

యువతి : ఓ - అలాగే! కాని వారు నాయోగ్యతా ప్రవర్తనల గురించి అడిగేరా. బైటకు దూకేస్తా!

డాక్టర్ : అడగరులే! వీరితో నీగురించి అంతాచెప్పు. నీవు చెయ్యదలచుకొన్నదీ, ఇంతవరకూ ఏంచేసిందీ వీరితో కొంచెం మాట్లాడు!

యువతి : మాతలిదండ్రులు మంచిస్థితిలో ఉండేవారు, నన్నొకహైస్కూలుకి పంపించారు....

డాక్టర్ : [అడ్డువస్తూ] ఆచెత్తంతా చెప్పక్కర్లేదు. ఒక్కమాటకూడా నమ్మరాయన

యువతి : ఓహో! నిజమంతా చెప్పానా—చచ్చానన్నమాటే!

డాక్టర్ : ఫరవాలేదు! వారేమీ అనుకోరు. ఊఁ, తరువాత మద్రాసు వచ్చావు....

యువతి : ఔను.

డాక్టర్ : దాసీగా ఒక పెద్దవారింట్లో కుదిరావు.

యువతి : ఊఁ!

డాక్టర్ : అపుడు నీకెంతవయసు?

యువతి : అపుడే పదిహేడు వెళ్ళాయి.

డాక్టర్ : అపుడు నీకొక కొడుకుపుట్టేడు కదూ?

యువతి : [ఆప్రశ్నకు ఆశ్చర్యపోతూ] ఔను—మరుసటి సంవత్సరం!

డాక్టర్ : ఆపిల్లవాడి తండ్రెవరు ?

యువతి : [సాధారణమైన విషయంలాగే] ఏం, ఇంటి యజమానే!

డాక్టర్ : ఊఁ, చెప్పు! యజమానురాలికి తెలిసింది. అపుడేంజరిగింది ?

యువతి : [అదేధోరణిలో] నన్నుబైటకు తరిమేసింది. దానిస్థానంలో నేనేఉంటే దాన్ని గెంటించేద్దును. [ఆగుతుంది]

డాక్టర్ : చెప్పు, ఎందుకు ఆగావు ? చెప్పేసేయ్. వీరిది పల్లెటూరు—ఇలాంటివేమీ అర్థం కావు.

యువతి : [కులాసాగా] అలాగే—అంతాచెప్పేస్తాను. ఒకరాత్రి అంతా పడుకొన్నతరువాత యజమాని మెల్లగావచ్చి నాపక్కలో చేరాడు; నేను కంగారుపడి లేచాను. 'నోరెత్తేవా, అవతలికి తోసేస్తా' నన్నాడు. నేనేమీ మాట్లాడలేక పోయాను. తరువాత నన్ను.... [వివరాలన్నీ చెప్పడానికి అనుమానిస్తుంది.]

డాక్టర్ : [వెంటనేఆపి] ఆగాగు! ఆల్‌రైట్! నీపని పోయిన దగ్గరనుంచి మొదలుపెట్టు.

యువతి : ఇదంతా తమాషాగా ఉందనుకొంటున్నారేమో వీరు....

డాక్టర్ : ఫరవాలేదు. ఇప్పుడేం చేస్తున్నావో వీరికోచెప్పు!

యువతి : మీహాస్పటల్‌కి వస్తున్నాగా ప్రతిరోజూ ?

డాక్టర్ : కాదు - నీవు హాస్పటల్‌కి రాకముందు ?

యువతి : రోజుకి ఐదుగంటలూ వీధుల్లోనే....

డాక్టర్ : ఔననుకో ఏంజరుగుతుంటుందో చెప్పువీరికి. ఈయంది పల్లెటూరు—అన్నీ తెలుసుకోవాలనుకొంటున్నారు. చెప్పు....

యువతి : ఇవన్నీ తెలియందెవరికండీ! ఏబస్‌స్టాండ్ దగ్గరో ఆగుతాను ఎవరికోసమో చూస్తున్నట్టు, ఎక్కడికో వెళ్ళాలన్నట్టు లేక ఏషాపుదగ్గరో ఏదోకొన్నట్టు. రైల్వేస్టేషన్‌లో ఎవరినో 'రిసీవ్' చేసుకోవడానికి వచ్చినట్టు రైలంతా వెదికేస్తాను. 'రిటైరింగ్ రూమ్సు' ఒక్కసారి అన్నీ పరీక్షించేస్తాను. ఇవన్నీ మాటలన్నమాట! ఎవడో ఒకడువచ్చి పడతాడు. నాతో ఏం మాట్లాడాలో వాళ్ళకెవరూ చెప్పక్కర్లేదు. అందరికీ అలవాటే. వాళ్ళనేవి రెండేమాటలు—'చాలాజోరుగా నడుస్తున్నావే' అనో లేక 'ఒంటరిగా వెళుతున్నావ్- భయంలేదూ ?' అనో అంటారు. వాటిఅర్థం ఏమిటో అందరికీతెలుసు. ఒంటరిగా నడచి వెళ్ళిపోతుంటే ఒకపెద్దమనిషి కారులో వెనకాలే వచ్చి 'లిఫ్ట్' ఇమ్మంటావా ? అని అడుగుతాడు. దాని అర్థంకూడా తెలుసు - ఏబీచ్‌కో, లేక ఏమారుమూల రెస్టరెంటుకో అని. కొంచెం ఖరీదైనవేట ఇంకోటుంది. కాలేజీ గర్ల్‌లా తయారై చేతిలో పుస్తకాలతో ఏ 'బసోటా'కో వెళతాను, ఎవరినో వెదుకుతున్నట్టు. రకరకాల వ్యక్తులు తాగుతూ, తింటూ కూర్చుంటారు. ఎవడైతే కొంచెం సరదాగా నాకేసిచూస్తాడో వాడివద్దకేవెళ్ళి అతినాజూగ్గా చెంపమీద వేళ్ళతో

తట్టి పక్కనే కూర్చుంటాను. కొత్తవాడైతే ఖంగారు పడతాడు. అన్నీ మనమే చెప్పాలి. పాతవాడికి అంతాతెలుసు అక్కడనుంచి నేనే ఆర్డరు ఇస్తుంటాను. తరువాత అంతా సెటిల్ అవుతుంది — టేక్సీవస్తుంది. ఏహోటల్ గదులు ఖాళీగా ఉన్నయోచూడ్డం—మిష్టరూ. మిస్సెస్సూ....అంతే !

డాక్టర్ : ఎలాంటివాళ్ళు వీళ్ళంతా ? టేక్సీ డ్రైవర్లు. షాప్ గుమస్తాలు....

యువతి : కాదండోయ్ / చాలాపెద్దమనుషులే

డాక్టర్ : ఔను—అలాగే అంటారు.

యువతి : పెద్దపెద్దసూట్లు వేసుకొని — కాలేజీస్టూడెంట్లూ, ఆఫీసర్లు, క్లబ్ శెక్రిటరీలు టెన్నీసు ఆటగాళ్ళు—ఎందరెందరో నన్ను తీసుకు పోతుంటారు. కేన్ మెరాలు, కేసినోలు, బీచిలు, బోటుషైర్లు—అబ్బో, నేను వెళ్ళందేముంది, చూడందేముంది? ఒకోసారి ఐదారుగురు స్నేహితులు, పెద్దమనుషులు, ఆఫీసర్లు కలిసి నన్నుతీసుకు పోతుంటారు—ఏదో కాంప్ వంటపెట్టి ఏటావలప్సు బంగాళాకో — ఏ ఎక్స్‌కర్షన్‌కో. ఇంకచూసుకోండి—వాళ్ళందరికీ సమాధానం చెపుతూండాలి. వాళ్లమధ్య కూర్చోబెట్టుకొని....క్రిమంతప్పి వాళ్లవాంఛలు తీర్చుకొనేందుకు తగిన విరామం కల్పించుకొంటారు. నాముద్దులతో వాళ్ళ చిరాకుల్ని తుడిచివెయ్యాలి. నానేర్పుతో చమత్కారంలో వాళ్ళకోర్కెల్ని రేపాలి. తరువాత నరాలకు చల్లదనం కల్పించాలి.

డాక్టర్ : ఔను—అదంతా తెలుసులే. నీకొడుకుగురించి చెప్పు. ఏమయింది తరువాత?

యువతి : చిన్నచోటే ట్రిప్లికేన్‌లో వదిలేశాను.

డాక్టర్ : [వెంకట్రామయ్యతో] గోషాహాస్పటల్‌లో....?

గౌ. వెంక : అలా వొదిలెయ్యటానికి నీకు చేతులెలావచ్చినయ్?

యువతి : నావీపుమీద వేసుకొని వాణ్ణికూడా తిప్పి ఆకలితోమాడ్చి చంపమంటారా ?

గౌ. వెంక. ఏమైనా నీకొడుకేగదా ?

యువతి : ఐతే వాడితండ్రి సంగతి ? అతనికొడుకు కూడాను, కాదా ? చూడండి ఇంకీవిషయం వదిలేసి—మీ రిద్దరూ చెప్పండి, ఆపరిస్థితిలో నేను చేసేదేమిటో ? ఒకనర్సుకి అప్పజెప్పమంటారా ? అలానేచేద్దును — చేతినిండా డబ్బుంటే ! ఇంకోచోటకు పని కోసం వెళ్ళాలను కొన్నాను. కాని అక్కడిచ్చే దాసీజీతంతో నర్సునీ, పిల్లవాణ్ణీ ఎలా పోషించగలనో చెప్పండి ! నీలిగా బతకాలంటే—ఆపిల్ల వాణ్ణి నాదగ్గరే ఎలాఉంచుకోగలను ?

గౌ. వెంక, దారుణం !

[వెంకట్రామయ్యను ఆగమన్నట్టు డాక్టర్ చెయ్యి ఎత్తుతాడు]

యువతి : [మంటగా] నిజం చెపుతున్నాను. అంతకంటే నేనింక ఏంచెయ్యగలను ? మీరేనాపరిస్థితిలోఉంటే—మీరుకూడా అంతేచేసేవారు. [తగ్గుతూ] ఇవన్నీ దాచు

కొంటే వచ్చేదేమిటి ? 'నువ్వు నీచంగా బతుకుతున్నావ్' అంటారు మీరు. ఇంకేముంది, అంతకంటే వేరే దారేది ? ఎందుకో పనిచేస్తున్న ఒక్కచోటా ఉండలేకపోయాను. ఆకలేస్తుంటే ఎవరైనా భోజనం పెడతా రమ్మంటే — అక్కర్లేదని ఎవత్తె వద్దంటుందో ఏదీ చూస్తాను ?—ఒకసారి నాకు జ్వరంవస్తే ఒక హోటల్‌లో ఉండిపోవలసివచ్చింది వారంరోజులు. ఇంకచూసుకోండి—పంచెకట్లు, గూడకట్లు, సూట్లు, ఒకటేమిటి—నన్ను వేపుకుతిన్నాయ్. జబ్బుతో ఉన్నానని ఒక్కడికీ జాలిలేదు. మందిప్పించాలని ఒక్కడికీ తోచదు. వెధవలు, చచ్చువెధవలు, కులుకుతూ వచ్చి వాళ్ళ పచ్చుజబ్బులన్నీ అంటిస్తారు. ఏం, అలాంటి కుక్కల్ని ఎందుకు జైళ్ళలో పెట్టకూడదు ? గవర్నమెంటు ఏంచేస్తోంది ? మేంలోకువ యీ పోలీసువాళ్లకు.

డాక్టర్ : నీవేంపుచ్చుకొన్నావో దానికి నాల్గురెట్లు ఎక్కువగానే ఇచ్చావ్ వాళ్ళకు, ఔనా ?

యువతి : [కులాసాగా] ఐనా నా సొమ్ము ఏమీజారిపోలేదులెండి [వెంకట్రామయ్యగారితో] మీకు ఇంకా పూర్తిగా వినాలని ఉందనుకొంటాను [ఆగి] కొంచెం తేరుకొన్నతరువాత ఆ హోటల్‌లోంచి నన్ను పంపించివేశారు. జోరుగా నడిచి వెళ్ళిపోతున్నాను. రోడ్డుమీద నాఎదుట ఎవరుకన్పించారో తెలుసా ? నా పాతయజమాని ! సంతోషంతో అతన్ని చూచాను. లోపలనుకొన్నాను—'రా, చిట్టినాన్నా ! నాకు బాకీఉన్నదంతా వడ్డీతోసహా ఇచ్చేద్దువుగాని' అని. తమాషాగా నవ్వుతూ కన్నుకొట్టాను. పడిపోయాడంటారా ? క్షణంపట్టలేదు. [దీనంగా] అతను దులుపుకు వెళ్ళిపోయింతరువాత ఇంక నాకేమయిందో తెలీదు; మతిపోయిందేమో అనుకొన్నాను. కనిపించిన ప్రతీవాడినీ రమ్మన్నాను—డబ్బిచ్చినా ఇవ్వకపోయినాసరే ! అందగాళ్ళు యువకులు, మెడికల్ స్టూడెంట్లు....నాకిచ్చినదానికి రెండురెట్లు ఎక్కువేఇచ్చాను. అసహ్యించుకొని నామీద ఉమ్మేసేవాళ్ళ పతివ్రతలూ, పిల్లలూ యుగాలవరకూ పురుగులుపట్టి శిథిలమై పోయేట్టు ఆజబ్బులన్నీ వాళ్లకే ప్రసాదించి నాకసిఅంతా తీర్చుకొన్నాను. ప్రేమ మొదటేలేదు — ఈద్వేషాన్నైనా కటాక్షించిందివిధి. [ఆగింది] ఇంకేఆశలూ మిగల్లేదు; నేనేమైపోతేనేం, అనుకొన్నాను తరువాత. దేనికీ లెక్కలేక పోయింది. ఎందుకు ముఖంముడుచుకోవాలి ? అంతాఒక్కసారి తలుచుకొంటే నవ్వొస్తుంది. తిరిగి గౌరవంగా ఎలా బతుకుతాను ? నీచవృత్తితో కుంగిపోయి మంచిజీవితం ఎలాజీవించగలను ? అలవాటైపోయింది—ఈజీవితం ! సంఘజీవనంలో అడుగుపెట్టడానికి నాకుఅధికారం ఏదీ ? జన్మెత్తినందుకు కొంచెమైనా — ఒక్కరాత్రైనా ఒక్కగంటైనా ఆదరం పొందగలిగానంటే, నాకున్న ఒక్క అవకాశం—ఈశరీరం నేనేకాదు — ఇలా బతికేవాళ్ళు చాలామందున్నా రిక్కడ ! ఏం, ఎందుకు చేస్తున్నారిలా ? బతకాలి — బతకాలనే

కోర్కె — ఊపిరి పీల్చుకోవాలనే కోర్కె — బతకాలి — పొట్ట కోసం, బండికోసం! జబ్బుగా ఉన్నా — ఆకలితో మాడి చచ్చిపోతున్నా — బతకాలి కాబట్టి! [ఆగి] ఎందుకీ బ్రొతల్ఏక్టులు? ఏ ఆఫీసరైనా మాదగ్గరికి రాకుండా ఉన్నారు గనుకనా? ఔను — నీతిగానే బతుకుతాం. ఈవృత్తి మానేస్తాం. ఏదీ. మాకువేరేదారి చూపించమనండి గవర్నమెంటును! తిండీబట్టా ఇవ్వమనండీ! ఈనీచవృత్తిలో ఇంకెందరు ఉంటారో చూస్తాను! మడి మెక్క. రొవ్వెక్కి కూర్చోలేదిలా పిటులకోసం! మాకు సరదా అనుకొన్నారా — ఈకుళ్ళుజబ్బులన్నీ అంటించుకోటం! సంస్కర్తలు పైబడేరి మమ్మల్ని ఉద్ధరించాలని ఏవేవో ఏక్టులు పెట్టమంటారు; పెళ్ళిళ్ళు చేసుకోమంటారు: ఒక్కడితోనే ఉండిపొమ్మంటారు. నిజంగా పెళ్ళిచేసుకోవాలనే ఉంది. ఒక్కడితోనే ఉండిపోవాలనే ఉందినాకు. రమ్మనండి, ఆపెళ్ళిచేసుకొనే సంస్కర్తని!

డాక్టర్ : ఇంతమంది వస్తుంటారే, ఏమైనా గడించావా?

యువతి : [నవ్వి] ఇదిగో — చూడండి! ఈగిల్టుగాజులు నాలు రూపాయిలరకం; ఈఇమిటేషన్ హారం ఆరురూపాయిలరకం; ఈఉంగరం, గాజురాయి. తెలివైన వ్యాపారస్తుడెవడైనా ఈవిషయాల్లో సంబంధం పెట్టుకొంటే — నాగుండెలమీద ఐదురూపాయిలని గుర్తువేసి ఉండేవాడు. (ఆగి నవ్వుతుంది) ఎందుకులెండి ఇవన్నీ! నాపేరు ఆడైరెక్టర్‌గారితో చెపుతారా? డాక్టర్‌గారు ఇస్తారు నాఎడ్రెసు.

గౌ. వెంక : తప్పకుండా!

యువతి : నమస్కారం — రేపువస్తాను డాక్టర్‌గారూ!

[వెళ్ళిపోతుంది.]

డాక్టర్ : ఆఖరువరకూ ఆమెజీవితం చెప్పించటం అనవసరమంటారా? చూడండి ఆమెబతుకు! ఏకారణాలవల్ల, ఏపరిస్థితుల్లో అలాతయారౌతున్నారో ఆలోచించండి! మనసమస్యఅంతా ఆస్త్రీలోనే ఇమిడిఉంది. ఈమె ఒక ఉదాహరణ! ఈవ్యాధి అంతటికీ కారణం ఈవిపరీతాలన్నింటికీ మూలం ఈస్త్రీయే! (వెంకట్రామయ్యగారు లేస్తారు. డాక్టర్ ద్వారంవరకూ వెళతాడు — నమస్కారంచేస్తూ ఆజోడించిన చేతులు అలానేఉంచి) ఇంతకంటే తమకుచెప్పేదేమీలేదు. రేపుతమరు 'కౌన్సిల్' లో కూర్చోబోయేముందు తమరు విన్నదీ కన్నదీ ఒక్కసారి దీర్ఘంగా, నిజంగా, బలంగా ఆలోచించు కొంటే — మనశ్రమంతా వృథాచేశామనుకోను.

(తెర)

ఐపోయింది.

1. "శిల్పానికి చిత్రలేఖనం ఎలాగో వాచికం ఆంగికానికి అలాంటిది." ఈవాక్యాన్ని వివరించండి.

2. దృశ్యాలు నాటకప్రదర్శనలో ఏపాత్ర వహిస్తాయి ?

3. 'లంకాదహనం' వంటి నాటకాలకీ 'కుళ్లుసరుకు' వంటి నాటకాలకీ ఉన్న తారతమ్యమేమిటి ?

4. మీకు నచ్చిన కొన్ని నాటకాలను పేర్కొని అవి ఏతరగతకి చెందినవో సహేతుకంగా వ్యాఖ్యానించండి. [కామెడీ, ట్రాజెడీ, ఫార్సు, మెలోడ్రామా వగైరా.]

5. రంగప్రదర్శనానుకూల పరిస్థితులపై నాటకరచన ఆధారపడుతుందని నార్ల వెంకటేశ్వర్రావుగారు చెప్పారు. నాటకరంగ చరిత్రను దృష్టిలో ఉంచుకొని వారి వాక్యాలను వివరించండి.

6. ఈక్రింది స్థానం వారి మాటల్ని విమర్శించండి.

(1) ప్రతీనటకుడూ సర్టిఫికేట్లను పొందాలి; సర్టిఫికేట్లులేని నటకులు నటించరాదు.

(2) ఒక నాటకాన్ని ప్రదర్శించదలచినవారు ఆపట్టణ ఛైర్మన్‌కు ముందుగా వినిపించి అనుమతి పొందాలి.

7. సెన్సార్ ఎవరు? ఈ ఉద్యోగివల్ల వచ్చే సాధక బాధకాలేమిటి ?

8. నాటక ప్రయోజనావశ్యకతనుగురించి విపులంగా చర్చించండి.

9. ఈ నాటకంలో శిల్పంలేదనీ, ప్రచారధోరణి ఎక్కువగా ఉన్నదనీ శ్రీధనికొండ అన్నారు. దానిని విమర్శించండి.

10. రాఘవేంద్రం, గా. వెంకట్రామయ్యల శీలపరిశీలన చేయండి.


11. గొల్ల, రాఘవేంద్రంకుటుంబానికి తీరనిద్రోహం చేసిందనే సుందరమ్మ అభిప్రాయం. అది ఎంతవరకూ సమంజసం ?

12. ఎక్కువమంది స్త్రీలు వ్యభిచారిణులుగా ఎందుకు తయారౌతున్నారు ?

13. పసిపిల్లలకి లైంగికజ్ఞానం అవసరమా ? ఎంతవరకు ?

14. "ప్రేక్షకుల రసోద్రేకాలమీదనటించి సెబాసనిపించుకోవటం కంటే, వారిబుద్ధికి పనిచెప్పి సానుభూతి ఆర్జించటం మంచిది." — వివరించండి.

15. ఈ నాటకంలో రెండవరంగం ఉండటంవల్లవచ్చిన అదనపు ఎఫెక్ట్సు యేమిటి ?



త్వరలో :

# మనస్తత్వాలు.

## శ్రీ రాంషా కథలు

స్థూలదృష్టికి మానవుడెంతో సామాన్యుడుగా గోచరిస్తాడు ; కాని, కొంచెం నిశితంగా పరిశీలించినట్లయితే అతనే ఎంతో సంకీర్ణంగా తోచకమానడు.

నిజ మానవ ప్రవృత్తిలోని విచిత్రాలను వికల్పిస్తూ ఇంత ఉత్తమ పుస్తకం ఇదివరకు వెలువడి ఉండదు.

★

ముందుగా మీ కాపీలను రిజర్వు చేసుకోండి.

# కామేశ్వరి కథ

రాంషాగారి అపూర్వసృష్టి

రెండవముద్రణకై ఎదురుచూడండి.

★

మానసిక తత్వచిత్రణంలో రాంషాది అందెవేసిన చెయ్యి అన్నది అరుణ; అయ్యవారిని చెయ్యబోయి కోతిని చేశాడన్నది ఆనందవాణి; కామేశ్వరి కథలోని పరమసత్యం మనస్తత్వం; అదే ప్రతీచదువరినుంచీ ఒక్క నిట్టూర్పును రాబట్టుతుందని అన్నది భారతి; కామేశ్వరిలాంటి వాళ్లు పిచ్చి ఆసుపత్రిలో ఉండాలన్నది తెలుగుస్వతంత్ర; రామ్మూర్తి జీవితంలోని విచిత్రానుభవాలు ఈ నవలలో చక్కగా విశదీకరింపబడ్డాయి అని ప్రశంసించింది ఆంధ్రప్రభ; ఒక చచ్చురకం ఇంగ్లీషు నవలలాగున్నదని చెప్పింది ఆనందవాణి; పరిసరవాతావరణాన్ని మానవ ప్రకృతి చిత్రణంతో మేళవించిన అందమైనకథ అన్నది నవ్యసాహితి; అర్థహీనమై వెగటు పుట్టిస్తున్నదని జాగృతి అన్నది. కామేశ్వరికోసం లోకాల్నిగాలిస్తూ తిరుగుతున్నానన్నది దేశబంధు; నాయికీనాయకులకు వివాహంచేయకుండా వదలిపెట్టటం బాగోలేదని విమర్శించింది మధు: అది వాళ్ళతప్పుకాదు; ఎవరితప్పూకాదు; అదే మనస్తత్వం అన్నది మాలి; మీరేమంటారు ?